బుధవారం
8-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 108
పేజీలు : 8, వెల:రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విమానం ల్యాండింగ్ గేర్ వద్ద మృతదేహాలు

వాషింగ్టన్: అమెరికాలో దారుణ ఘటన వెలుగు చూసింది. విమానం ల్యాండింగ్ గేర్ ప్రాంతంలో రెండు గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యం కావడం సంచలనం రేపింది.
ఫ్లోరిడాలోని ఓ విమానాశ్రయంలో జెట్‌బ్లూకు చెందిన విమానం తనిఖీల సమయంలో వీటిని గుర్తించారు. మృతుల వివరాలతోపాటు ఈ ఘటన ఎలా చోటుచేసుకుందనే విషయం తెలియాల్సి ఉంది. జెట్‌బ్లూకు చెందిన విమానం న్యూయార్క్‌లోని జాన్.ఎఫ్.కెనడీ విమానాశ్రయం నుంచి ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్డేల్ విమానాశ్రయానికి వచ్చింది.

రూ.500 కోట్లు ఇస్తాం

ఆరోగ్యశ్రీపై ఏపీ ప్రభుత్వం హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు వీలైనంత త్వరగా రూ.500 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తరపున వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి సీకే కృష్ణబాబు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం సేవలు(ఈహెచ్ఎస్) క్యాష్‌లెస్, ఉచిత ఓపీలు ఈనెల 6వ తేదీ నుంచి నిలిపివేసినట్లు ఆంధ్రప్రదేశ్ నెట్‌వర్క్ ఆస్పత్రుల

- మిగతా 2 లో

ఏపీ ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముంబై నటి జెత్వానీ కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, పోలీసు అధికారులు హనుమంతరావు, సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వరరావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయాలని హైకోర్టును సీఐడీ కోరింది. ఏ2గా ఉన్న అప్పటి

- మిగతా 2 లో

ఏపీలో 17 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో 17 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనా నాయక్‌ను నెల్లూరు టీజీపీ స్పెషల్ కలెక్టర్‌గా, కె.వెంకట రెడ్డిని నెల్లూరు జిల్లా ఆత్మకూరు టీజీపీ ఇరిగేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, దయానిధిని విశాఖపట్నం వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ మేనేజర్‌గా, బి.గాయిత్రీ దేవిని డాక్టర్ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా, వరద సుబ్బారావును పల్నాడు సమగ్ర శిక్ష ఏపీసీగా, ఆర్.రమేష్ బాబును డాక్టర్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నాన్నా, మూలిగే నక్కపై తాటిపండు పడటం అంటే?

ఒకే విడతలో దిల్లీ ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల- పోలింగ్: ఫిబ్రవరి 5
- ఎన్నికల ఫలితాలు: ఫిబ్రవరి 8
- నోటిఫికేషన్ విడుదల: జనవరి 10
- నామినేషన్ల స్వీకరణ గడువు: జనవరి 17
- పరిశీలన: జనవరి 18, ఉపసంహరణ: జనవరి 20

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది. మంగళవారం దిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేశారు. జనవరి 10న నోటిఫికేషన్ విడుదల కానుండగా... నామినేషన్ల స్వీకరణకు తుది గడువు: జనవరి 17గా నిర్ణయించారు. 18న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు: జనవరి 20తో ముగుస్తుంది. అన్ని అసెంబ్లీ

- మిగతా 2 లో

టిబెట్‌లో భారీ భూకంపం

126 మంది మృతి... 188 మందికి గాయాలు

- నేపాల్, భూటాన్, ఉత్తర భారతం, బంగ్లాదేశ్‌లోనూ ప్రకంపనలు
- హిమాలయ పర్వత శ్రేణుల్లో భూకంప కేంద్రం

హిమాలయ ప్రాంతాలైన నేపాల్-టిబెట్ సరిహద్దులను భారీ భూకంపం వణికించింది. ఈ భారీ భూకంపంతో టిబెట్‌లో 126 మంది మరణించారు.

2లో

కొత్తగూడెం సమగ్రాభివృద్ధి

కార్పొరేషన్ ఏర్పాటుతో ఏజెన్సీ చట్టాలకు ఢోకా లేదు

నిధులొస్తాయి... ఉద్యోగ, ఉపాధి పెరుగుతుంది

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ కావడం వల్ల ఏవో నష్టాలు జరుగుతాయన్న దుష్ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఏజెన్సీ చట్టాలకు, గిరిజన ప్రజలకు నష్టం జరిగే పరిణామాలు ఉంటే తాను కార్పొరేషన్ కోసం ఎందుకు ఇంతగా కృషి చేస్తానని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌గా మారడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక నిధులు వస్తాయని, తద్వారా పరిశ్రమలు అభివృద్ధి చెందటమే కాకుండా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కొందరు కావాలని ఆపోహలు సృష్టిస్తున్నారని, తాను ఎవరిపైనా విమర్శలు చేయబోనని అన్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డులోని పర్యాటక హరిత హోటల్‌లో కూనంనేని మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ రెండు జంట పట్టణాలతో పాటు సుజాతనగర్ మండలంలోని 7 గ్రామ పంచాయతీలతో కలిపి నూతన కార్పొరేషన్ ఏర్పాటు కానుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు వస్తాయని, కార్పొరేషన్‌లో ఆస్తుల విలువ రెండింతలు పెరుగుతాయని అన్నారు. పన్నులు పెరుగుతాయని కొద్దిమంది అపోహ పడుతున్నారని, భారీ మొత్తంలో ఏమీ పెరగవని చెప్పారు. విద్యార్థులకు వీసా, పాస్‌పోర్ట్‌లు పొందేందుకు స్థానికంగానే వీలు కలుగుతుందన్నారు. జిల్లాలో బొగ్గు, విద్యుత్, ఖనిజాలు ఉన్నందున, వాటికి సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఇంకా పెరుగుతుందన్నారు. మన ఏజెన్సీకి జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెంకు పారిశ్రామిక కారిడార్ ఏర్పాటవుతుందని కూనంనేని వివరించారు. కొందరు అపోహ పడుతున్నట్లు కార్పొరేషన్ ఏర్పాటుతో గిరిజనులు రిజర్వేషన్లు కోల్పోతారనుకోవడం తప్పుడు ప్రచారమని

- మిగతా 2 లో

మార్చి ఆఖరుకల్లా
మెట్రో డీపీఆర్‌లు

ఏప్రిల్ ఆఖరుకు టెండర్లు

త్వరితగతిన భూసేకరణ

సీఎం రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్‌లు) మార్చి ఆఖరుకల్లా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదంపొంది... ఏప్రిల్ ఆఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్-శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్-మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణ వెంటనే పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. మేడ్చల్ ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని, అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల వారు ప్రతి పనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాని మోదీ విశాఖ రాక

2లో

ఏ విచారణనైనా ఎదుర్కొంటా

హైకోర్టును ఆశ్రయిస్తా: కేటీఆర్

హైదరాబాద్: ఏసీబీ అధికారులు లాయర్ల సమక్షంలో విచారణ జరపాలని హైకోర్టును ఆశ్రయిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, చట్టపరమైన రక్షణ కల్పించాలని కోర్టును కోరుతానని పేర్కొన్నారు. నందినగర్‌లోని తన నివాసంలో కేటీఆర్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. మీరు దొంగలు.. మా పట్నం నరేందర్ రెడ్డి ఇవ్వని స్టేట్‌మెంట్‌ను ఇచ్చినట్లు బుకాయించారు. మిమ్మల్ని నమ్మను అని లాయర్‌ను తీసుకెళ్తానని చెప్పాను. కానీ ఏసీబీ విచారణకు తనతో పాటు లాయర్‌ను అనుమతించలేదు. రేపు కోర్టుకు వెళ్తాను. లాయర్ల సమక్షంలో విచారణ జరపాలని కోరుతున్నాను. నాకు ఈ దుర్మార్గుల నుంచి చట్టపరమైన రక్షణ కల్పించాలని

- మిగతా 2 లో

ఫార్ములా-ఈ కేసులో సుప్రీంకోర్టుకు కేటీఆర్

2లో

మా ఎన్నికల్లో మస్క్ జోక్యం: మేక్రాన్

అపర కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు ఇతర దేశాలతో విభేదాలు పెరుగుతున్నాయి. తాజాగా తమ దేశ ఎన్నికల్లో టెస్లా అధినేత నేరుగా జోక్యం చేసుకొంటున్నారని ఫ్రాన్స్ అధినేత మేక్రాన్ ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా అధికార మార్పిడి ఉద్యమానికి ప్రపంచంలోనే మస్క్ మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు

2లో

భారత్‌లో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడి

రూ.25 వేల కోట్లతో ఏఐ మౌలిక వసతుల విస్తరణ

8లో

అమెరికాకు ఇజ్రాయిల్ ఝలక్

ఇక సొంతగానే బాంబుల తయారీ

2లో

ఉద్యమాలతోనే దళిత హక్కుల పరిరక్షణ

సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

విశాలాంధ్ర-హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా దేశంలోని దళితులు నేటికీ వివక్షతకు గురికావడమంటే సమాజం సిగ్గుపడాల్సిన విషయమని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. హైదరాబాద్, ఖైరతాబాద్, విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐఆర్‌డీఎం) 2వ జాతీయ మహాసభల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంటరానితనం నిర్మూలన, అత్యాచారాల నిరోధక చట్టం లాంటి అనేక చట్టాలు వచ్చినప్పటికీ దేశ వ్యాప్తంగా దళితులపై ఇంకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయని అజీజ్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన కులాల వారీగా విడిపోయి ఐక్యమత్యంగా లేకపోవడం వల్లే అగ్రవర్ణాల అరాచకాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు

- మిగతా 2 లో

అభివృద్ధికి కుప్పం ప్రయోగశాల

- రూ.92 కోట్లతో పనులకు శ్రీకారం
- 8 వేలమందికి ఉద్యోగాలు
- ఏపీ సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం ప్రజల రుణం తీర్చుకునేం దుకే స్వర్ణకుప్పం విజన్ -2029 డాక్యుమెంట్ రూపొందించానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం రెండోరోజు పర్యటనలో మదర్ డెయిరీ, కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం తయారుకావాలన్నారు. మరో మూడు నెలల్లో కుప్పానికి వస్తానని... కడా అధ్వర్యంలో కుప్పంలో చేపట్టే అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.92.22 కోట్లు మంజూరు చేశాం. అందులో రూ. 22 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని తెలిపారు. గత ఐదేళ్లు ఈ ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. కుప్పంలో రూ.20 కోట్ల వ్యయంతో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. రూ.10 కోట్లతో 10 జంక్షన్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారుల సుందరీకరణ చేపడతాం. విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేశాం. రూ.19 కోట్ల వ్యయంతో పార్కులను అభివృద్ధి చేయబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. కుప్పం నియోజకవర్గంలో ఇకమీదట గుంతల రోడ్లు కనపడవని చెప్పారు. రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ. 34.27 కోట్లు మంజూరు చేశామన్నారు. శాంతిపురం పరిధిలో మదర్ డెయిరీకి 41 ఎకరాల 21 సెంట్లు భూములు కేటాయించామని, రూ. 105 కోట్ల వ్యయంతో రాబోతున్న ఈ డెయిరీ వల్ల 4 వేలమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. అలాగే శ్రీజ మహిళా మిల్క్ సంస్థ ఏర్పాటుతో మరో 4 వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. కుప్పం పరిధిలో రూ.22 కోట్ల వ్యయంతో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. డ్వాక్రా ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశామని, ఇప్పుడు కుప్పం నియోజకవర్గంలో అలీప్ సంస్థ సహకారంతో మహిళలకు వివిధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి

- మిగతా 2 లో

కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో భాగంగా

భారత కమ్యూనిస్టు పార్టీ బ్రిటీష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడినందువల్ల తీవ్ర నిర్బంధకాండ ఎదుర్కోవలసి వచ్చింది. తొలి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమం భావ జాలంలో అంతర్జాతీయత, పని తీరులో జాతీయత సూత్రాల మీద ఆధారపడి పని చేసింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

యూన్‌కు మరో వారెంట్

సియోల్: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కి వ్యతిరేకంగా కోర్టు మరో వారెంట్ జారీ చేసింది. యూన్‌ను నిర్బంధించేందుకు కోర్టు మరో వారెంట్ జారీ చేసినట్లు దక్షిణ కొరియా అవినీతి నిరోధక సంస్థ మంగళవారం తెలిపింది. అయితే ఈ వారెంట్ ఎంతకాలం చెల్లుబాటులో ఉంటుందో సంస్థ వెల్లడించలేదు. యూన్‌ను నిర్బంధించడానికి, ఆయన నివాసంలో సోదాలు జరిపేందుకు సియోల్ పశ్చిమ జిల్లా కోర్టు గతవారం ప్రారంభంలో వేర్వేరు వారెంట్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అవినీతి నిరోధక అధికారులు, పోలీసు అధికారులు గతవారం యూన్‌ను నిర్బంధించేందుకు యత్నించారు. అయితే అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో ఐదుగంటల పాటు కొనసాగిన ఉద్రిక్తత తర్వాత అధికారులు వట్టి చేతులతో వెనుతిరిగారు. ఈ వారెంట్ గడువు సోమవారంతో ముగిసింది. అయితే యూన్‌ను అరెస్ట్ చేసేందుకు అధికారులు మరో ప్రయత్నం చేయలేదు.

అమెరికాకు ఇజ్రాయిల్ ఝలక్

ఇక సొంతగానే బాంబుల తయారీ

టెల్అవీవ్: అమెరికాకు ఇజ్రాయిల్ భారీ ఝలక్ ఇచ్చింది. సొంతంగా ఆయుధాలు తయారు చేసుకోవాలని నిర్ణయించింది. ఆయుధాల కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. ఎల్బిట్ సిస్టమ్స్‌తో కలిసి స్థానికంగానే భారీ బాంబులు తయారు చేసేలా రెండు ఒప్పందాలు చేసుకొంది. దీనిలో భాగంగా సరికొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ దేశ రక్షణశాఖ రెండు ఒప్పందాలపై సంతకాలు చేసింది. ఐడీఎఫ్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం చాలా కీలకమైందని రక్షణశాఖ పేర్కొంది. తొలి ఒప్పందంలో భాగంగా ఎల్బిట్‌సంస్థ ఇజ్రాయిల్ వాయుసేనకు వేలకొద్ది భారీ బాంబులు సరఫరా చేస్తుంది. అమెరికా నుంచి ఆయుధ సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించుకోవడానికి ఈ నిర్ణయం తీసుకొంది. ఇటీవల ఒక షిప్‌మెంట్‌ను ఇజ్రాయిల్‌కు పంపకుండా నిలిపివేయాలని బైడెన్ సర్కారు నిర్ణయించడం టెల్అవీవ్‌ను ఆలోచనలో పడేసింది. రెండో ఒప్పందం కింద జాతీయస్థాయిలో వినియోగానికి వీలుగా ముడిపదార్థాల ప్లాంట్‌ను ఎల్బిట్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటి వరకు వాటిని విదేశాల నుంచి ఇజ్రాయిల్ దిగుమతి చేసుకొంటోంది. ఈ ఏడాది మేలో ఇజ్రాయిల్‌కు సరఫరా చేయాల్సిన ఆయుధాలను అమెరికా తాత్కాలికంగా నిలిపివేసింది. ఇందులో 2000 పౌండ్ల బరువైన 1800, 500 పౌండ్ల బరువైన 1700 బాంబులు ఉన్నాయి. ఆత్మరక్షణకు అవసరమైన ఆయుధాలను ఇజ్రాయిల్‌కు సరఫరా చేస్తామని, అయితే రఫాలో జరుగుతున్న పరిణామాలతో గతవారం ఈ నిర్ణయం తీసుకున్నామని అప్పట్లో అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ వివరణ ఇచ్చారు.

38 వేల శత్రు సైన్యం హతం: జెలెన్ స్కీ

కీవ్: రష్యా భూభాగమైన కర్స్క్ ప్రాంతంలో కొనసాగిస్తోన్న ఎదురుదాడిలో తాము గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా భూభాగంపై బఫర్ జోన్ సృష్టించి... ఆ దేశానికి చెందిన మిలిటరీ ఆస్తులు ధ్వంసం చేశామని ప్రకటించారు. శత్రు సైన్యంలో 38 వేల మంది చనిపోయారని వెల్లడించారు. వారిలో 15 వేలమంది రష్యా సైనికులు ఉన్నట్లు తెలిపారు. రష్యా సైన్యానికి మద్దతుగా పోరాడుతున్న ఉత్తరకొరియా సైనికులు కూడా భారీగా చనిపోయినట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు. పొక్రోవ్స్క్ ప్రాంతంలో పోరు తీవ్రంగా సాగుతోందని వెల్లడించారు. ఖర్కివ్, సుమీ ప్రాంతాల్లోని గ్రామాలపై గైడెడ్ బాంబులను రష్యా ప్రయోగిస్తోందని ఆరోపించారు. గగనతల రక్షణ వ్యవస్థల్ని పెంచాల్సిందిగా తమ మిత్రపక్షాలను కోరనున్నామని తెలిపారు. మరోపక్క, కర్స్క్ ప్రాంతంలో గత 24 గంటల్లో 540 మంది ఉక్రెయిన్ సైనికులను హతమార్చామని రష్యా రక్షణశాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన 8 అమెరికా క్షిపణులు, 72 డ్రోన్లను తమ గగనతల వ్యవస్థ కూల్చేసినట్లు పేర్కొంది.

మా ఎన్నికల్లో మస్క్ జోక్యం: మేక్రాన్

పారిస్: అపర కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు ఇతర దేశాలతో విభేదాలు పెరుగుతున్నాయి. తాజాగా తమ దేశ ఎన్నికల్లో టెస్లా అధినేత నేరుగా జోక్యం చేసుకొంటున్నారని ఫ్రాన్స్ అధినేత మేక్రాన్ ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా అధికార మార్పిడి ఉద్యమానికి ప్రపంచంలోనే మస్క్ మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రగతిశీల సంస్కరణలను ఆయన వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కెనడా ప్రధాని ట్రూడో కూడా ఇంతకుముందు స్పందిస్తూ... 'మనం ఆ విషయాలు మాట్లాడితే ప్రపంచంలోనే అతిపెద్ద సోషల్ మీడియా యజమాని మాత్రం సరికొత్త అధికార మార్పిడి ఉద్యమానికి మద్దతు ఇస్తారని, ఎన్నికల్లో నేరుగా జోక్యం చేసుకొంటారని అనుకోలేదు' అని అన్నారు. కొన్ని నెలల నుంచి మస్క్‌తో ప్రపంచ నేతలకు వివాదాలు చోటుచేసుకొన్నాయి. జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్, ట్రూడో, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ వంటి వారితో మాటల యుద్ధాలు జరిగాయి.

ఉద్యమాలతోనే దళిత హక్కుల పరిరక్షణ

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక ఉద్యమాలతో పాటు ప్రత్యేక దళిత ఉద్యమాలను మరింత ఉధృతంగా కొనసాగించేందుకు సమాయత్తం కావాలని కోరారు. ఏఐడీఆర్ఎం జాతీయ మహాసభల స్ఫూర్తితో దళితుల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు. ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రాంమూర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏఐడీఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ కుమార్, జాతీయ నాయకులు ఎం.బాలనరసింహ, కె.ఏసురత్నం, మరుపాక అనిల్ కుమార్, దేవి కుమారి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.500 కోట్లు ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అసోసియేషన్ (ఆశా) వెల్లడించింది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై... అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్ అవినాశ్ తదితర బృందంతో మంగళవారం విజయవాడలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ముఖ్యకార్యదర్శి సీకే కృష్ణబాబు చర్చలు జరిగారు. ఆరోగ్యశ్రీ బకాయిలు, నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యల్ని నాయకులు వివరించారు.

దాదాపు రెండు గంటలపాటు చర్చలు కొనసాగాయి. వీలైనంత త్వరగా రూ.500 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం తరపున కృష్ణబాబు హామీ ఇచ్చారు. చంద్రబాబు నేతృత్వంలో అందరికీ ఆరోగ్య భరోసా కింద ప్రజా పాలన కొనసాగుతోందని, గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని కృష్ణబాబు గుర్తుచేశారు. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ పేరుకుపోయిన బకాయిలపై చరిచస్తామన్నారు. రాష్ట్రంలో అందరికీ లక్ష ఆరోగ్య బీమాపై చర్చించారు. చర్చల్లో భాగంగా ప్రజలు నగదు రహిత ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడానికి ఆశా అంగీకరించినట్లు ప్రభుత్వం తరపున వెల్లడించారు.

అభివృద్ధికి కుప్పం ప్రయోగశాల

(మొదటిపేజీ తరువాయి)

సమర్థవంతంగా పనిచేస్తున్న కడా అధికారులను సీఎం అభినందించారు. కుప్పాన్ని టూరిజం హబ్ గా మారుస్తామని తెలిపారు. కుప్పం ప్రజలు కాలుష్యానికి దూరంగా ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఇంటిపై సోలార్ వెలుగులు రాబోతున్నాయని చంద్రబాబు వివరించారు. కుప్పంలో కార్గో ఎయిర్ పోర్టు రాబోతోందని, ఇక్కడి ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తీసుకొస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. టాటా సంస్థ సహకారంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఆయన చెప్పారు.

ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు సూచనల మేరకు వీరంతా ప్రణాళిక ప్రకారం జెత్వానీని కుట్రపూరితంగా కేసులో ఇరికించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టాన్ని ఉల్లంఘించిన నేపథ్యంలో వీరి విషయంలో దయ చూపవద్దని, దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ దశలో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని సీఐడీ వాదించింది. ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయండని కోర్టును కోరింది. ఈ కేసులో అధికారుల పాత్ర విధి నిర్వహణలో భాగంగానే ఉందని, కక్ష పూరితంగా చేసిందేమీ లేదని నిందితుల తరపు న్యాయవాది వాదించారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు నిందితులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చింది.

టిబెట్‌లో భారీ భూకంపం

బీజింగ్/ఖాట్మండు: హిమాలయ ప్రాంతాలైన నేపాల్-టిబెట్ సరిహద్దులను భారీ భూకంపం వణికించింది. ఈ భారీ భూకంపంతో టిబెట్‌లో 126 మంది మరణించారు. ఈ విషయాన్ని చైనా అధికారిక మీడియా సంస్థ పేర్కొంది. మరో 188 మంది గాయపడినట్లు తెలిపింది. రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలో ఉన్న లబుచె ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.35 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. కొన్ని క్షణాల పాటు తీవ్రస్థాయిలో ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం తర్వాత టిబెట్ ప్రాంతంలో మరో రెండుసార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వీటి తీవ్రత 4.7, 4.9గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రం ఉన్న టిబెట్ ప్రాంతంలో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద పెద్దసంఖ్యలో ప్రజలు చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

వణికిపోయిన టిబెట్... నేపాల్

ఎవరెస్ట్ పర్వత సానువుల్లోని టింగ్రిలోని గ్రామాలు, సగటు ఎత్తు 4,000-5,000 మీటర్లు (13,000-16,000 అడుగులు), భూకంపం సమయంలో అత్యంత తీవ్రంగా వణికిపోయాయి. దీని తర్వాత 4.4 తీవ్రతతో డజన్ల కొద్దీ అనంతర ప్రకంపనలు సంభవించాయి. భూకంప ప్రభావానికి ఇళ్లు, పర్వత శిథిలాలు రోడ్డుపైకి వచ్చి పడటంతో పాటు లట్సే పట్టణంలో జరిగిన పరిణామాలు సోషల్ మీడియాలో కనిపించాయి. వీడియోలో శిథిలమైన షాపులూ కనిపించాయి. కాగా, భూకంప కేంద్రం నుంచి 20 కి.మీ (12 మైళ్లు) లోపు మూడు టౌన్‌షిప్‌లు, 27 గ్రామాలు ఉన్నాయి. మొత్తం జనాభా 6,900, 1,000 కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయని జిన్హువా నివేదించింది. స్థానిక ప్రభుత్వ అధికారులు భూకంపం ప్రభావాన్ని అంచనా వేయడానికి, ప్రాణనష్టం వివరాలు తెలుసుకోవడానికి సమీపంలోని పట్టణాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. భూకంపం తర్వాత చైనా ఎవరెస్ట్ ప్రాంతాన్ని పర్యాటకులకు మూసివేసింది. ఉత్తర-దక్షిణ కుదింపు, పశ్చిమ-తూర్పు ఒత్తిడిలో ఉన్న ప్రాంతంలో లాసా బ్లాక్ అని పిలువబడే ప్రాంతంలో చీలిక కారణంగా టింగ్రీ ప్రకంపనలు సంభవించాయని చైనా నిపుణులను ఉటంకిస్తూ సీసీటీవీ నివేదించింది. 1950 నుంచి లాసా బ్లాక్‌లో 6 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రతతో 21 భూకంపాలు సంభవించాయి. వీటతిలో అతిపెద్దది 2017లో మెయిన్లింగ్‌లో 6.9 తీవ్రతతో సంభవించిన భూకంపం. కాగా, మెయిన్లింగ్ టిబెట్‌కు చెందిన యార్లంగ్ జాంగ్బో నది దిగువ భాగంలో ఉంది. ఇక్కడ చైనా ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ఆనకట్టను నిర్మించాలని యోచిస్తోంది. 2015లో నేపాల్ రాజధాని ఖాట్మండు సమీపంలో 7.8 తీవ్రతతో సంభవించిన ప్రకంపనలు, దేశంలో ఎన్నడూ లేని విధంగా సంభవించిన భూకంపం కారణంగా సుమారు 9 వేల మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. మృతుల్లో కనీసం 18 మంది మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంపు వద్ద హిమపాతం ఢీకొని మరణించారు. అయితే తాజాగా మంగళవారం ఈ ప్రకృతి విపత్తులో భూకంప కేంద్రం నుంచి 400 కి.మీ (250 మైళ్లు) దూరంలో ఉన్న ఖాట్మండులో ప్రకంపనలు సంభవించాయి. నగరంలోని నివాసితులు తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. 'మంచం వణుకుతోంది. నా బిడ్డ మంచం కదుపుతున్నాడని నేను అనుకున్నాను. నేను అంత శ్రద్ధ చూపలేదు. కానీ కిటికీ వణుకుతున్నందున ఇది భూకంపమని నాకు అర్థమైంది. నేను ఇంకా భయంతో వణుకుతున్నాను. షాక్‌లో ఉన్నాను' అని ఖాట్మండు నివాసి మీరా అధికారి చెప్పారు. ఖాట్మండులో బలమైన ప్రకంపనలను అనుభవించిన తర్వాత ఒక వ్యక్తి ఇంటి పైనుంచి దూకి గాయపడ్డాడని నేపాల్ పోలీసు ప్రతినిధి బిశ్వా అధికారి తెలిపారు. ఆ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. భూటాన్ రాజధాని థింపూ, నేపాల్ సరిహద్దులో ఉన్న ఉత్తర భారత రాష్ట్రం బీహార్‌లో కూడా భూకంపం సంభవించింది. అయితే ఇప్పటివరకు, ఆస్తి నష్టం లేదా నష్టం గురించి ఎటువంటి నివేదికలు అందలేదని భారతదేశం, భూటాన్ అధికారులు తెలిపారు.

ఉత్తర భారతదేశంలో ప్రకంపనలు

ఎవరెస్ట్ పర్వత సానువుల్లో సంభవించిన భారీ భూకంపానికి మంగళవారం ఉదయం బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తో సహా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రకంపనలు సంభవించాయి. 10 కిలోమీటర్ల లోతులో 28.86 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 87.51 డిగ్రీల తూర్పు రేఖాంశంలో భూకంపం దాని కేంద్రంతో ఉదయం 6:35 గంటలకు సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఎస్) నివేదించింది. కొద్దిసేపటికే ఈ ప్రాంతంలో రెండు తదుపరి భూకంపాలు నమోదయ్యాయి.

ఉదయం 7:02 గంటలకు 4.7 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయి. దాని కేంద్రం అక్షాంశం 28.60 డిగ్రీల ఉత్తరం, రేఖాంశం 87.68 డిగ్రీల తూర్పు, 10 కిలోమీటర్ల లోతులో ఉంది. నిమిషాల తర్వాత, ఉదయం 7:07 గంటలకు, 30 కిలోమీటర్ల లోతులో 28.68 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 87.54 డిగ్రీల తూర్పు రేఖాంశంలో 4.9 తీవ్రతతో మరో భూకంపం నమోదయింది. బీహార్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు బలంగా కనిపించాయి. ప్రజలు భయాందోళనలతో తమ ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల నుంచి బయటకు పరుగులు తీశారు. రాజధాని పాట్నాతో పాటు బీహార్‌లోని పూర్నియా, మధుబని, శివర్, సమస్తిపూర్, ముజఫర్‌పూర్, మోతిహారి, సివాన్‌తో సహా సగానికి పైగా జిల్లాల్లో కూడా భూకంపం సంభవించింది. ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. అనేక ఇళ్లు ఊగిపోవడం చూసి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం లేచి భర్తకు టీ పెట్టాను... చేతిలోని టీ కప్పు వణుకుతూ టీ తాగుతున్నాడు. ఇంతలో ఇంట్లో ఫ్యాన్లు కూడా వాటంతట అవే ఊగడం మొదలుపెట్టాయి. భూమి కంపిస్తున్నదని గ్రహించాం. మా కింద భూకంపం వచ్చినట్లు స్పష్టమైంది' అని పూర్నియా నివాసి శ్వేతా దేవి తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు.

జపాన్‌లోనూ భూకంపం

జపాన్‌లో 6 తీవ్రతతో భూకంపం సంభవించింది. జపాన్ వాతావరణ సంస్థ (జేఎంఏ) ప్రకారం, మంగళవారం దక్షిణ జపాన్‌లోని తోరిషిమా ద్వీప ప్రాంతంలో 6.0 తీవ్రతతో సాయంత్రం 5:32 గంటలకు భూకంపం సంభవించినట్లు తెలిపింది. తోరిషిమా దీవుల ప్రక్కనే ఉన్న సముద్రంలో కేంద్రీకృతమై ఉంది. భూకంప కేంద్రం 31.4 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 138.7 డిగ్రీల తూర్పు రేఖాంశంలో 420 కి.మీ లోతులో ఉంది. ఈ ప్రకంపనల కారణంగా ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదని జేఎంఏ పేర్కొంది.

కొత్తగూడెం సమగ్రాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

కొట్టిపారేశారు. పరిపాలనకు, రిజర్వేషన్లకు సంబంధం లేదని అన్నారు. ఇందుకు ఉదాహరణ చెబుతూ... మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ లాంటి పొరుగున ఉన్న షెడ్యూల్డ్ రాష్ట్రాల్లోనే గిరిజన చట్టాలు అమలులో ఉన్నాయని వివరించారు. ఈ రాష్ట్రాల్లో కార్పొరేషన్ విధానం అమలులో ఉందని కూనంనేని గుర్తు చేశారు. పాల్వంచ మునిసిపాలిటీకి ఎన్నికలు గత 29 ఏళ్లుగా జరగటం లేదని, కార్పొరేషన్ ఏర్పాటు పాల్వంచకు వరప్రదాయిని వంటిదని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలకు విముక్తి కలుగుతుందన్నారు. దీనికితోడు ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు డిస్టెన్స్ లిమిటేషన్ నిబంధన లేనందున కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ, రెండు నూతన ఆర్టీసీ బస్‌స్టాండ్‌ల నిర్మాణం జరగబోతుందని, జిల్లా పరిషత్ కార్యాలయం, ఎంఆర్‌ఓ, ఎంపీడీవో కార్యాలయాలకు నూతన భవనాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈఎస్‌ఐ ఆసుపత్రితో పాటు నూతన బొగ్గు బావుల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే పారిశ్రామిక పార్క్ ఏర్పాటు, క్రీడల అభివృద్ధి కోసం ఇండోర్ స్టేడియం, ఐటీ హబ్, జులాజికల్ పార్క్ లాంటి అభివృద్ధి పనులకు అవకాశాలు పెరిగాయని అన్నారు. రాష్ట్రంలోనే మన జిల్లా రెండవ పారిశ్రామిక జిల్లాగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబిర్ పాషా, ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, డీసీసీబీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు, ఉర్దూగర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, తూము చౌదరి, జెట్పీడీసీ మాజీ సభ్యుడు ముత్తయ్య, ధర్మారావు, ఆన్తోటి పాల్, సీపీఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, రాజ్ కుమార్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, పూర్ణచంద్రరావు, భూక్య దసురు, వీరస్వామి దీటి లక్ష్మీపతి, పద్మజ, రాహుల్ కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఏ విచారణనైనా ఎదుర్కొంటా

(మొదటిపేజీ తరువాయి)

కోర్టును ప్రాధేయపడుతానని కేటీఆర్ పేర్కొన్నారు. కొంతమంది మంత్రులు వారే న్యాయమూర్తులు అయిపోతున్నారు. వాళ్లే శిక్షలు వేస్తున్నారు. ట్రయల్ మీడియాలో, సచివాలయంలో, మంత్రుల పేషీల్లో జరగదు. కోర్టుల్లోనే జరుగుతది. మేం కోర్టుకు పోతే మీకు ఉలికిపాటు ఎందుకు? ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లో అరపైసా అవినీతి కూడా జరగలేదు. తెలంగాణ కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయేందుకు విశ్వనగరంగా ప్రతిష్టించేందుకు ఆశించి ఈ పని చేశాం. మీలాగా ఏదో ఆశించి గూడుపుఠాణి కోసం చేయలేదని కేటీఆర్ తెలిపారు. ఈవీలకు తెలంగాణను కేంద్రం చేయాలనే ఆలోచన చేశాం. మీలాగా దివాలాకోరు పని చేయాల్సిన ఖర్మ లేదు. 110 శాతం చెబుతున్నా... ఏ విచారణకైనా వస్తా... కోర్టు మన్నిస్తే లాయర్లతో వస్తా... ఈడీ కూడా పిలిచింది... వారి దగ్గరకు కూడా పోతాను. సమాధానం చెప్పేందుకు రెడీగా ఉన్నాను. దాపరికం లేదు. దాచాల్సింది ఏం లేదు. నిజాయతీకి ధైర్యం ఎక్కువ. తప్పకుండా నేను ముమ్మాటికీ తెలంగాణ బిడ్డగా, రోషంగల బిడ్డగా ఏ విచారణనైనా ఎదుర్కొంటాను. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఫార్ములా-ఈ కేసులో సుప్రీంకోర్టుకు కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫార్ములా-ఈ కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ తనపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును కేటీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో కేటీఆర్ తరపు న్యాయవాది మోహిత్‌రావు పిటిషన్ వేశారు. ఏసీబీ తనపై తప్పుడు కేసు పెట్టిందని, దాన్ని క్వాష్ చేయాలంటూ కేటీఆర్ హైకోర్టును కోరగా... ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు.. క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పు వెల్లడించింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించింది. దీంతో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కోర్టు తీర్పుపై ఇప్పటికే లీగల్ టీమ్‌తో చర్చలు జరిపారు. మరోవైపు ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియెట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు కూడా వినాలని పిటిషన్‌లో కోరింది.

ఒకే విడతలో ఢిల్లీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహిస్తారు. 8వ తేదీన ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు వెల్లడిస్తారని రాజీవ్‌కుమార్ మీడియాకు వివరించారు.

ఈవీఎం అవకతవకలు, రిగ్గింగ్‌కు తావులేదు

ఢిల్లీ ఎన్నికల షెడ్యూలు విడుదల సందర్భంగా ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిర్దిష్ట గ్రూపులను లక్ష్యంగా చేసుకొని ఓటర్ల జాబితాలో వారి పేర్లు తొలగించడం, కొందరి పేర్లు చేర్చడం జరిగిందని కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఈవీఎంల గురించి సమాధానం ఇచ్చిన తర్వాత కూడా కొందరు ఈవీఎంల అవకతవకలపై మాట్లాడుతున్నారన్నారు. ఈవీఎంలలో వైరస్, బగ్ కానీ, చెల్లని ఓట్లు కానీ ఉండవని, రిగ్గింగ్‌కు అవకాశం లేదని స్పష్టం చేశారు. భారత్‌లో 99 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారని, ఓటింగ్, మహిళల్ని భాగస్వామ్యుల్ని చేయడంలో ఎన్నికల సంఘం కొత్త రికార్డులు సృష్టించిందని, త్వరలో 100 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లతో సరికొత్త రికార్డు నమోదు కానుందని చెప్పారు. మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటడం దేశంలో మహిళా సాధికారతను బలంగా చాటుతోందన్నారు

ఎన్నికల జాబితాలో అవకతవకలపై ఇప్పటికీ కథనాలు వస్తున్నాయని, ఈ విషయంలో 70 స్టెప్స్ ఉంటాయని, ఎన్నికల జాబితా, ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంలు, పోలింగ్ స్టేషన్లు, ఫార్మ్ 17 (సీ), కౌంటింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. పార్టీలు, అభ్యర్థులు అక్కడ తమతో ఉంటారని చెప్పారు. 'ఎన్నికల జాబితాలు రూపొందించేటప్పుడు రెగ్యులర్ సమావేశాలు ఉంటాయి. ఫామ్-6 లేకుండా సాధ్యం కాదు. ప్రతి దశలోనూ బీఎల్‌ఏను నియమించుకునే హక్కు ఉంటుంది. అభ్యంతరాలు తలెత్తితే ప్రతి పార్టీతో షేర్ చేసుకుని దానిని వెబ్‌సైట్‌లో ఉంచుతాం. ఫామ్7 సమర్పించేంత వరకూ పేర్లు తెలగించడం సాధ్యం కాదు' అని రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు.

ముక్కోణపు పోరు

ప్రస్తుతం అసెంబ్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి 62 మంది, బీజేపీకి 8మంది ఎమెల్యేలు ఉన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న ఆప్, వచ్చే ఎన్నికల్లో కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. అటు ఆమ్ ఆద్మీ పార్టీని అడ్డుకుని కేంద్ర పాలిత ప్రాంతంలో పాగా వేయాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఇప్పటికే ఆప్ 70మంది అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్, బీజేపీ కూడా కొన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశాయి. కాగా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మూడు పార్టీల మధ్యే పోటీ నెలకొంది. దేశ రాజధాని వేదికగా ఈ మూడు పార్టీల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. ఆప్ ఇప్పటికే 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి, ప్రచార వేగాన్ని పెంచింది. మునుపెన్నడూ లేని స్థాయిలో ఢిల్లీ ప్రజలపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హామీల జల్లు కురిపిస్తున్నారు. ఆప్‌కు పోటీ పెరిగినందు వల్లే ఆయన వరుస పెట్టి ఎన్నికల తాయిలాలు ప్రకటిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇక ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా నాలుగోసారి పోటీ చేస్తున్నారు. సీఎం ఆతిశీ, ఆప్ సీనియర్ నాయకురాలు కల్కాజీ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగారు. బీజేపీకి సంబంధించి కీలక నేతల్ని ఆ పార్టీ బరిలో నిలిపింది. మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు ప్రవేశ్ సాహిబ్ సింగ్ వర్మను అరవింద్ కేజ్రీవాల్‌పై పోటీ చేస్తుండగా, సీఎం అతిశిపై మాజీ ఎంపీ రమేశ్ బిధూరిని బీజేపీ బరిలోకి దింపింది. 29 మంది అభ్యర్థులతో బీజేపీ విడుదల చేసిన తొలి జాబితాలో ప్రవేశ్ సాహిబ్ సింగ్ వర్మ, రమేశ్ బిధూరి పేర్లు ఉన్నాయి. ఇటీవల బీజేపీలోకి చేరిన మాజీ మంత్రి కైలాశ్ గెహ్లోత్‌కు బిజ్వాసన్ అసెంబ్లీ స్థానం కేటాయించారు. అలాగే రాజ్ కుమార్ ఆనంద్‌ను పటేల్ నగర్ నుంచి, ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీని గాంధీ నగర్ నుంచి బీజేపీ పోటీలో నిలిపింది. ఢిల్లీలో ఆప్-కాంగ్రెస్ మధ్య పొత్తు కుదరని సంగతి తెలిసింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే 48 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఢిల్లీ మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ అరవింద్ కేజ్రీవాల్‌పై పోటీ చేయనున్నారు. 2013, 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానంలో షీలా దీక్షిత్‌ను అరవింద్ కేజ్రీవాల్ ఓడించారు. సందీప్ దీక్షిత్ గతంలో రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. దీంతో ఈ నియోజకవర్గంపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఇక కల్కాజీ స్థానంలో సీఎం ఆతిశీపై పోటీ చేసేందుకు అల్కా లాంబాను కాంగ్రెస్ పార్టీ పోటీలో నిలిపింది.

నేడు పధాని మోదీ విశాఖ రాక

విశాలాంధ్రబ్యూరో- అమరావతి / విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఏపీకి వస్తున్నారు. విశాఖపట్నంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 8వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు ఢిల్లీ నుంచి నేరుగా ప్రత్యేక విమానంలో ప్రధాని విశాఖపట్నం చేరుకుంటారు. సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకు చంద్రబాబుతో కలిసి రోడ్ షోలో పాల్గొంటారు. అనంతరం సుస్థిరాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో దాదాపు రూ. 2 లక్షల కోట్లతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన వేదిక నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి మోదీ, సీఎం చంద్రబాబు ప్రసంగిస్తారు. విశాఖపట్నం సమీపంలోని పూడిమడక వద్ద అత్యాధునిక ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా ఇదే తొలి గ్రీన్ హైడ్రోజన్ హబ్. ఈ ప్రాజెక్టు పెట్టుబడి దాదాపు రూ. 1,85,000 కోట్లు.

20 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాల్లో పెట్టుబడి ఇందులో భాగం. తద్వారా రోజుకు 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇది దేశంలోని అతిపెద్ద సమీకృత గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటిగా మారింది. దానితోపాటు హరిత మిథనాల్, హరిత యూరియా, పర్యావరణ హిత వైమానిక ఇంధనం సహా రోజుకు 7500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులను అందించగల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు ప్రధానంగా ఎగుమతి మార్కెట్‌ను లక్ష్యంగా పని చేస్తుంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజయేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యం దిశగా భారత్‌కు ఈ ప్రాజెక్టు విశేషంగా సహాయపడుతుంది.

ఏపీలో 17 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పీఏగా, బి.నారదమునిని పల్నాడు జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా, ఎస్.జాన్సన్‌ను ప్రకాశం జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా, వి.ఎస్.లోకేశ్వర రావును ఏఎస్ఆర్ జిల్లా పాడేరు గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, టీవీజీఎస్ కుమార్‌ను కాకినాడ ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, ఎం.శ్రీనివాసరావును విజయవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సెక్రెటరీ (సర్వీసెస్) కమిషనర్‌గా, పి.వెంకట రమణను తోటపల్లి బ్యారేజి ప్రాజెక్టు యూనిట్ త్రీ ఇరిగేషన్ (ఎల్ఏ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, పి.మురళి కృష్ణను విశాఖపట్నం వీఎంఆర్డీఏ కార్యదర్శిగా, రాజ రమేష్ ప్రేమ్ కుమార్‌ను రాజమహేంద్రవరం ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఏఐఎల్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, ఎం.మాధురిని ఆర్టీజీఎస్ డిప్యూటీ సిఇవోగా, కె.సతీష్‌ను కొవ్వూరు ఆర్ఎంసీ, పీఐపీఎస్‌డీసీ (ఎల్ఏ) గా, ఆర్.వెంకట రమణ నాయక్‌ను శాప్ ఏవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

క్రిప్టోలో నష్టాల పునరుద్ధరణకు కాయిన్ స్విచ్ కేర్స్ రూ.600 కోట్ల సాయం

విశాలాంధ్ర - బెంగళూరు : రెండు కోట్ల మంది వినియోగదారులతో భారతదేశంలోని ప్రముఖ క్రిప్టో ప్లాట్ ఫామ్‌లో గుర్తింపు పొందింది కాయిన్ స్విచ్. అలాంటి కాయిన్ స్విచ్ తన వినియోగదారుల భద్రత కోసం ఎప్పుడూ ముందుటుంది. అందులో భాగంగానే క్రిప్టో వినియోగదారులను ఆదుకునేందుకు కాయిన్ స్విచ్ కేర్స్ పేరుతో రూ.600 కోట్ల సహాయ కార్యక్రమాన్ని ప్రకటించింది. 2024 జులైలో వచ్చిన వజీర్ ఎక్స్ సైబర్ దాడి వల్ల చాలామంది క్రిప్టో వినియోగదారులు నష్టపోయారు. వారిని ఆదుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది కాయిన్ స్విచ్. వినియోగదారులు తమ నష్టాలను తిరిగి పొందడంలో సహాయపడటమే కాకుండా భారతీయ క్రిప్టో కమ్యూనిటీని మరింతగా ప్రోత్సహించేందుకు ఈ ఉద్దేశించబడిన నిధులు రెండేళ్ల పాటు ఉపయోగిస్తారు. ఈ అద్భుతమైన కార్యక్రమం ద్వారా బాధిత వినియోగదారులు నష్టాలను తిరిగి పొందవచ్చు. రివార్డ్‌లను పొందవచ్చు, మార్కెట్‌లోకి తిరిగి ప్రవేశించవచ్చు. భారతదేశంలోని క్రిప్టో పెట్టుబడిదారులు అవకాశాలను కోల్పోకూడదు. అందుకోసమే వారు కోల్పోయిన దానిలో కొంతైనా పునర్నిర్మించడానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన దశ అని కాయిన్‌స్విచ్ సహ వ్యవస్థాపకుడు ఆశిష్ సింఘాల్ అన్నారు.

2024లో అత్యధిక నివాస విక్రయాల్లో హైదరాబాద్ చారిత్రాత్మక రికార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్: రియల్ఎస్టేట్ పరిణామాలపై నైట్‌ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికను విడుదల చేసింది. ఇండియా రియల్ ఎస్టేట్: రెసిడెన్షి యల్, ఆఫీస్ (జూలై-డిసెంబర్ 2023)లో హైదరాబాద్ 2020 నుండి అత్యుత్తమ కార్యాలయ లావాదేవీల వాల్యూమ్‌లను నమోదు చేసిందని పేర్కొంది, వాల్యూమ్‌లు సంవత్సరానికి 17% పెరిగి 10.3 మిలియన్లకు చేరుకున్నాయి. చదరపు అడుగుల విస్తీర్ణంలో 2024లో పూర్తి చేయడం ఆల్-టైమ్ గరిష్టస్థాయికి చేరుకుంది. ఈ డిమాండ్‌కు అనేక కారణాలున్నాయి. నగరం అసాధారణమైన జీవననాణ్యత, అత్యా ధునిక మౌలిక సదుపాయాలతోసహా అంశాలు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీ లకు దాని ఆకర్షణను మెరుగుపరుస్తాయి. హైదరాబాద్ నివాస మార్కెట్ 12% ఆరోగ్యకరమైన వైటవై వృద్ధిని నమోదు చేసింది, 2024లో 36,974 యూనిట్లను విక్రయించింది. బలమైన ఆర్థిక పునాదులు, మౌలిక సదుపాయాల పురోగతితో పాటు ఆశాజనక జీవనశైలి వైపు కొనుగోలుదారుల ప్రాధాన్యతలను మార్చ డం వల్ల ఈ నగరం 2024లో అత్యధిక అమ్మకాలను చవిచూసింది. అయితే, రెసిడెన్షి యల్ లాంచ్‌లు, 2024లో 44,013 యూనిట్లతో రెసిడెన్షియల్ లాంచ్‌లు 6% తగ్గాయి. అయితే ధరలు సగటున 8% పెరిగాయి. ఇది పెట్టుబడిదారులు, తుది వినియోగదారుల మధ్య నగరం స్థిరమైన ఆకర్షణను ప్రతిబింబిస్తుంది.

అతిపెద్ద గ్రీన్ స్కిల్ ప్రోగ్రామ్‌కు చేతులు కలిపిన సుజ్లాన్-ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర - అమరావతి: కీ॥శే॥ తులసి తంతి మరియు ఆంధ్రప్రదేశ్ పట్ల ఆయనకున్న దృఢ నిబద్ధతకు నివాళిగా, హరిత ఉద్యోగాలను పెంపొందించడానికి మరియు భారతదేశంలోని పునరుత్పాదక రంగంలో ఉపాధి అంతరాన్ని తగ్గించడానికి భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు సుజ్లాన్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మార్గదర్శక కార్యక్రమం గ్రీన్ ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా, పునరుత్పాదక శక్తిలో నైపుణ్య అంతరాన్ని పూరించడం ద్వారా భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే నాలుగు సంవత్సరాల్లో, ఈ కార్యక్ర మం కనీసం 3,000 మంది మహిళలు, 12,000 మంది యువతకు ఎలక్ట్రి కల్, మెకా నికల్, బ్లేడ్ టెక్నాలజీ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ అండ్ మెయిం టెనెన్స్, ల్యాండ్ అండ్ లియాజనింగ్ వంటి పవన విద్యుత్ తయారీకి సంబంధిం చిన ప్రత్యేక రంగాలలో శిక్షణను అందిస్తుంది. అంతేకాకుండా, ఐటిఐ, డిప్లొ మా, డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాలల కోసం నిర్మాణాత్మక పాఠ్యాంశాలను సుజ్లాన్ రూపొందిస్తుంది.

బంధన్ నిఫ్టీ ఆల్ఫా 30 ఇండెక్స్ ఫండ్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: బంధన్ మ్యూచువల్ ఫండ్ బంధన్ నిఫ్టీ ఆల్ఫా తక్కువ అస్థిరత 30 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ఆల్ఫా, తక్కువ అస్థిరత అనే రెండు పెట్టుబడి కారకాలను మిళితం చేసే ఓపెన్-ఎండ్ పథ కం. నిఫ్టీ ఆల్ఫా తక్కువ అస్థిరత 30 సూచికను ట్రాక్ చేస్తూ, తక్కువ అస్థిరతను కొనసాగిస్తూ చారిత్రాత్మకంగా ఉత్పత్తి చేయబడిన ఆల్ఫాను ప్రదర్శించిన స్టాక్‌లను ఫండ్ ఎంపిక చేస్తుంది. ఈ వ్యూహం అనిశ్చిత మార్కెట్లలో సాపేక్ష స్థిరత్వాన్ని అం దించేటప్పుడు బలమైన వృద్ధి అవకాశాలను సంగ్రహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రెండు కారకాలను కలపడం ద్వారా, ఫండ్ మార్కెట్ సైకిల్స్‌లో స్థిరమైన పనితీరును అందించడానికి ప్రయత్నిస్తుంది. పైకి సంభావ్యతను లక్ష్యంగా చేసుకుం టుంది. ప్రతికూల నష్టాలను తగ్గించడం. కొత్త ఫండ్ ఆఫర్ బుధవారం, జనవరి 08, 2025న తెరవబడుతుంది. సోమవారం, జనవరి 20, 2025న ముగుస్తుంది. పెట్టుబడిదారులు లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు లేదా నేరుగా బంధన్ నిఫ్టీ ఆల్ఫా తక్కువ అస్థిరత 30 ఇండెక్స్ ఫండ్‌కు సభ్యత్వాన్ని పొందవచ్చు.

'రిటైర్మెంట్ ప్లాన్'పై హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ తాజా ప్రచారం

విశాలాంధ్ర - హైదరాబాద్: దేశంలోని ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సకాలంలో పదవీ విరమణ ప్రణాళిక కోసం కీలకమైన ఆవశ్యకతపై దృష్టి సారించి తన తాజా ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. ఈ ప్రచారంపై హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ గ్రూప్ హెడ్ స్ట్రాటజీ అండ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ విశాల్ సభర్వాల్ మాట్లాడుతూ, పొదుపు అనేది లేకుండా జీవించే ప్రమాదం, వ్యక్తులు వారి జీవితకాలంలో ఎదుర్కొనే అతిపెద్ద ఆందోళనలలో ఒకటన్నారు. కాంపౌండింగ్ శక్తిని ఉపయోగించుకోవడానికి రిటైర్మెంట్ ప్రణాళికను ముందుగానే ప్రారంభించడంలోనే దీనికి పరిష్కారం ఉందన్నారు. చాలా తరచుగా దేశంలో తమ పిల్లల భవిష్యత్ సురక్షితమయ్యే వరకు వ్యక్తులు దీనిని వాయిదా వేస్తారన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ఒక వ్యక్తి వారి స్వర్ణ సంవత్సరాల కోసం ముందుగానే ప్రణాళిక ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. లియో బర్నెట్ చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ (సౌత్ ఏషియా) విక్రమ్ పాండే మాట్లాడుతూ, తరచూ యాభైల మధ్యలోకి వచ్చే వరకూ ప్రజలు తమ రిటైర్మెంట్ కోసం తగినంత ప్రణాళిక చేయలేదని గ్రహించలేరన్నారు.

మారుతీ సుజుకీ 'ఇ ఫర్ మీ' ఆవిష్కరణ

విశాలాంధ్ర - న్యూఢిల్లీ : దేశంలోని అతిపెద్ద ప్యాసింజర్ వాహన తయారీ సంస్థ మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం 'ఇ ఫర్ మీ' అని నామకరణం చేసిన ప్రోగ్రెసివ్ బ్లూప్రింట్‌ను ప్రకటించింది. ఈ వ్యూహాత్మక దృష్టి అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనాలు, మార్గదర్శక సాంకేతికత, బలమైన ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను అనుసంధానించే సమగ్ర పర్యావరణ వ్యవస్థను కలిగి, ద్వంద్వ-శక్తితో కూడిన భవిష్యత్తు 'ఇ ఫర్ మి' విజన్ దాని హృద యంలో కస్టమర్ సెంట్రిసిటీ ద్వారా నడపబడుతుంది. ద్వంద్వ-కోణ వ్యూహం ద్వారా అమలవుతుంది. మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మిస్టర్ పార్థో బెనర్జీ మాట్లాడుతూ, తమ 'ఇ ఫర్ మీ' విజన్ భారతదేశ ఎలక్ట్రిక్ మొబిలిటీ పరివర్తనలో ఒక నిర్ణీత ఘట్టాన్ని సూచిస్తుందన్నారు.

'పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ముంబయి, టాలెంట్‌స్ప్రింట్ భాగస్వామ్యంతో 'పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్'లో ఆధునిక పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఐఐఎం ముంబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) 2024లో 6వ ర్యాంకు సాధించింది. టాలెంట్‌స్ప్రింట్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్ నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ.. ప్రొఫెషనల్స్‌కు ఆధునిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి. ఒక ఏడాది వ్యవధితో కూడిన ఈ పీజీ డిప్లొమా కోసం అభ్యర్థులు ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఎకనామిక్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లో కనీసం 50 శాతం మార్కులు లేదా సమానమైన సీజీపీఏ (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థుల కోసం 45 శాతం)తో బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉండాలి.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్రం అభివృద్ధి చెందిందంటే పట్టణాలు అభివృద్ధి చెందడమే కాదని, గ్రామాలలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందిందని భావించాలని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లాలోని తాడ్వాయి మండలంలో కొడిశాల నుండి పోచాపూర్(వి) వరకు 4 కోట్ల 10 లక్షల నిధులతో బిటి రోడ్డు, ఆర్‌అండ్‌బి రోడ్డు లింగాల నుండి బొల్లేపల్లి (వి) వరకు 4 కోట్ల 10 లక్షల నిధులతో బిటి రోడ్డు, ఆర్ అండ్ బి రోడ్ పోచాపూర్ నుండి బందాల (%ు%) వరకు 3 కోట్ల 80 లక్షల నిధులతో బిటి రోడ్డు, పోచాపూర్ లోని మిని గురుకులం లో 40 లక్షల నిధులతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం పనులకు రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఐటిడిఏ పిఓ చిత్రా మిశ్రా, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్ లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం పోచపూర్ గ్రామంలో అధికారులతో కలసి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి హాజరై గ్రామస్థులకు గ్రామములో కావాల్సిన సదుపాయాల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు 13న మారుమూల గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్ళని పరిస్థితి ఉండడంతో ఎలాగైనా బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో నేడు ఆయా గ్రామాల రోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని, రోడ్ల సౌకర్యం ఏర్పడినప్పుడే గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్యం అందడంతో పాటు అన్ని రకాల ఇబ్బందులు తొలిగిపోతాయని అన్నారు. ఇతర రాష్ట్రాల్లోని మంత్రులు ఆయా రాష్ట్రాల ఏజెన్సీ ప్రాంతాల్లో కంటైనర్ హాస్పిటల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అనేక సంవత్సరాల క్రితం గుట్టలు కొండలపై గ్రామాలను ఏర్పాటు చేసుకున్న గిరిజనులకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అన్ని విధాలుగా కష్టాలకు గురయ్యారని, గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన బలరాం నాయక్ తాను కలిసి పసర- లింగాల, పసర- మేడారం గ్రామాల గల రోడ్డును విస్తృత పంచామని వివరిం చారు. కేంద్ర అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతాల్లోని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా సానుకూలంగా స్పం దించాలని, అడవులను కాపాడుకుంటూనే రోడ్లను ఏర్పాటుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఐటీడీఏ ల బలోపేతానికి నిర్ణయం తీసుకున్నారని, ఐటీడీఏ ల పరిధిలోని గ్రామాలకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని, గ్రామాలలో జరుగుతున్న పనులకు రాజకీ యాలకు అధికంగా అన్ని పార్టీలు సహకరించాలని అన్నారు. రానున్న రోజులలో గ్రామాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు తో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన వారికి అందించడానికి కృషి చేస్తా నని మంత్రి అన్నారు. ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పిస్తున్న సందర్భంలో అట వీ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించాలని, కేంద్ర ప్రభుత్వం గుర్తించిన యాస్పిరేషన్ జిల్లాలో పలు సౌకర్యాలు కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ వీరభద్రమ్, పీఆర్ ఈ ఈ అజయ్ కుమార్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశం, డి పి ఓ దేవ్ రాజ్, ఆర్టీసీ డి ఎం జోస్న, అధికారులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు ట్రాఫిక్ ఎస్ఐ నరేష్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : నెంబర్ పెట్టు లేకుండా వాహనాలు దొరికితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ వెల్లడించారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేకించి నంబర్ ప్లేట్ లేని వాహనాల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని ఎస్ ఐ నరేష్ తెలిపారు. జిల్లా ఎస్ పి. రోహిత్ రాజ్ ఆదేశాలమేరకు డీస్పీ రహ్మాన్ సూచనలతో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ చేయడం జరిగిందన్నారు. కాగా నంబర్ ప్లేట్ లేని 40 వాహనాలను గుర్తించడం జరిగిందన్నారు. వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి నిబంధనల మేరకు జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ ఐ మదర్, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ టీచర్స్‌కు పెంచిన వేతనం అమలు చేయండి :ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తెలంగాణ రాష్ట్రం లో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు కనీస వేతనం రూ. 18 వేలు ఇస్తామన్న హామీ అమలు చెయ్యాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కునేంనేని సాంబశివరావు కోరారు. మంగళవారం కొత్తగూడెం ఐడిఓసి కార్యాలయం ఎదుట జరిగిన అంగన్వాడీ కార్యకర్తల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలు బలోపేతం కు అధిక నిధులు కేటాయింపులు చెయ్యాలని, పక్కా భవనాలు విద్యుత్, మరుగు దొడ్లు , త్రాగు నీరు, అట బొమ్మలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చెయ్యాలని కోరారు. తక్షణం అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ సమస్యలు ప్రభుత్వం సానుభూతితో ఆలోచించి పరిష్కారం చేయాలనుకోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఐసిడిఎస్ కు నిధులు పెంచాలన్నారు. ఖాళీ గా ఉన్న ఆయా టీచర్ పోస్ట్ లు భర్తీ చెయ్యాలని కూనంనేని కోరారు. గ్రాడ్యూటీ 15 లక్షలు , పెన్షన్ సదుపాయం, బీమా 15 లక్షలు, హెల్త్ కార్డు లు కూడా సకాలంలో అందించాలని కోరారు. ఈ ధర్నా వద్దకు పిడి లేనినా వచ్చి సమస్యలు ను పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలకు తెలియ చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ , జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోయేసియేషన్ జిల్లా అధ్యక్షులు మణి, కార్యదర్శి రెడ్డి అరుణ, నాయకులు భూక్యా లలిత, వేల్పుల మల్లికార్జున్, బండి నాగేశ్వర రావు, అన్నరపు వేంకేటేశ్వర్లు, విజయ, వినోద, శ్రీ లత, సరోజ, ఇంద్ర, నాగలక్ష్మి, సావిత్రి, సంధ్య , మాదవి పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - వనపర్తి: జిల్లాలో ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించే విధంగా జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జనవరి నెలను జాతీయ రోడ్డు భద్రత మాసంగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో రోడ్డు భద్రత కు సంబంధించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. బైక్ పై వెళ్లేటప్పుడు హెల్మెట్, కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి 8న సాయంత్రం నాలుగు గంటలకి కలెక్టరేట్ ఐడిఓసి నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్ల చెరువు వరకు చేరుకొని ర్యాలీ ముగిస్తుందని చెప్పారు. అందరికీ రోడ్డు భద్రత అవగాహన కల్పించేలా ప్రజలు, యువత బైకు హెల్మెట్ తో ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాను యాక్సిడెంట్స్ రహిత జిల్లా గా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస, డిపిఆర్ఓ సీతారాం, డివైస్ ఓ సుధీర్ రెడ్డి, డిఇఓ అబ్దుల్ ఘని, ఇండస్ట్రీస్ అధికారి నగేష్, పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆమనగల్లు :ఆరోగ్యశ్రీ లో లేని వైద్య సేవల ఖర్చులు భరించలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని స్థానిక కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన మెండే శ్రీనుకి మంజూరైన 60000 (అరవై వేల) ల రూపాయల చెక్కును బాధితునికి అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ... పేదలకు వరం సీఎం సహాయ నిధి అని,పేద ప్రజల ఆరోగ్యం గురించి అలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మండలము మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, శేఖర్ రెడ్డి,రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పినపాక: పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పినపాక మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే కు అమరారం గ్రామ ప్రజలు పూలమాలలతో, దప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. రూ. 20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. 11 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు బాధ్యతయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అద్దంకి నరేష్, ఏడి తాతారావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఏపిఎం జ్యోతి, కార్యదర్శి శ్రీనివాస్ కుమార్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్ సభకు భారీగా తరలి రండి

విశాలాంధ్ర - ముదిగొండ : ఎస్సీ వర్గీకరణ కోసం తలపెట్టిన చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు భారీగా తరలిరావాలని టీఎంఆర్పిఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు చింతాబాబు అన్నారు. మండల కేంద్రం ముదిగొండలో మంగళవారం ఏర్పాటు చేసిన మధిర నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఎస్సీ వర్గీకరణ ఏ బి సి డి ల కొరకు 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకై ఏ రాష్ట్ర సమస్యలు ఆ రాష్ట్రంలో పరిష్కరించుకోవచ్చు అని తీర్పు ఇవ్వటం జరిగింది. ప్రతి గ్రామాలలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల అధ్యక్షులు కొత్తపల్లి నరసింహ మాదిగ, మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు మేళ్లచెరువు నాగమణి మాదిగ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షులు కర్ష ఉపేందర్, జిల్లా నాయకులు కుర్రి నరసింహ, మండల నాయకులు ఇరుకు కృష్ణ, గుర్రం సంగయ్య, పడిశాల నాగేశ్వరరావు, నరపొంగు ఉపేందర్, ఉసికల శ్రీనివాసరావు, వంశీ, బొడ్డు రాము తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో 'గ్రాండ్ ఇండస్ట్రీయల్ కాన్‌క్లేవ్'

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఎన్ఐ గ్రాండ్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా ఆధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామిక సంఘం హాలులో 'గ్రాండ్ ఇండస్ట్రీయల్ కాన్క్లేవ్' నిర్వహించారు. ఈ కాన్‌క్లేవ్‌లో 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ 2.0-చాలెంజెస్, ఆపర్చ్యునిటీస్ వే అహెడ్' అనే అంశంపై ప్రత్యేకమైన ప్యానల్ చర్చ జరిగింది. ఈ చర్చలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) రంగంలో వ్యాపార వృద్ధి, వ్యూహాలు అన్వేషించడంపై దృష్టి సారించారు. ఈ ప్రతిష్టాత్మక ప్యానల్‌లో హైదరాబాద్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ జే శ్రీనివాస్, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ నారాలా, నిచ్‌బ్రెయిన్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో లక్ష్మీ నరసింహమూర్తి, బిజ్‌రైట్స్ ఐపీ పార్ట్నర్స్ ఎల్ఎల్‌పీ వ్యవస్థాపకుడు వీ రాజేష్, బ్రిడ్జ్‌గ్యాప్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు విపిన్ సింగ్, దియోస్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సందీప్ రెడ్డి, సింఫిన్ట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు హరి సూర్య తదితరులు పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయంపై దాడి పిరికిపందల చర్య డా. వై.రాజ్ కుమార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండించిన బిజెపి నగర కార్యవర్గ సభ్యులు డా. వై. రాజ్ కుమార్. రాష్ట్ర పార్టీ కార్యాలయం పై దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణిస్తూ, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే దాడికి పాల్పడ్డ నిందితుల్ని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి కార్యకర్తలు సహనం కోల్పోతే గాంధీభవన్ కిష్కింధకాండగా మారుతుందని అన్నారు.

జర్నలిస్ట్ చంద్రకర్ హత్య పిరికిపందల చర్య ... ఇల్లందు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర - ఇల్లందు : వృత్తి పట్ల అంకితభావంతో, దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా కథనాలు రాసినందుకు ముఖేష్ చంద్రకర్ ను గూండాలు హత్య చేశారని టియూడబ్ల్యూజె జాతీయ కౌన్సిల్ సభ్యులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం రాజేష్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా 10 ఏళ్ల కాలం నుంచి జర్నలిస్టులపై దాడులు, హత్యలు అధికమయ్యాయని ఈ పరిణామం ప్రభుత్వాల విఫలమే అన్నారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ కు చెందిన ఎన్‌డిటివి జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్యను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం పట్టణంలోని స్థానిక కొత్త బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ బస్తర్ ప్రాంతంలో అవినీతి పై చేసిన కథనాలు అతడిని హత్య కారణమవుటం ఈ వ్యవస్థ ఆలోచించాల్సి ఉందన్నారు. ఈ హత్య నేటి రాజకీయ, సామాజిక విధానాలకు అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టులకు రక్షణ కల్పించడమే కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని అప్పుడే మార్పు వస్తుందన్నారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులుప్రసాద్, మధు, రాజేష్,సంతోష్,రాధాకృష్ణ, దానియల్,శేషు,మహేందర్, సురేందర్, ఏఎస్ రావు,చాంద్ పాషా, రవి,రాకేష్,నందు,సునీల్,సలీం,విజ్ఞాన్ పాల్గొన్నారు.

సాగర్ అమృత్ సింగ్‌కు : కలెక్టర్ త్రిపాఠి అభినందన

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ఈ నెల 2 న ఉత్తరప్రదేశ్ లోని నోయిడా లో నిర్వహించిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఇండియా పోటీలలో ఓపెన్ కేటగిరీ 245 కిలోల విభాగంలో నల్గొండ జిల్లా కేంద్రం లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏ ఎం సి బ్యాంక్ మేనేజర్ సాగర్ అమృత్ సింగ్ మొదటి బహుమతి పొందడం పట్ల జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సాగర్ అమృత్‌సింగ్‌ను అభినందించారు.

మంగళ వారం సాగర్ అమృత్ సింగ్ జిల్లా కలెక్టర్ ను జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలిసిన సందర్భంలోవరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఇండియా పోటీలలో జాతీయ స్థాయిలో సాగర్ అమృత్ సింగ్ సాధించిన ఫస్ట్ ప్రైజ్ ను ఆమె బహూకరించారు.ఎస్ బి ఐ లో బ్యాంక్ మేనేజర్ గా పని చేస్తూనే పవర్ లిఫ్టింగ్ లో రాష్ట్ర ,జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు.కాగా సాగర్ అమృత్ సింగ్ పవర్ లిఫ్టరే కాకుండా పేరిణి,భరత నాట్యం కళాకారుడు కూడా కావడం విశేషం.అంతేకాక సాగర్ అమృత్ కు 60 శాతం వినికిడిలోపం ఉంది. అయినప్పటికీ పవర్ లిఫ్టింగ్ లో అలాగే పేరిణి,భరతనాట్యం లో రాణించడం అభినందనీయమే అన్నారు .

కొండపర్తిలోని అభివృద్ధి పనులను పూర్తి చేయండి ఎం దాన కిషోర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : గవర్నర్ దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామములోని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం. దాన కిషోర్ అన్నారు. మంగళవారం రాజ్ భవన్ నుండి గవర్నర్ దత్తత తీసుకున్న గ్రామాల కు సంబంధించిన జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం. దాన కిషోర్ మాట్లాడుతూ గవర్నర్ దత్తత తీసుకున్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మారుమూల గ్రామమైన కొండపర్తి గ్రామంలో పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని ఈ నెల 28వ తేదీలోగా సివిల్ పనులు పూర్తి చేసి సంబంధిత కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించనున్నారని, జిల్లాలో చేపట్టిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్నీ రకాల భద్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేస్తుందని అన్నారు. .ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ సర్దార్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లాలోని పోలీస్ యంత్రాంగం తరపున డీఎస్పీలు, సిఐలు, నేషనల్ హైవే, పంచాయతీ రాజ్, అధికారులు పాల్గొన్నారు.

జైలు కెళ్లడం ఖాయమని తెలిసే సీఎంపై విమర్శలు : ఎమ్మెల్యే వేముల

విశాలాంధ్ర - హైదరాబాద్ : త్వరలో కేటీఆర్ జైలుకు పోవడం ఖాయమన్న విషయం అర్థమైపోయి బీఆర్ఎస్ నాయకులు మా సీఎం రేవంత్ రెడ్డి పైన అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వేముల విరేశం విమర్శించారు. 55 కోట్ల రూపాయలను విదేశీ కంపెనీకి బదిలీ చేసి తప్పును బుకాయించడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని బీఆరెస్ ఆరోపణలు విడ్డురంగా ఉందన్నారు. మంత్రివర్గ ఆమోదం లేకుండా నోటి మాట గా 55 కోట్ల రూపాయలను ఏ విధంగా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. నియమ నిబంధనలను తుంగలో తొక్కి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమని ఇపుడు బుకాయిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి చేస్తే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందా ఇలాంటి విషయం తాము ఇంత వరకు ఎక్కడ వినలేదన్నారు. హైదరాబాద్ ను మేమే నిర్మించామన్నట్లు కేటీఆర్ వ్యాఖ్యలున్నాయని అన్నారు. పదే పదే అబద్దాన్ని గట్టిగా చెబితే ప్రజలు నమ్ముతారని కేటీఆర్, హరీష్ రావు అనుకుంటే పొరపాటన్నారు. తెలంగాణ ను సర్వం దోచుకున్నారని ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టే మిమ్మల్ని ఓడించారన్నారు. అవినీతి అక్రమాలను బయటకు వస్తుంటే వాటిని డైవర్ట్ చేయడానికి బీఆరెస్ ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి వ్యవసాయ భూమికి రైతు భరోసా ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారున్నారు. రైతుభరోసా విషయంలో రైతు సంతోషంగా ఉన్నారనే విషయాన్నీ బీఆర్ఎస్ నేతలకే జీర్ణం కావడం లేదన్నారు. అక్రమంగా కూడబెట్టిన భూములకు డబ్బులు రావనే బాధ బీఆర్ఎస్ నాయకులల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సాగులో లేని భూములకు డబ్బులు ఇవ్వమని ఏ రైతు కూడా అడగరన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు, తూపేల్ కేసు అయితే ఎందుకింత గగ్గోలు పెడుతున్నారు దాని దైర్యంగా ఎదుర్కొని మీ నిజాయితీ నిరూపించుకుంటే సరిపోతుంది కదా అని అన్నారు. కేసు విషయంలో ఎందుకు భయపడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. కేటీఆర్ కేసును తెలంగాణ ప్రజలందరి కేసుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, ఇందులో కుట్ర దాగి ఉందన్నారు. ఏ నేరం చేయకపోతే దర్యాప్తు సంస్థల దగ్గరకు వెళ్లి కేటీఆర్ తన వాదనను వినిపించాలన్నారు. దర్యాప్తు సంస్థల దగ్గర వెళ్లకుండా అడ్డదారులను కేటీఆర్ వెతుక్కుంటున్నాడని, నేరం చేయకపోతే దర్యాప్తు సంస్థలకు సహకరించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు సంస్థల నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తున్నాడంటే తప్పు చేశారని అర్థమౌతోందన్నారు. బీఆర్ఎస్ నేతలను చట్టం ముందు దోషులు గా నిలబెట్టాలన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సమా చార శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు నూతన టెక్నాలజీతో కూడిన ఫోటో కెమెరాలను మంత్రి అందచేశారు. రాష్ట్రంలో జిల్లా, క్షేత్ర స్థాయి సిబ్బందికి నూతన కెమెరాలను అందచేయడం వలన ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫోటో వార్తలు మీడియాకు సులువుగా అందించవచ్చునని కమిషనర్ డాక్టర్ హరీష్ తెలిపారు. అన్ని జిల్లా కార్యాలయాలకు, డివిజన్ స్థాయి సిబ్బందికి ఫోటో కెమెరాలను అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ ఫోటో కెమెరాలు సిబ్బందికి ప్రయోజనకరంగా ఉంటాయని కమీషనర్ పేరొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ డా.హరీష్, అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పుస్తకం... ఓ శక్తి!

'పోరాడితే పోయేదేమీ లేదు..బానిస సంకెళ్లు తప్ప' అని కమ్యూనిస్టు పితామహుడు, తత్వవేత్త కారల్‌మార్క్స్ చెప్పిన నగ్నసత్యం ప్రపంచాన్నే కదిలించింది, కుదిపేసింది. ఇది పుస్తకానికీ, పుస్తక పఠనానికీ వర్తిస్తుంది. ఒక పేజీ చదివితే పోయేదేమీ లేదు...నాలుగు ముక్కలు బుర్రలోకి ఎక్కడం తప్ప. పుస్తకం ఓ శక్తి, ఓ అద్భుతం, ఓ చోదక శక్తి. కమ్యూనిజం సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ రాసిన 'పెట్టుబడి' పుస్తకం ఏకంగా ప్రపంచ దిశదశను పూర్తిగా మార్చేస్తుందని ఊహించారా? అదంతే...పుస్తకానికి మించిన శక్తి ఇంకెక్కడా లేదన్నది నిరూపితమైంది. నగలపెట్టెను పదేపదే తెరిచి చూస్తామో లేదో తెలియదుగానీ, మళ్లీ మళ్లీ తరచి తరచి తెరిచి చూసే ఏకైక బహుమతి మాత్రం పుస్తకమే. ఒక మంచి పుస్తకం చదివినప్పుడు ఏదో మాయ, మంత్రజాలం సంభవిస్తుందన్నది తన నమ్మకమంటూ జేకే రౌలింగ్ ఉటంకించారు. అందుకే టాప్-10 ఫ్యాంటసీ పుస్తకాల్లో ఆమె రాసిన హ్యారీపోటర్ సిరీస్ నిలిచింది. ఒక పాఠకుడు చనిపోయేముందు వెయ్యి జీవితాలను జీవిస్తాడని 'ఏ డ్యాన్స్ విత్ డ్రాగన్స్' పుస్తక రచయిత జార్జి ఆర్.ఆర్.మార్టిన్ చెప్తాడు. ప్రాణంలేని శరీరంలాగ పుస్తకాలు లేని గది నిర్జీవంగా గోచరిస్తుందని సిసిరో చెప్పినా, పుస్తకాలు మాత్రమే ప్రత్యేకంగా మాయాజాలాన్ని సృష్టిస్తాయని స్టీఫెన్ కింగ్ చెప్పినా, పుస్తకాన్ని మించిన నమ్మకం, విశ్వాసం ఇంకొక చోట దొరకదని హెర్నెస్ట్ హెమింగ్వే పలికినా...ఇవన్నీ గొప్ప పుస్తకం గురించే. పుస్తకానికి పొగడ్తలు అవసరం లేదు. తెగడ్తలతో అంతకన్నా పనిలేదు. పుస్తకానికి మించిన రాజభక్తి కత్తికీ, కరవాలానికీ ఉండదట!

సామాజిక అవ్యవస్థపై ఎక్కుపెట్టిన కత్తి మలాలా యూసఫ్‌జాయ్. ఆమె పాక్ గడ్డపైనుంచే ప్రపంచాన్ని గెలిచింది. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ఐయామ్ మలాలా పుస్తక రచయిత అయిన ఆమె 'ఒక చిన్నారి, ఒక ఉపాధ్యాయిని, ఒక పుస్తకం, ఒక కలం మాత్రమే ప్రపంచాన్ని మార్చగలవ'ని సగర్వంగా చెపుతుంది. జీవితానికి పరిమితి ఉంటుందని, ఏదో ఒక సమయంలో ముగిసిపోతుందని అనుకుంటాం. కానీ అది నిజం కాదట! జీవితం ముగియడమంటే ఒక చాప్టర్ ముగిసినట్లే పుస్తకం లాగ. ఎందుకంటే జీవితంలో చేసిన మంచిపనులు, సాధించిన విజయాలు ఆ వ్యక్తిని ఈ ప్రపంచం కలకాలం గుర్తుపెట్టుకుంటుంది. పుస్తకమూ అంతే కదా! చాప్టర్లు మాత్రమే ముగుస్తాయి, పుస్తకం కాదు! ప్రేక్షకుడిని నడిసంద్రంలో ముంచేసే మన సినిమాల్లాగ. బాహుబలి రెండు ముక్కలైతే, పుష్ప సినిమా మూడుముక్కలైంది. తొలి రెండు పుష్ప సినిమాల్లో విలనిజం ప్రదర్శించిన కథానాయకుడు మూడో సినిమాలో మంచివాడు కావచ్చేమో! అదొచ్చే దాకా వేచిచూడాలిమరి! కేజీఎఫ్ చాప్టర్ 1, చాప్టర్ 2, దేవర పార్ట్ 1, సలార్ 1, కల్కి 1..ఇలా ఇంకెన్నో సినిమాలు. అనంతమనేది పుస్తకానికి మాత్రమే కాదు, చలనచిత్రాలకూ అంటుకుందని ఈ మధ్యనే తేలింది, తెలిసింది.

జీవితం ఎగిసిపడే అలల్లాంటిది. పడిలేస్తూ ఉంటుంది. ఎత్తుపల్లాలు అనివార్యం. చిన్న చిన్న ఎంపికల మీదనే మన శక్తి సాంతం ఆధారపడి ఉంటుంది. పుస్తక పఠనం వాటిని సరిచేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. పుస్తక పఠనం తగ్గిపోయిందని, ఇప్పుడు సర్వం జగత్తు స్మార్ట్‌ఫోన్లపైనే ఆధారపడి బతుకుతోందని అంటున్నారు. అది నిజమే. కాకపోతే కాగితంతో తయారు చేసిన పుస్తకాలకు బదులు డిజిటల్ బుక్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అంటే పుస్తకానికి గిరాకీ తగ్గలేదనేది నిగ్గుతేలిన నిజం. పుస్తకానికి ప్రత్యామ్నాయం అంటూ ఏమీ ఉండదు. పుస్తకానికి నిజమైన ప్రత్యామ్నాయం మరో పుస్తకమే. పుస్తకాలు హృదయం నిండా ప్రేమను నింపుతాయి. ఆవేశాన్ని రగిలిస్తాయి. ఆందోళన కలిగిస్తాయి. ఆస్వాదించేకొద్దీ ఆనందాన్నిస్తాయి. పేజీ తిప్పేకొద్దీ జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కినంత ఉద్వేగం కలుగుతుంది. ప్రియురాలి కన్నా పుస్తకం గొప్పది. మనసిస్తే మరిచిపోదు. ఒక పేజీలో పగిలినా, ఇంకో పేజీలో అతుక్కుంటుంది. ధన్యమైన జీవితం పొందడానికి పుస్తకం మన జీవితంలో భాగం కావాల్సిందే.

భాషకి బాధొచ్చేకొద్దీ పుస్తకానికి పురుగులు పడుతూ వస్తుంటాయి. నొసటికి నొప్పి వస్తే కదా కళ్లకి జోడొస్తుంది. పుస్తకానికి పది రూపాయలు వెచ్చించడం కన్నా పుష్ప-2 సినిమాకి 1500 రూపాయలు పెట్టడం ఉత్తమమని నేటి తరం భావించవచ్చు. సినిమా ప్రీమియం షోలకు రేట్లు పెంచే ప్రభుత్వాలివి. పుస్తకాలకు రాయితీలిస్తాయంటే ఆశించగలమా? పుస్తకం హస్తభూషణం అనేది ఒకనాటి మాట. చేతిలో సెల్‌ఫోన్, ట్యాబు నేటి దందా. పుస్తకాలు చదివి కళ్లుపోయినవారు తక్కువ. స్మార్ట్‌ఫోన్లు చూసీచూసీ మతిచెడిన వారు కోకొల్లలు. వాటి సొండ్లకు మెదళ్లు మొద్దుబారిన సందర్భాలు చూస్తున్నాం. అయినప్పటికీ, పుస్తకానికి ఆదరణ తగ్గుతోందని ఆందోళన పడాల్సిన పనిలేదు. గ్రంథాలయాలకు చెదలు పడుతున్నాయని క్షోభపడాల్సిన అవసరం లేదు. కాగితం ఖర్చు, ముద్రణ వ్యయం పెరిగిందని చింతవద్దు. పడిపడి లేచే కెరటం మాదిరిగా పుస్తకం తన స్వరూపాన్ని, రూపాన్ని మార్చుకుంటోంది. పుస్తక పఠనం చేసే వారికన్నా డిజిటల్ అధ్యయనం చేసేవారి కళ్లు పేలిపోతున్నాయి, పాలిపోతున్నాయి. అందుకే పుస్తకం పూర్వవైభవం సంతరించుకుంటోంది. ఆ ఆశలను 35వ విజయవాడ పుస్తక మహోత్సవం రేకెత్తిస్తోంది. ప్రజలను కొన్ని యుగాలు వెనక్కి తీసుకుపోయే ప్రయత్నంగా విజయవాడ సమీపంలో హైందవ శంఖారావం పేరుతో ఒక సభ జరిగిన మరునాడే పుస్తక ప్రియులు బెజవాడలో భారీ ర్యాలీ నిర్వహించి, ప్రజలు ప్రగతిశీల బాట పట్టాలని కోరడం గమనార్హం. ఈ పుస్తక మహోత్సవం పది రోజులపాటు జరుగుతుంది. ప్రతిరోజూ లక్షలాది మంది పాఠకులు, పుస్తక ప్రియులు తండోపతండాలుగా స్టాల్స్‌ను సందర్శించి, విపరీతంగా పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. పుస్తకంపై ప్రీతి ఏ మాత్రం తగ్గలేదని నిరూపించే సన్నివేశమిది. అంతకుముందు, హైదరాబాద్ బుక్ ఫెస్టివల్‌లోనూ విక్రయాల జోరు దండిగా సాగింది. మొబైల్ ఫోన్లపై విసిగివేసారి ఏదోఒక రోజు జనం మళ్లీ పుస్తకంవైపు రాకపోతారా అన్న ఆశ లేకపోలేదు. 'సంక్లిష్టమైన ప్రదేశాల్లో పూసే గులాబి పువ్వును నేను' అంటూ పుస్తకం తన మనుగడను మరిచిపోవద్దంటోంది. మస్తకానికో పుస్తకం కావాలి. పుస్తకంతోనే మస్తకం మనగలుగుతుంది. పుస్తకం ఓ పవిత్రత, ఓ ఆహ్లాదం, ఓ గురువు, ఓ థెరపిస్ట్, ఓ బెస్ట్ ఫ్రెండ్! ఏమాటకా మాట.. పుస్తకం చేతిలో ఉంటే దాని సొగసే వేరబ్బా!

మళ్లీ రాతియుగంలోకి వెళ్దామా....!

కరవది సుబ్బారావు

ఒకవైపు అంతరిక్షంలోని గుట్టును శాస్త్రవేత్తలు కనిపెడుతూ ఉంటే, మరోవైపున అదే శాస్త్రవేత్తలు తమ ప్రయోగాల ప్రారంభం దేవుడు పూజలతో మొదలు పెడుతున్నారు. మనం అభివృద్ధి వైపు పయనిస్తున్నామా, లేక రాతియుగంవైపు వెనక్కి వెళుతున్నామా ప్రస్తుతం మన ఎదుట ఉన్న పెద్ద ప్రశ్న. నిమ్నజాతి వారు తమ వృత్తులను వదిలి మేధాశక్తిని పెంపొందించుకొని ఆధునిక యుగంలో అభివృద్ధికి బాటలు వేస్తుంటే, మరోవైపు దేశంలోని పాలకులు సనాతన ధర్మాన్ని ముందుకు తెచ్చి, నిమ్న జాతి ప్రజలు కులవృత్తులలోనే కునారిల్లాలని, బానిసలుగానే మగ్గాలని రాతియుగం నాటి స్థితికి వెళ్లేలా అణగారిన ప్రజల మనోభావాలతో ఆటలాడుకుంటున్నారు. భారత రాజ్యాంగం అత్యున్నత విలువలతో కూడుకున్నది. ప్రజలు కుల, మత, భాష, లింగ భేదం లేకుండా అందరూ సమానమని రాజ్యాంగం తెలియజేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, సమన్యాయం, లౌకికవాదం అంశాలకు ప్రాధాన్యత ఇవ్వటమే కాకుండా, ఆచరించేలా రూపొందించడం జరిగింది.

1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ అధికారికంగా భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది. నేటి బీజేపీ పాలకులు భారత రాజ్యాంగాన్ని మార్చివేసేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలుచేసి అవమానాలకు గురిచేస్తున్నారు. దేశంలో కార్పొరేట్‌లు

రాజకీయ రంగాన్ని నియంత్రిస్తూ, వారి వ్యాపార ప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. పాలకులను ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ, చరిత్రను, చారిత్రాత్మక చిహ్నాలను ధ్వంసంచేస్తూ ప్రజా శ్రేయస్సు మరచి కార్పొరేట్లకు దాసోహం అంటూ వారి సైద్ధాంతిక భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారు. అంటరానితనం, కుల వివక్ష కొనసాగినంత కాలం చట్టసభలలో రిజర్వేషన్లు ఉండాలని కోరిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాన్ని, నేటి పాలకులు రద్దు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. అంబేద్కర్ చెప్పిన విధంగా అణగారిన జాతుల అభివృద్ధి కోసం తాము పలు పథకాలు ప్రవేశపెడుతున్నామని, సంక్షేమ రాజ్యాంగా రూపొందిస్తున్నామని, నిధులు కేటాయిస్తున్నామని చెప్తూ బడ్జెట్లో కేటాయించడం వరకే పరిమితం చేస్తున్నారు. బీఫ్ ఆహారాన్ని భుజించిన వారిపై దాడులు చేయటం, చంపివేయటం సామాన్య విషయం గా మారింది.దేశంలో అణగారిని జాతుల అభివృద్ధి కేవలం విద్య, ఉపాధితోనే సాధ్యం. అయితే పాలకులు నాణ్యమైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారు. దళితులకు, బీసీలకు, ముస్లిం మైనార్టీలకు సంక్షేమ హాస్టళ్లు మౌలిక వసతులు కల్పించడంలో, అందుకు నిధులు కేటాయించడంలో మాత్రం వెనుకంజ వేస్తున్నారు.

దళితులకు, బీసీలకు, ముస్లిం మైనార్టీలకు సంక్షేమ హాస్టళ్లు ఏర్పాటు చేశామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అయితే అందులో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంలో, అందుకు నిధులు కేటాయించడంలో మాత్రం వెనుకంజ వేస్తున్నారు. కులాంతర వివాహాల ద్వారా కుల వ్యవస్థను నిర్మూలించవచ్చని ఒకవైపు పాలకులు చెప్తూ, కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నామని, అటువంటి జంటలకు నజరానాలు ప్రకటిస్తున్నారు. యువత ఉత్సాహంతో కులాంతర వివాహాలు చేసుకున్న, వివాహం అయిన తర్వాత అసలైన కష్టాలు ప్రారంభమవుతున్నాయి. రెండు కులాల నుండి వ్యతిరేకత వస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 లో పొందుపరిచినట్టు నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. ప్రైవేట్ వైద్య రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో వైద్యులు ఉండరు, మందులు ఉండవు, వ్యాధి నిర్ధారణ చేసే మిషన్లు ఉండవు. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే సిబ్బంది రోగులను ప్రైవేటు హాస్పటల్ కు వెళ్లాలని సలహాలు ఇచ్చే స్థాయిలో మన వైద్యరంగం ఉంది. ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని మరచి, తమ ఆదాయమే లక్ష్యంగా మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇవి గమనించిన ప్రభుత్వాలు కట్టడి చేయటం మానివేసి, పేదలు నివసించే ప్రాంతాలలో బెల్ట్ షాపులు పెట్టించి మరీ మద్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి పెడుతున్నారు. దేశంలో జోగిని, మాతంగి, దేవదాసి వ్యవస్థలు ఇంకా నడుస్తూనే ఉన్నాయి. దేవుడి పేరుతో వీరు ధనిక వర్గాల సేవలలో తమ శ్రమను ధారపోస్తున్నారు.

ప్రధానంగా దేశంలో కుల వ్యవస్థను, మతవ్యవస్థను పాలకులు పెంచి పోషిస్తున్నారు. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో ఊరు, దళితవాడ అంటూ ప్రత్యేక ప్రదేశాలు కొనసాగుతూనే ఉన్నాయి. దేశంలో 90 శాతంగా ఉన్న బడుగు, బలహీన వర్గాలు చనిపోయిన తర్వాత కూడా పూడ్చేందుకు స్మశానాలు లేవు. కాలువ గట్లు, వాగులు వంకలే వారి స్మశాన వాటికలుగా మారుతున్నాయి. దళిత కాలనీలలో కనీస సౌకర్యాలు కనిపించవు. పంచాయతీలు 25% నిధులు కేవలం దళితవాడల అభివృద్ధికి ఖర్చు చేయాలని చట్టాలు ఉన్నప్పటికీ అవి కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయి.

డి హెచ్ పి ఎస్ ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి
సెల్: 7893530894

నితీశ్ భవిష్యత్ కదలికలెటు?

అరుణ్ శ్రీవాత్సవ

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ఇతరులకన్నా ఆయనకే బాగా తెలుసు. తన సొంత పార్టీ బీజేపీ నాయకులతో సహా దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్‌కుమార్‌ను మోదీ వదులుకుంటారా?లేదా? అనే అయోమయ స్థితిలో ఉన్నారు. బీహార్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తారా? లేదా నితీశ్ తన మనఃసాక్షి మేరకు నడుచు కుంటారా? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాలలో ఆసక్తికరంగా మారింది. మోదీ, నితీశ్ ఇద్దరూ కత్తులు దూస్తున్నారని ఢిల్లీ, పాట్నా రాజకీయ వర్గాలలో గత వారం విస్తృతంగా చర్చ జరిగింది. మోదీ, నితీశ్ ఇద్దరూ సరైన అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్టుంది. గత రెండు దశాబ్దాలుగా బీహార్‌ని పాలిస్తున్న నితీశ్ రాజకీయ భవితవ్యం ఇప్పుడు రాజకీయ వర్గాలలో చర్చనీయాంశ మైంది. బీహార్‌లోని ఉన్నత వర్గాలు, మధ్యతరగతి వర్గాలలో కూడా ఇది ప్రధానాంశ మైంది. మునపటి గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ వారసుడిగా ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ రాక ఈ ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. మోదీ సమస్యలను పరిష్కరించడంలో ఆరిఫ్ మంచి దిట్ట. కేరళ గవర్నర్‌గా అక్కడి ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్నీ, ముఖ్యమంత్రి విజయన్‌ను ఆయన ఎలా ఇబ్బందులకు గురిచేసింది దేశ ప్రజలు ఇంకా మరిచిపోలేదు.

బీహార్‌లో అడుగుపెట్టడంతోనే నితీశ్‌కు తలనొప్పిగా పరిణమించడం ప్రారంభమైంది. రాజకీయ నాయకులు, ప్రజలతో నేరుగా సమావేశం కావడం మొదలుపెట్టేశారు. దీనితో ఎన్డీయే కూటమి నుంచి నితీశ్ బయటకు వెళ్లే అవకాశాలున్నాయన్న ఊహాగానాలు మరింత జోరందుకున్నాయి. నితీశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అసంబద్ధ వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వదంతులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2025లో జరిగే బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్డీయేకు నాయకత్వంవహించే విషయాన్ని మోదీకి అత్యంత సన్నిహితుడైన అమిత్ షా వారం రోజుల క్రితమే త్రోసిపుచ్చారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్ సిన్హా తన స్పందన ద్వారా అమిత్‌షా వ్యాఖ్యలకు ప్రాధాన్యత జోడించారు. "మాజీ ప్రధానమంత్రి ఏబీ వాజపేయికి తన సొంతంగా బీజేపీ ప్రభుత్వం నివాళులర్పిస్తుంది. బీహార్‌ను జంగిల్ రాజ్ నుంచి బీజేపీ కార్యకర్తలు విముక్తిచేశారు. కానీ, ఇప్పటికీ లక్ష్యం ఇంకా నెరవేరలేదు. బీహార్‌లో సొంతంగా బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడే వాజపేయికి నివాళులర్పిస్తాం. అప్పుడే పార్టీ కార్యకర్తల హృదయాలలో అశాంతి నెమ్మదిస్తుంది. నేటికి జంగిల్‌రాజ్ ప్రజలు బీహార్ సామాజిక సామరస్యాన్ని చెడగొడుతున్నారు. ఇప్పటికీ బీహార్ వారి ప్రభావంతో బాధపడుతోంది" అని గత బుధవారం అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు ఊతమిచ్చాయి. అమిత్‌షా వ్యాఖ్యలు సహజంగానే నితీశ్ నాయకత్వ గుణాన్ని కించపరిచే విధంగా ఉన్నాయి. నితీశ్ పాలనలో కూడా ఆ లక్షణాలు కొనసాగుతున్నందున జంగిల్ రాజ్ అవశేషాలను పూర్తిగా నిర్మూలించలేదనీ, రాజకీయ దృక్కోణంలో దాని ప్రభావం తీవ్రంగా ఉందని నితీశ్‌కి చురకలు అంటించారు. దాని తీవ్రత, చిక్కులు బీహార్ సామాజిక వర్గానికి, రాజకీయ వ్యవస్థకు బాగా తెలుసు. నితీష్‌ను అప్రస్తుతం, పనికిరాని

> బీహార్‌లో తనకు విధేయులైన సంజయ్ ఝా, లాలన్ సింగ్ నేతృత్వంలో జేడీయూ ఎంపీల బృందాన్ని ఏర్పాటు చేయడంలో అమిత్ షా చాలా వరకు విజయం సాధించారు. అయినప్పటికీ నితీశ్ వైఖరిపై గుజరాతీ ద్వయం సందిగ్ధతతో ఉన్నది. తమ రాజకీయ మనుగడకు నితీశ్‌తో ముప్పు ఏర్పడుతుందన్న భయం వారిని వెంటాడుతోంది. సంక్షోభాన్ని అనుకూలంగా మార్చుకోవడానికి నితీశ్ ఎంతకైనా దిగజారవచ్చు.

వ్యక్తిగా చిత్రీకరించి ఆయన సామాజిక, రాజకీయ పునాదిని లాక్కోవడానికి బీజేపీ రాష్ట్ర శాఖ పన్నిన వ్యూహాత్మక పన్నాగం ఇది.

ముఖ్యమంత్రి నితీశ్‌తో కలిసి నడవడానికి అగ్రవర్ణ నేతలు కొందరు అయిష్టంగా ఉన్నప్పటికీ నాయకుడే లేని బీజేపీ బీహార్ రాష్ట్ర శాఖ ఇప్పటి కిప్పుడు ఏ విధమైన ఆకస్మిక వైఖరిని తీసుకునే స్థితిలో లేదు. నితీశ్‌తో కలిసి నడిస్తే అగ్రవర్ణాల మద్దతును పార్టీ కోల్పోతుందనే భయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధానం కొనసాగిస్తే బీసీలలో అత్యధిక భాగం, లోధీ-కుర్మీలు లాలు లేదా కాంగ్రెస్ విధేయులుగా మారిపోవచ్చునని కూడా వారు ఆందోళన చెందుతున్నారు. బీహార్‌లోని అగ్రవర్ణాలకు కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ రాజకీయ పార్టీగా ఉన్నది. అయితే, లాలు రాజకీయ ఎదుగుదల, ఆయన విద్వేషపూరిత ప్రచారం వారు బీజేపీ వైపు మొగ్గేలా చేసింది. మనుగడ కోసం వారు తప్పనిసరిగా బీజేపీకి మద్దతివ్వవలసి వచ్చింది. తమ పూర్వీకులను భూములు, ఇళ్ల నుంచి ఆర్‌జేడీ మద్దతుదారులు ఎలా వెళ్లగొట్టి, వారి ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారనే విషయం అగ్రవర్ణాల మదిలో నుంచి ఇంకా తొలగిపోలేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుపార్టీ అధినేత నారా చంద్ర బాబు నాయుడుతో నితీశ్ సుదీర్ఘ టెలికాం సంభాషణలు జరిపినట్లు ఇప్పటికే రాజకీయ వర్గాలు పుంఖాను పుంఖాలుగా చెబుతున్నాయి. అమిత్ షా తన అధికారాన్ని ఉపయోగించి వారు చెప్పినట్టు నడుచుకునేలా చేస్తున్నారన్న భావనను ఇద్దరు నాయకులు పంచుకున్నట్టు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రాంతీయ పార్టీల బలాన్ని తగ్గించి, తమ రాష్ట్రాల్లోనూ మహారాష్ట్ర ప్రయోగాన్ని పునరావృతం చేసేందుకు అమిత్ షా పన్నుతున్న ఎత్తుగడలపై కూడా వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బీహార్‌లో తనకు విధేయులైన సంజయ్ ఝా, లాలన్ సింగ్ నేతృత్వంలో జేడీయూ ఎంపీల బృందాన్ని ఏర్పాటు చేయడంలో అమిత్ షా చాలా వరకు విజయం సాధించారు. అయినప్పటికీ నితీశ్ వైఖరిపై గుజరాతీ ద్వయం సందిగ్ధతతో ఉన్నది. తమ రాజకీయ మనుగడకు నితీశ్‌తో ముప్పు ఏర్పడుతుందన్న భయం వారిని వెంటాడుతోంది. సంక్షోభాన్ని అనుకూలంగా మార్చుకోవడానికి నితీశ్ ఎంతకైనా దిగజారవచ్చు. ఎల్‌జేపీ, హెచ్‌ఏఎం వంటి చిన్న పార్టీలతో లాలు, నితీశ్ సంబంధాలు కలిగివున్నారని కూడా వర్గాలు తెలుపుతున్నాయి. మోదీ చాలా క్లిష్టపరిస్థితిలో ఉన్నారు. నితీశ్‌ని మింగేయడం గానీ ఉంచుకోవడంగానీ ఆయన చేయలేరు. నితీశ్ విషయంలో బహిరంగంగా ఎటువంటి ప్రకటనలు చేయవద్దని పార్టీ బీహార్ నాయకులకు మోదీ సూచించినట్టు తెలిసింది. కొంతకాలం సంయమనం పాటించాలని అమిత్ షాకి కూడా సూచించారు. పెద్ద నిర్ణయాలు తీసుకునే పార్లమెంటరీ బోర్డుకు నేతృత్వంవహిస్తున్న పార్టీకి తాను కార్యకర్త మాత్రమే అని చెప్పడానికి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని మనం అర్థం చేసుకోవాలి అని రాష్ట్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వ పాత్రని పార్టీ ఇప్పటికే అంగీకరించింది. ఆ విషయంలో వెనక్కు మళ్లే ప్రశ్నేలేదని జైస్వాల్ తెలిపారు. ఈ విధమైన ప్రకటనలు కచ్చితంగా సంక్షోభాన్ని నీరుగార్చే ప్రకటనలే. పార్టీని పట్టిపీడిస్తున్న గందరగోళాన్ని కూడా ఈ విధమైన ప్రకటనలు నొక్కిచెపుతున్నాయి. ఎల్‌జేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజుతివారీ కూడా జైస్వాల్ అభిప్రాయాలను ప్రతిధ్వనించారు. "రానున్న శాసనసభా ఎన్నికలను ఎన్డీయే నితీశ్ కుమార్ నాయకత్వాన ఎదుర్కొంటుంది. ఇందులో ఎటువంటి అనుమానంలేదు" అని చెప్పారు.

బీహార్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలను బట్టి చూస్తే, నితీష్ రాజకీయ నిష్క్రమణకు సిద్ధం కావడం ఖాయం. నితీశ్‌కు లాలు చేసిన ప్రతిపాదన నిర్ణయం తీసుకోవడానికి నితీశ్‌కు ఇంకా సమయం మిగిలివుందనే సాధారణ అభిప్రాయాన్ని సమర్థిస్తోంది. ఆయన రాజకీయ నైపుణ్యాన్ని జాతీయ స్థాయిలో ఉపయోగించుకునే అంశంపై ఇప్పటికే కొందరు ఇండియా ఐక్య సంఘటన నాయకులు చర్చించారు. అయితే, దీనివల్ల కాంగ్రెస్‌కు ఒరిగిందేమీ లేదు. నితీశ్‌తో కలిసి పయనించే విషయమై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఇతర నాయకులు ఆమోదం తెలపాల్సివుంది. తరుచుగా మకర సంక్రాంతి తరువాత ప్రధాన రాజకీయ పరిణామాలు చోటుచేసు కుంటుంటాయి, నిర్ణయాలు తీసుకుంటుంటారు. మకర సంక్రాంతి వరకు వేచిచూడాలని ప్రతిపక్ష నాయకులు భావిస్తున్నప్పటికీ మోదీ చర్యలే వారికి సందేహాస్పదంగా ఉన్నాయి.

కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో భాగంగా

ఆర్వీ రామారావ్

భారత కమ్యూనిస్టు పార్టీ బ్రిటీష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడినందువల్ల తీవ్ర నిర్బంధకాండ ఎదుర్కోవలసి వచ్చింది. తొలి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమం భావ జాలంలో అంతర్జాతీయత, పని తీరులో జాతీయత సూత్రాల మీద ఆధారపడి పని చేసింది. కుల వివక్షకు వ్యతిరేకంగా, భూ సంస్కరణలకోసం పోరాడేది. కచ్చితమైన సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి ప్రదర్శించేది. 1929 నాటికే కమ్యూనిస్టుల మీద నిర్బంధం విపరీతంగా కొనసాగింది. 1933 నాటికే ప్రధానమైన సీపీఐ నాయకులందరూ ఏదో ఒక పేరుతో అరెస్టయి జైళ్లల్లో ఉన్నారు. 1934లో బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. అఖిలభారత కిసాన్ సభ, కార్మిక సంఘాల వంటి ప్రజా సంఘాలనూ నిషేధించింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం ఉండడమే నేరమయ్యేది. ఈ దశలో కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా పని చేయక తప్పలేదు. 1934 నాటికి బొంబాయి, కలకత్తా, పంజాబ్ లాంటి కేంద్రాలలోనే కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు చురుకుగా సాగేవి. మద్రాసులో కూడా కమ్యూనిస్టు పార్టీ చురుకుగానే ఉండేది.

మీరట్ కుట్రకేసులో నిందితులు విడుదలైన తరవాత 1933 నుంచి పార్టీ పునర్నిర్మాణం మొదలైంది. 1934 నాటికి సీపీఐని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో భాగంగా అంగీకరించారు. సహాయ నిరకరణోద్యమాన్ని, 1930లలో శాసనోల్లంఘనోద్యమాన్ని గాంధీ అర్థంతరంగా విరమించడం యువతలో అసంతృప్తికి దారి తీసింది. గాంధీ వ్యవహార సరళి నచ్చని వారు, సోషలిస్టు భావాలున్న వారు 1934లోనే కాంగ్రెస్‌లో అంతర్భాగంగానే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ నెలకొల్పారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఫేబియన్ సోషలిస్టు భావజాలం ఉన్నవారు, మార్క్సిజం-లెనినిజంలో విశ్వాసం ఉన్నవారూ ఉండేవారు. యుసుఫ్ మెహెరలీ, జయ ప్రకాశ్ నారాయణ్, బసవాన్ సింగ్ లాంటి వారు సాయుధ పోరాటాన్ని కూడా సమర్థించేవారు. ఆచార్య నరేంద్ర దేవ్ లాంటి వారు అహింసా మార్గాన్ని అనుసరించాలనేవారు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో కొందరు ప్రజాస్వామ్య సోషలిజం ఉండాలని అనుకున వారు వీరికి మార్క్సిజం మీద విశ్వాసం లేదు. ఇలాంటి వారు సోషల్ డెమాక్రసీకి కూడా వ్యతిరేకులే.

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడకముందే బీహార్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడింది. జయ ప్రకాశ్ నారాయణ్, మినూ మసానీ 1934లో జైలు నుంచి విడుదలైన తరవాత 1934 మే 17న పాట్నాలో ఓ సమావేశం ఏర్పరచి కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి అంకురార్పణ చేశారు. ఈ పార్టీకి ఆచార్య నరేంద్ర దేవ్ అధ్యక్షుడు. జై ప్రకాశ్ నారాయణ్ ప్రధాన కార్యదర్శి. జై ప్రకాశ్ నారాయణ్ గాంధేయ సోషలిస్టు. కానీ ఆయనకు మార్క్సిజం గురించి తెలుసు.

జయ ప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా

బొంబాయిలో 1934 అక్టోబర్ 22-23 తేదీల్లో కాంగ్రెస్ మహాసభ జరిగే సమయంలోనే అఖిల భారత స్థాయిలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడింది. ఈ మహాసభలో కాంగ్రెస్ జెండాలతో పాటు కార్ల్ మార్క్స్ చిత్రపటాలు కూడా ఉండేవి. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ సభ్యులుగా ఉన్నవారికి కాంగ్రెస్‌లో కూడా సభ్యత్వం ఉండాలనేది నియమం. మతతత్వ సంస్థలలో లేదా అలాంటి రాజకీయ సంస్థలలో సభ్యులైన వారికి కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో ప్రవేశం ఉండేది కాదు. బొంబాయి మహాసభలోనే భారత్‌కు రాజ్యాంగం కావాలన్న నినాదాలు చేశారు.

కొమింటర్న్ పాపులర్ ఫ్రంట్ వ్యూహంలో భాగంగా 1936లో కమ్యూనిస్టులు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరారు. కేరళ, ఒరిస్సా లాంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో కమ్యూనిస్టులదే ఆధిపత్యం. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ మీద గట్టి పట్టు ఉన్నందువల్ల కేరళలో కాంగ్రెస్‌పై కమ్యూనిస్టుల పట్టు బలీయంగా ఉండేది. 1936లో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆమోదించింది. ఫైజ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మూడవ మహాసభలో కాంగ్రెస్‌ను సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌గా మార్చాలని నిర్ణయించారు. 1938లో అనుశీలన్ ఉద్యమకారులు సైతం కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరారు. అనుశీలన్ ఉద్యమకారులకు మార్క్సిస్టు సిద్ధాంత భూమిక ఉండేది. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడు నరేంద్ర దేవ్ ఒకప్పుడు అనుశీలన్‌లో మిలిటెంట్ కార్యకలాపాలు కొనసాగించిన వారే. అనుశీలన్ సమితి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరినా తమ ప్రత్యేక అస్తిత్వం కొనసాగించారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ లోని 25 శాతం మంది కూడా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరిపోయారు.

కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో జయప్రకాశ్ నారాయణ్‌కు మార్క్సిస్ట్ భావజాలం ఉండేది. మీనూ మసాని, అశోక్ మెహతాది ఫేబియన్ సోషలిస్ట్ మార్గం. రాం మనోహర్ లోహియా, అచ్యుత్ పట్వర్ధన్ గాంధేయ సోషలిస్టులు. అందువల్ల సహజంగానే సైద్ధాంతిక విభేదాలు అనివార్యమైనాయి. 1939లో త్రిపురిలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ఈ విభేదాలు రచ్చకెక్కాయి. త్రిపుర కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ సుభాశ్ చంద్రబోస్‌ను సరిగ్గా సమర్థించలేదనే వాదనలు ఉండేవి. త్రిపుర కాంగ్రెస్ మహాసభ తరవాత బోస్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆయన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఏర్పాటు చేశారు. వామపక్ష శక్తులను ఐక్యం చేయడం బోస్ ఉద్దేశం. 1939 జూన్‌లో ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, కిసాన్ సభ, లీగ్ ఆఫ్ రాడికల్ కాంగ్రెస్ వారు, లేబర్ పార్టీ, అనుశీలన్ మార్క్సిస్టులతో వామపక్ష సంఘటిత కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీ ఎక్కువకాలం కొనసాగలేదు. సీపీఐ, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, రాయిస్టులు (ఎం.ఎన్.రాయ్ సమర్థకులు) ఆ సంఘటన నుంచి వైదొలిగారు. ఆ తరవాత అనుశీలన్ మార్క్సిస్టులూ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుంచి బయటకు వచ్చి రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఏర్పాటు చేశారు.

1940లో జరిగిన రాంగడ్ కాంగ్రెస్ మహాసభ సమయంలో సీపీఐ "ప్రొలెటేరియన్ పాథ్" పేర డిక్లరేషన్ జారీ చేసింది. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం బలహీనంగా ఉంది కనక ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నది సీపీఐ వాదన. సీపీఐ సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చింది. పన్నులు, కౌలు చెల్లించకూడదని కూడా కోరింది. సాయుధ పోరాటానికి సిద్ధం కావాలన్న సూచనా చేసింది. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ జాతీయ కార్యవర్గం రాంగఢ్‌లోనే సమావేశమై కమ్యూనిస్టులందరినీ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలోంచి బహిష్కరించింది.

హైకోర్టుకు వెళ్లండి: సుప్రీం

న్యూఢిల్లీ: బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) పరీక్షలపై సుప్రీంకోర్టులో అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు. అయితే, అ పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై పాట్నా హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు మంగళవారం సూచించింది. బీపీఎస్సీ ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న వ్యవహారం మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. వేలాదిమంది అభ్యర్థులు పాట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగారు. ఆందోళనకారుల్ని చెదరగొట్టేందుకు పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి... లాఠీఛార్జి చేశారు.

అసోం బొగ్గు గనిలో వరదలు...

ముగ్గురు కార్మికుల జల సమాధి

గువహతి: ఈశాన్య రాష్ట్రం అసోంలోని ఓ గనిలో ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. గనిలో నీరు ఉప్పొంగడంతో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మరికొందరు లోపలే చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ ఘటన దిమా హసావ్ జిల్లాలో చోటుచేసుకొంది. జిల్లాలోని బొగ్గు గనిలోకి తొమ్మిది మంది వెళ్లారు. ఆ సమయంలో లోపల నీరు ఉప్పొంగింది. నీటి ప్రవాహం పెరగడంతో గని నుంచి వరద బయటకు వచ్చింది. దీంతో అందులో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయక బృందాలు సోమవారం నుంచి అవిశ్రాంతంగా పని చేస్తున్నాయి. అయితే అందులో ఇప్పటికే ముగ్గురు కార్మికులు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. ఇంకా మృతదేహాలను స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. మిగిలినవారిని రక్షించేందుకు హెలికాప్టర్లు, ఇంజినీర్ల సహాయంతో చర్యలు చేపట్టారు. 'నిన్న రాత్రి గని నుంచి ఒక్కసారిగా వరద వచ్చింది. లోపల చిక్కుకున్నవారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. జాతీయ, రాష్ట్ర విపత్తు సహాయక దళాలు, ఆర్మీ నుంచి రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి' అని జిల్లా పోలీసు ఉన్నతాధికారి మయాంక్ కుమార్ తెలిపారు.

కేసుల సత్వర విచారణ కోసం 'భారత్‌పోల్' పోర్టల్

న్యూఢిల్లీ: కేసుల సత్వర విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్త వ్యవస్థను ఆవిష్కరించింది. భారత్ పోల్ పేరిట తీసుకొచ్చిన పోర్టల్‌ను మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. అంతర్జాతీయ కేసుల విషయంలో కొత్త శకం ప్రారంభమైనట్లేనని మంత్రి చెప్పుకొచ్చారు. దర్యాప్తు సంస్థలు సరికొత్త సాంకేతిక పద్ధతులు వినియోగించుకొని పరారీలో ఉన్న నేరగాళ్లను అదుపులోకి తీసుకునేందుకు ఇది ఉపకరించనుంది. ఏజెన్సీలు వేగవంతంగా అంతర్జాతీయ పోలీసుల సహకారం తీసుకునేందుకు సీబీఐ సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన దర్యాప్తు సంస్థలు ఇంటర్‌పోల్‌తో సులువుగా కనెక్ట్ అయ్యేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించి, మన వ్యవస్థల్లో మార్పులు చేసుకోవాల్సిన, ఆధునిక సాంకేతికతను ఉపయోగించాల్సిన సమయం ఇది. ఆ దిశగా భారత్‌పోల్ అనేది ఒక అడుగు' అని అమిత్ షా పేర్కొన్నారు. ఈ కొత్త వ్యవస్థతో పాటు మూడు నేర చట్టాల గురించి రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను సీబీఐ తీసుకోవాలని కోరారు.

ఆస్కార్ బరిలో 'కంగువ'

న్యూఢిల్లీ: తమిళ నటుడు సూర్య నటించిన కంగువ సినిమా ఆస్కార్ బరిలో నిలిచింది. ఈ సినిమా ప్రజాదరణ పొందకపోయినప్పటికీ భారత్ నుండి ఆస్కార్ 2024 బరిలో నిలిచి షార్ట్ లిస్ట్ అయింది. మరోవైపు థియేటర్, ఓటీటీలలో ప్రతి ఒక్కరి మన్ననలు పొందిన కిరణ్ రావు 'లాపతా లేడీస్'కు స్థానం దక్కలేదు. బెస్ట్ పిక్చర్ కోసం మొత్తం 323 సినిమాలు పోటీపడగా ఎలిజిబుల్ లిస్ట్‌లో 'కంగువ' చోటు దక్కించుకుంది. ఈ సినిమా కథనం నెమ్మదిగా ఉన్నా.. సినిమాలోని అటవీ ప్రపంచం, అందులో నివసించే తెగ నేపథ్యం, విజువల్ ఎఫెక్ట్స్‌ను పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

హెచ్ఎంపీవీని తేలిగ్గా తీసుకోవద్దు: బీజేపీ

బెంగళూరు: దేశంలో నమోదు కావడంపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కర్నాటకలో రెండు హెచ్ఎంపీవీ కేసులు వెలుగు చూడడంపై ప్రతిపక్ష బీజేపీ స్పందించింది. ఈ వైరస్‌ను అంత తేలిగ్గా తీసుకోవద్దని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించింది. 'కొత్త వైరస్ పట్ల ప్రజలు భయాందోళనకు గురి కావొద్దనే ఉద్దేశంతోనే ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడారు. కానీ, దాని ప్రభావం గురించి ఏం తెలియనప్పుడు హెచ్ఎంపీవీని తేలికగా తీసుకోవద్దు. ఈ వైరస్ చైనాలో బీభత్సం సృష్టిస్తోంది. అక్కడి చిన్నారులు ఆస్పత్రుల పాలయ్యారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు.

దిల్లీ ఎన్నికల్లో విజయం మాదే



ఆప్ అధినేత కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దీనిపై స్పందిస్తూ ఇది అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య జరుగుతోన్న పోరు అని పేర్కొన్నారు. పూర్తి సామర్థ్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. తాము చేసిన అభివృద్ధి రాజకీయాల పట్ల ఓటర్లు విశ్వాసం చూపుతారని ఆశాభావం వ్యక్తంచేశారు. 'ఎన్నికల తేదీలు వచ్చేశాయి. కార్యకర్తలందరూ ఉత్సాహంతో, పూర్తి శక్తితో బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉండాలి. మీరే మా బలం. మీ అభిరుచి ముందు వారి వ్యవస్థలన్నీ విఫలమవుతాయి. ఇది అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య జరుగుతోన్న పోరు. తాము చేసిన అభివృద్ధి పట్ల దిల్లీ ప్రజలు విశ్వాసం చూపుతారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తాం' అని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు.

సీఎం ఇల్లు ఖాళీ చేయిస్తారా: ఆతిశీ

ముఖ్యమంత్రిగా తనకు కేటాయించిన నివాసాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా మరోసారి రద్దు చేసిందని దిల్లీ సీఎం ఆతిశీ విమర్శించారు. మూడు నెలల వ్యవధిలో ఇలా జరగడం ఇది రెండోసారని అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నివాసాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి సోమవారం నోటీసులు వచ్చాయని అన్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సిందిగా అందులో పేర్కొన్నారని వివరించారు. తన కుటుంబ సభ్యులను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటోందని ఆతిశీ ఆరోపించారు. 'నేను సీఎంగా ఎన్నికైన తర్వాత మా వస్తువులన్నింటినీ బీజేపీ కార్యకర్తలు రోడ్డుమీదకి విసిరేశారు. మా నివాసాలను బీజేపీ గుంజుకోవచ్చేమో కానీ, దిల్లీ ప్రజల అభివృద్ధి కోసం పని చేయకుండా మమ్మల్ని ఆపలేరు. అవసరమైతే దిల్లీ ప్రజల ఇళ్లలోనే ఉంటూ... వాళ్ల కోసం పని చేస్తా' అని అన్నారు.

ఆప్ సరికొత్త ప్రచార గీతం ఆవిష్కరణ

దేశ రాజధాని దిల్లీలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఇప్పటికే అభ్యర్థుల జాబితా ప్రకటించగా... బీజేపీ, కాంగ్రెస్ విడతలవారీగా ప్రకటిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్షాలు సోషల్ మీడియాను ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నాయి. ఈ సమయంలో కేజ్రీవాల్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని సూచిస్తున్న ప్రత్యేక ప్రచారగీతాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ ('ఫిర్ లాయేంగే కేజ్రీవాల్') మంగళవారం విడుదల చేసింది. ఈ ప్రచార గీతంలో దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, పార్టీ నేతలు సిసోదియా, సంజయ్ సింగ్ తదితరులు దిల్లీ ప్రజల కోసం ఆప్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. తమ పార్టీ గీతాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కేజ్రీవాల్ ప్రజలను కోరారు. మరో పోస్ట్‌లో వివిధ పోస్టర్లను ఆప్ షేర్ చేస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించింది.

మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొని జైలుశిక్ష అనుభవించిన కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి... పార్టీ నేత, మంత్రి ఆతిశీని సీఎంగా ప్రకటించారు. ప్రజలు తనకు సర్టిఫికెట్ ఇచ్చేంతవరకూ ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని స్పష్టంచేశారు. సీఎం కుర్చీ నుంచి దిగిపోయి... మధ్యంతర ఎన్నికలకు వెళ్లి ప్రజల్లో తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని ప్రకటించారు. దిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరుగుతాయి.

ఐసీయూలో ప్రశాంత్ కిశోర్

ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తరలింపు

పాట్నా : జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయన్ను ఐసీయూకి తరలించారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రశాంత్ కిశోర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను సోమవారం పోలీసులు భగ్నం చేసి... అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఆయన షరతులు లేని బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా నాలుగు రోజుల పాటు నిరాహార దీక్ష చేయడంతో ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం క్షీణించిందని.. ఆయనను పాట్నాలోని ఆస్పత్రికి తరలించామని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ఆయనను మేదాంత ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) కి తరలించారు. ఆయన డీహైడ్రేషన్, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఉదయం ఆసుపత్రిలో చేరినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ తెలిపింది. పూర్తి సమయం రాజకీయాల్లోకి రాకముందు ఎన్నికల వ్యూహ కర్తగా ఉన్న కిశోర్ బీపీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న సివిల్ సర్వీస్ అభ్యర్థులకు మద్దతుగా జనవరి 2వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. అయితే పోలీసులు ఆయన దీక్షను భగ్నం చేసి, సోమవారం మధ్యాహ్నం పాట్నా కోర్టు ముందు హాజరుపరిచారు. న్యాయస్థానం ఆయనకు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. భవిష్యత్‌లో ఎటువంటి 'చట్టవిరుద్ధమైన' నిరసనలో పాల్గొనకూడదని రాతపూర్వక హామీ ఇవ్వాలని ఆదేశించింది. కిశోర్, ఆయన న్యాయ బృందం ఈ షరతు 'అపరాధాన్ని అంగీకరించడం' తో సమానమని పేర్కొంది. కిశోర్‌ను జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేశారు. అనంతరం సాయంత్రం అధికారులు ఆయనను విడుదల చేశారు. ఇదిలాఉండగా, బెయిల్ ఎందుకు తిరస్కరించారనే దానిపై ప్రశాంత్ కిశోర్ సోమవారం సాయంత్రం కోర్టు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ 'నన్ను కోర్టుకు తీసుకెళ్లి బెయిల్ మంజూరు చేశారని, అయితే బెయిల్ ఆర్డర్‌లో ఎలాంటి తప్పులు చేయకూడదని పేర్కొనడంతో దాన్ని తిరస్కరించి జైలుకు వెళ్లేందుకు అంగీకరించాను' అని తెలిపారు. పోలీసులు దీక్షను భగ్నం చేసిన అనంతరం తనను ఎక్కడికి తీసుకువెళుతున్నారనే విషయం తెలియజేయలేదని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు పోలీసు వాహనంలోనే కూర్చోబెట్టి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లారన్నారు. సరైన పత్రాలు లేకుండానే తనను కోర్టు నుంచి పోలీసులు తీసుకెళ్లారని పేర్కొన్నారు. తనను జైలుకు కూడా తీసుకెళ్లలేదని పేర్కొనడం గమనార్హం.

సల్మాన్ ఇంటికి బులెట్ ప్రూఫ్ భద్రత

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటికి భద్రత పెంచారు. సల్మాన్ ఇంటి దగ్గర కాల్పులు, బెదిరింపుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా సల్మాన్ ముంబైలోని నివాసం గ్యాలక్సీ అపార్టుమెంట్స్ వద్ద ఓ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్‌ని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కృష్ణ జింకని వేటాడిన కేసులో కోర్ట్ సల్మాన్ ఖాన్‌కి ఉపశమనం ఇచ్చినా బిష్ణోయ్ గ్యాంగ్ మాత్రం వదలడం లేదు. బిష్ణోయ్‌లకు పవిత్రమైన కృష్ణ జింకను వేటాడినందుకు సల్మాన్‌ని వదిలే ప్రసక్తే లేదని బిష్ణోయ్ గ్యాంగ్ పదేపదే బెదిరిస్తోంది. ఇటీవల సల్మాన్ మిత్రుడు బాబా సిద్దిఖీని హతమార్చి... తర్వాత సల్మాన్ ఖాన్‌ను చంపుతామని హెచ్చరించింది. గతంలోనూ సల్మాన్ హత్యకే బిష్ణోయ్ గ్యాంగ్ పథకం రూపొందించింది. గత ఏడాది జూన్‌లో ఇంటి నుంచి పనేవాల్‌లో ఉన్న తన ఫామ్‌హౌస్‌కి వెళ్తున్న సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఆ దాడి నుంచి సల్మాన్ తప్పించుకున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పోలీసులు హర్యానాలో పట్టుకున్నారు.

గవర్నర్ తీరుపై డీఎంకే ఆగ్రహం

నేతల భారీ నిరసన

చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరును నిరసిస్తూ డీఎంకే మంగళవారం భారీ నిరసన చేపట్టింది. గవర్నర్ సోమవారం అసెంబ్లీ నుండి వాకౌట్ చేశారు. ఆయన సభ నుండి వాకౌట్ చేయడం వరుసగా ఇది మూడవసారి. డీఎంకే ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్ సహా పలువురు సీనియర్ నేతలు, మద్దతుదారులు ఈ నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్ర గీతాన్ని గవర్నర్ అగౌరవపరిచారని విమర్శించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించడలో గవర్నర్ రవి విఫలమయ్యారని ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయనను గవర్నర్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సహనానికి పరిమితి ఉంటుందని కనిమొళి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుండి వాకౌట్ చేయడం వరుసగా ఇది మూడోసారి అని, గవర్నర్ మరోసారి గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. అసెంబ్లీ నుండి వాకౌట్ చేస్తూ ఇబ్బందికి గురికాకుండా ఇంట్లోనే ఉంటే మంచిదని ఎద్దేవా చేశారు. ముందుగా తమిళ గీతం, తర్వాత జాతీయ గీతం ఆలపించడం రివాజు అని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో మొదటి రోజు సభ నుద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉంది. అయితే రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అగౌరవపరిచారని ఆరోపిస్తూ సభ మధ్యలోనే వెళ్లిపోయారు. తన ప్రసంగానికి ముందు జాతీయ గీతం ఆలపించడానికి నిరాకరించడం జాతీయ గీతం కోడ్ ఉల్లంఘనేనని ఆరోపించారు. ఈ వాదనను డీఎంకే తీవ్రంగా ఖండించింది. గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళ గీతం (తమిళ తాయ్ వజ్తు), సెషన్ ముగింపులో జాతీయ గీతం ఆలపించడం రివాజు అని డీఎంకే నేతలు పేర్కొన్నారు. గవర్నర్ చర్యలు 'పిల్ల చేష్టలు' అని ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, అసెంబ్లీని, తమిళనాడు ప్రజలను పదేపదే అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. గవర్నరు తమిళనాడు సంప్రదాయాలను దెబ్బతీస్తున్నారని, రాష్ట్ర పాలనలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ గవర్నర్లను వినియోగిస్తోందని దుయ్యబట్టారు.

బడ్జెట్‌పై గంపెడాశ

కొత్త పన్నువిధానంపై ఊహాగానాలు



న్యూఢిల్లీ: మరికొద్ది రోజుల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025- 26 ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. సాధారణంగానే బడ్జెట్‌పై దాదాపు అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకుంటారు. బడ్జెట్‌లో కొత్త పన్ను విధానం ఎలా ఉండబోతుంది. భవిష్యత్తులో పన్నులను సులభతరం చేస్తారా? ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం ఉంటుందా అనే సందేహాలు ఉంటాయి. రానున్న బడ్జెట్‌లో కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోనేందుకు పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు అవకాశం ఉండవచ్చని తెలుస్తోంది. అందులోభాగంగా పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడంపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అందుకోసం ఈ బడ్జెట్‌లో ఆకర్షణీయమైన మార్పులు చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆలోచనతో ఉన్నట్లు చర్చ సాగుతోంది. 2020 నాటి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానం ద్వారా పన్ను రేట్లు తగ్గించారు. అందులో చాలా మినహాయింపులు ఇచ్చారు. తద్వారా పన్నుల ప్రక్రియను సులభతరం చేశారు. సంప్రదాయ పన్ను ప్రయోజనాలు వదులు కోవడానికి సిద్ధంగా ఉన్న వారికి స్వల్ప పన్ను రేట్లు ఇస్తామని వాగ్దానం చేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా ఆరు శ్లాబ్‌లతో కూడిన పన్ను విధానం తీసుకువచ్చారు. ఉదాహరణకు... ఏడాదికి రూ.15 లక్షలు సంపాదించే వ్యక్తి ప్రస్తుతం రూ.1.95 లక్షల పన్నులు చెల్లిస్తున్నారు. అదే పాత విధానంలో రూ.2.73 లక్షలుగా ఉండేది. ఇక పన్ను చెల్లింపుదారులు... పాత, కొత్త పన్నులు చెల్లించే విధానాల్లో దేనినైనా ఎంచుకోవచ్చనే విధానాన్ని తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే 2021, 2022 బడ్జెట్‌లో కొత్త పన్ను విధానం అమలు చేయలేదు. కానీ 2023 బడ్జెట్‌లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చారు. పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ పాత పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. అలాగే వారు తమ రిటర్న్‌లను దాఖలు చేసే ముందు తప్పని సరిగా తమ ఎంపికను స్పష్టం చేయాల్సి ఉంది. 2024 బడ్జెట్‌లో మాత్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా జీతం తీసుకునే ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూర్చారు. దీంతో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000కు పెంచారు. ప్రైవేట్ రంగంలో పని చేసే ఉద్యోగులు నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో పెట్టుబడుల కోసం వారి ప్రాథమిక జీతంలో 14 శాతం వరకు తగ్గింపునకు అర్హులుగా నిర్ణయించారు. మరికొద్ది రోజుల్లో ప్రజల ముందుకు రానున్న ఈ బడ్జెట్‌లో... మధ్య తరగతి ప్రజలు, పన్ను చెల్లింపుదారుల ఆర్థిక స్థితిగతులను పట్టించుకోని వారికి అనుగుణంగా ఈ పన్ను విధానంలో మార్పులు ఉంటాయనే భావన వ్యక్తమవుతోంది. అవి పన్నుల సంస్కరణల కొనసాగింపునకు ఊతం ఇస్తాయనే అభిప్రాయం వినిపిస్తోంది.

పొదుపు పెంచుతారా... ఇబ్బంది పెడతారా

మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రంలోని మోదీ సర్కార్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ద్రవ్యోల్బణం అంశాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ప్రధాని మోదీజీ.. బడ్జెట్‌లో ప్రజల పొదుపు పెంచే ప్రణాళిక ఏమైనా ఉందా? లేదా ద్రవ్యోల్బణంతో వారిని ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంటారా? ఆరు నెలలుగా ఆయిల్, టీ, కాఫీ, బిస్కెట్, సబ్బులు ఇలా నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. పన్ను భారం వల్ల సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి బడ్జెట్‌లో ఉపశమనం కల్పించే ఆలోచన ఏమైనా ఉందా' అని 'ఎక్స్' వేదికగా ఖర్గే ప్రశ్నించారు. 'వినియోగం తగ్గుతోంది. ఆర్థిక మాంద్యంపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం ఎలా తగ్గుతుంది? ప్రజాధనాన్ని లూటీ చేయడం, బిలియనీర్ మిత్రులకు లబ్ధి చేకూర్చడమే బీజేపీ లక్ష్యంగా ఉంది. మీ తీరు పట్ల ప్రజలు మేల్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మీకు గుణపాఠం చెబుతారు' అని అన్నారు.

ఆశారాంకు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: అత్యాచార కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న వివాదాస్పద స్వామీజీ ఆశారాంకు ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాలతో న్యాయస్థానం ఆశారాంకు మార్చి 31 వరకు బెయిల్ ఇచ్చింది. బెయిల్‌పై విడుదలైన ఆయన తన అనుచరులను కలవకూడదని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఆశారాం ఆస్పత్రికి వెళ్లేటప్పుడు భద్రత కల్పించాలే తప్ప ఆయన ఎక్కడికి వెళ్లాలో నిర్దేశించవద్దని పోలీసులను కోరింది. గుజరాత్ మోతేరాలోని ఆశారాం ఆశ్రమంలో పనిచేస్తున్న సమయంలో తనపై ఆయన పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు సూరత్‌కు చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2001 నుంచి 2006 మధ్య తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆశారాంతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో గాంధీనగర్ సెషన్స్ కోర్టు ఆయనను దోషిగా తేల్చింది. మిగిలినవారికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోవడంతో వారిని విడుదల చేసింది. ఆశారాంకు జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. జోధ్‌పూర్‌లోని ఆశ్రమంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం కేసులోనూ ఆయన దోషిగా తేలారు. ఈ కేసులోనూ ఆయనకు జీవితఖైదు పడింది.

నానమ్మ అపరిచిత వ్యక్తే

బెంగళూరు టెకీ తల్లి పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: భార్య వేధింపులు తాళలేక బెంగళూరు టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య చేసుకోవడంతో తన మనవడిని తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ అతుల్ తల్లి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 'చిన్నారి తల్లి సజీవంగా ఉంది. ఈ మాట మేం చెప్పకూడదు కానీ... ప్రస్తుతానికి మీరు ఆ బిడ్డకు అపరిచిత వ్యక్తి మాత్రమే. మీకు కావాలనుకుంటే ఆ చిన్నారి వద్దకువెళ్లి చూసిరండి. మీకు బాలుడి కస్టడీ కావాలనుకుంటే...అదంతా వేరే ప్రక్రియ' అని స్పష్టం చేసింది. నేరం రుజువయ్యేవరకు సుభాశ్ భార్య నికితా సింఘానియాను దోషిగా పేర్కొనొద్దని సూచించింది. అయితే, బాలుడి జాడ గుర్తించేందుకు వేసిన పిటిషన్‌పై విచారణను జనవరి 20కు వాయిదా వేసింది. ప్రస్తుతం ఆ చిన్నారి తల్లి కస్టడీలోనే ఉన్నాడని నికిత తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఇదిలా ఉంటే హర్యానాలో ఫరిదాబాద్‌లోని బోర్డింగ్ స్కూల్‌లో తన కుమారుడు చదువుతున్నాడని, తన సమీప బంధువు సుశీల్ సింఘానియా కస్టడీలో ఉన్నాడని అతుల్ భార్య పోలీసులకు చెప్పినట్లు సమాచారం. అయితే పిల్లాడి జాడ గురించి తనకు తెలియదని సుశీల్ చెప్పడం గమనార్హం. భార్య వేధింపులు తట్టుకోలేక అతుల్ సుభాశ్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. మరణానికి ముందు ఆయన ఏకంగా 40 పేజీల లేఖ రాసి బలవన్మరణానికి పాల్పడ్డారని పోలీస్ అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన ఒక కంపెనీలో ఐటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ మారతహళ్లిలోని మంజునాథ లేఅవుట్లో ఉండేవారు. భార్యతో తాను అనుభవిస్తున్న మానసిక క్షోభకు సంబంధించి రాసిన లేఖను ఇ-మెయిల్ ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తన కార్యాలయం అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులకు పంపించి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఈవీఎంలపై అనుమానాలు నివృత్తి చేయొచ్చుగా

ఆదిత్య

ముంబై: కేంద్ర ఎన్నికల సంఘంపై ఉద్ధవ్ ఠాక్రే శివసేన పార్టీ నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యం కాదంటూ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ చేసిన వ్యాఖ్యల ను ఆయన తప్పుపట్టారు. ఈవీఎంల ట్యాంపరింగ్ కచ్చితంగా జరుగుతున్నదని ఠాక్రే ఆరోపించారు. ట్యాంపరింగ్ జరగడం లేదని సీఈసీ ఏ ఆధారంతో చెబుతున్నారని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ట్యాంపరింగ్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని, ఈవీఎంలను, బ్యాలెట్ పేపర్లను పక్కపక్కన పెట్టి వాటిని ట్యాంపరింగ్ చేయవచ్చో లేదో గమనించాలని ఆదిత్య సూచించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరు చూస్తే... అది కాంప్రమైజ్డ్ కమిషన్ ఆఫ్ ఇండియాలా కనిపించిందని వ్యాఖ్యానించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా రాజీవ్ కుమార్ ఈవీఎంల గురించి మాట్లాడారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నదన్న ప్రతిపక్షాల విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యం కాదని, ఈవీఎంల ట్యాంపరింగ్ చేయవచ్చనడానికి ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. ఈవీఎంలను అనుమానించాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఈవీఎంల రిగ్గింగ్ జరగలేదని ఈసీ ఎలా చెప్పగలదు

సందీప్ దీక్షిత్

న్యూఢిల్లీ: ఈవీఎంలపై న్యూఢిల్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, దిల్లీ మాజీ ముఖ్య మంత్రి షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్ మరోసారి విమర్శలు చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నదని వ్యాఖ్యానించారు. ఈవీఎంలను రిగ్గింగ్ చేయడం అసాధ్యమని ఈసీఐ రాజీవ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు.

ఈవీఎంల రిగ్గింగ్ అసాధ్యమని ఎన్నికల సంఘం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల రిగ్గింగ్ చోటుచేసుకుందని ఆరోపించారు. ఓట్లు గంపగుత్తగా ఒకే పార్టీకి పడుతున్నా ఈవీఎంల రిగ్గింగ్ అసాధ్యమని చెప్పడం అమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. తాను ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు సామాన్య ప్రజలు చాలామంది ఈవీఎంల రిగ్గింగ్ గురించి మాట్లాడారని చెప్పారు. 'మీరెందుకు అనవసరంగా ఓట్లడుగుతున్నారు? ఓట్లన్నీ గంపగుత్తగా బీజేపీకే పడుతున్నాయిగా. ఈవీఎంలు ఉన్నంతకాలం ఓట్లు బీజేపీకే వెళ్తాయి' అని సామాన్యులు అంటున్నట్లు సందీప్ దీక్షిత్ తెలిపారు. ఈవీఎంలు ఉన్నంత కాలం బీజేపీ తప్ప మరే పార్టీ గెలువదని సామాన్యులు చెబుతున్నట్లు ఆయన వెల్లడించారు. కాబట్టి సామాన్యుల అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నదని దీక్షిత్ అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సివిల్ సప్లయీస్ కార్మికుల సమ్మె విజయవంతం

విశాలాంధ్ర (మహబూబాబాద్) - తొర్రూరు : పౌర సరఫరాల శాఖ మంత్రి హామీతో సివిల్ సప్లై కార్మికుల నిరవధిక నిరాహార దీక్ష విరమణ చేసినట్లు వాపక్ష నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఎం జిల్లా బొల్లం అశోక్ సిపిఐ ఎంఎల్ మాస్ నాయకులు కొత్తపెల్లి రవి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు హెూమ బిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈనెల 1వ తారీఖు నా మొదలు పెట్టిన సివిల్ సప్లై హమాలీ కార్మికుల నిర్మధిక సమ్మెను మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి హామీ మేరకు విరమిస్తున్నట్లు వారు తెలిపారు.గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతి పెంపుదల, కోసం పట్టుదలతో చేస్తున్న సమ్మెకు ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చి, ఎగుమతి దిగుమతి రేట్లను సవరిస్తామని కచ్చితంగా హామీ ఇచ్చిన ధర్మీల, సివిల్ సప్లై కార్మికులు తమ సుదీర్ఘకాలం చేసిన సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా కార్మికులు, కార్మిక సంఘాలు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎప్పుడైనా కార్మిక వర్గాన్ని ఆదుకోవాలని, వాళ్ళ కష్టానికి తగ్గ ఫలితాన్ని ఇచ్చినప్పుడే ప్రభుత్వాలు మనగడ సాధిస్తాయని తెలిపారు. ప్రజలకు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా పి డి ఎస్ బియ్యం సక్రమంగా గ్రామాలకు చేరుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గణపురం లక్ష్మణ్, సిపిఎం మండల కార్యదర్శి ఎం డి యాకూబ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పేర బోయిన కిరణ్, హమాలీ నాయకులు పల్లె సైదులు, వెలిశాల ప్రభాకర్ , బొల్లు శీను, బొమ్మెర బోయిన లింగయ్య, కత్తుల కుమార్, పనికిర రమేష్, జమ్ముల వెంకట మల్లు, నల్లగంటి ఐలయ్య, పులగూర రమేష్ పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్ పై అవగాహన

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఇంకా ఏఐజి హాస్పిటల్స్ తమ 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్'- మొబైల్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ వర్గాల ప్రజలకు అందించడానికి విస్తరింపజేస్తున్నట్లు ప్రకటించాయి. ఏషియన్ మెడికల్ ఫౌండేషన్, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్‌ల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం, సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా మహిళలందరికీ రొమ్ము క్యాన్సర్ నివారణ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడానికి ఒక ముందడుగు. గాగిల్లాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ యొక్క అత్యాధునిక సౌకర్యాలు, బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కోసం రూపొందించిన కార్యాచరణ , ముందస్తుగా గుర్తించే సమగ్ర విధానాన్ని ప్రదర్శించారు. విలేకరుల సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, డాక్టర్ టి. రఘునాథ స్వామి, అధునాతన రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను జిల్లాలోని మహిళలందరికీ నేరుగా అందించడానికి రూపొందించిన కార్యక్రమాన్ని వివరించారు.

గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఈ కార్యక్రమం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను చెబుతూ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా తో మొదలుపెట్టి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ కార్యక్రమం విస్తరించడానికి కట్టుబడి ఉన్నాము. అవసరమైన స్క్రీనింగ్ సేవలను నేరుగా గ్రామీణ వర్గాల చెంతకు తీసుకురావడం ద్వారా, రొమ్ము ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ ఆరోగ్య సంరక్షణకు అడ్డంకులను తొలగిస్తున్నాము. ఈ కార్యక్రమం, మహిళల భౌగోళిక లేదా ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి స్త్రీకి నివారణ రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ అందుబాటులో ఉండాలనే నమ్మకంను ప్రతి బింబిస్తుంది అని అన్నారు. ఏఐజి, కన్సల్టెంట్ బ్రెస్ట్ అంకాలజిస్ట్ యుసి బ్రెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి ఈ కార్యక్రమం యొక్క వైద్య ప్రాముఖ్యతను వివరించారు.

బాధ్యతాయుత జర్నలిజం వైపుగా "ఐడి టీవీ" అడుగులు వేయాలి : ఎమ్మెల్యే వివేకానంద్

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : నిస్పక్షమైన వార్తలతో బాధ్యతాయుతమైన జర్నలిజం వైపుగా "ఐడి టీవీ" అడుగులు వేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్ నందు మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన "ఐడి

టీవీ" ఛానల్ కుత్బుల్లా పూర్ నియోజకవర్గ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, సీనియర్ జర్నలిస్ట్ ఆశం యాదగిరితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లా డుతూ నిస్పక్షమైన వార్తలతో ప్రజా సమస్యలను ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు చేర వేయడంలో ఐడి టీవీ బాధ్యతాయుతమైన జర్నలిజం వైపుగా అడుగులు వేస్తుందని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిషే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ఇంచార్జ్ విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, సీనియర్ జర్నలిస్ట్ ఆస్కానీ మారుతి సాగర్, ఐడి టీవీ చైర్మన్ అంజి బాబు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భరత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : మంగళవారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీ కృష్ణజ హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ రాంబాబు,బాచుపల్లి 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్‌తో ఎమ్మెల్యే కేపీ వివేకానందని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సత్కరించి వారి సమస్యలను పరిష్కరించగలరని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం చంద్రశేఖర్, జల్లారి రమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.15,000 రైతు భరోసా ఇవ్వాలి

విశాలాంధ్ర- ముదిగొండ : రైతు భరోసా రూ. 15000 ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కేంద్రం ముదిగొండలో తహశీల్దార్ కు ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా రూ.15000 రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.15000 ఇస్తామని రైతుల్ని మోసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ పొట్లవెంకట ప్రసాద్, బారసా జిల్లా నాయకులు బంక మల్లయ్య, కార్యదర్శి గడ్డం వెంకట్, నాయకులు కోటి అనంత రాములు, ఎస్కే ఖాజా, మల్లెపల్లి శంకర్, నాగార్జున, సామినేని నాగేశ్వరరావు, రైతులు కొమ్మూరి వెంకయ్య, కే రంగారెడ్డి,పచ్చ సీతారామయ్య, సత్యనారాయణరెడ్డి, తోటమల్ల గురుమూర్తి, షేక్ లాల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ సారధి రెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి అజయ్ సారధి రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ముందు అంగన్వాడి టీచర్స్, అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ కు మరియు పిడి లకు పలు డిమాండ్లతో కూడి నవినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారీశ్వరి లతో కలిసి ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు గౌరవ వేతనం 26వేల రూపాయలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, అంగన్వాడీ టీచర్లకు టాప్ అందించాలన్నారు, అదనపు ఆప్స్ ని రద్దుచేసి పని భారం తగ్గించాలని కోరారు. పెండింగ్లో ఉన్న ఇంటి అద్దెలు ,గ్యాస్ బిల్స్ తదితర బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు పక్కాభవనాలు నిర్మించి, టాయిలెట్స్ ,త్రాగునీరు ,విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఖాళీగా ఉన్నటువంటి టీచర్ ఆయా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత మంత్రి సీతక్క స్పందించి వెంటనే ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిర్రా లక్ష్మీనరసమ్మ, ఎల్లారీశ్వరి ,లలిత ,సౌమ్యశ్రీ ,పద్మ, శివమ్మ ,బి పద్మ ,సరిత ,భానుమతి, స్వప్న ,మహాలక్ష్మి ,దాసరి కవిత ,రమా, రాజ్యలక్ష్మి ,సక్కుబాయి ,శారద, యాకలక్ష్మి ,పెరుగు కుమార్, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్ ,నక్క నాగార్జున, వికాస్ ,వెంకటేష్ ,డి రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధ్యాన్యత గుర్తించి పనిచేయాలి : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యత ఎరిగి పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతులు, ప్రజా ప్రతినిధుల, మంత్రుల నుండి వచ్చే విజ్ఞప్తులపై సత్వరమే పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పరిష్కారంలో జాప్యం పై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు వ్యవసాయ, అనుబంధారంగాల ప్రగతిపై అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధిక మొత్తంలో సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనం అందేలా వ్యవసాయ యాంత్రికరణను, సూక్ష్మ సేద్య పరికరాలకు మరింతగా ప్రోత్సాహం అందుతుందన్నారు. ట్రేడర్లు రైతుల వద్దకు వెళ్ళి కొనేలా రాష్ట్రంలో 3 ఆధునిక మార్కెట్లను అధునాతన హంగులతో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు. సంచార భూసార పరీక్ష కేంద్రాలను ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీలలో ప్రస్తుతమున్న మౌళిక సదుపాయాల వృద్ధికి మరియు కొత్త భవనాల నిర్మాణాలకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా సూచించారు..రైతువేదికల నిర్వహణ ఖర్చుల నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరములో ఇంకో 1000 రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రైతుభరోసా అమలుకు చర్యలు వేగవంతం చేయడంతో పాటు సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేకదృష్టి పెట్టాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. వచ్చే బడ్జెట్లో ప్రభుత్వ ప్రాధాన్యతలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా పేర్కొన్నారు.

సాగర్ డ్యామ్‌పై గుంతల పూడ్చివేతకు రంగం సిద్ధం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాగార్జున సాగర్ డ్యామ్ మీద పడిన గుంటలను పూడ్చివేతకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అందుకు కోసం ఐ.ఐ.టీ రూర్కీ వారి ఆధ్వర్యంలో అధ్యయనం జరపాలని ఆయన నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకంతో సహా హైలెవల్, లోలెవల్,లింక్ కెనాల్ లతో పాటు సాగర్ డ్యామ్ మీద పడిన గుంటల పూడ్చివేతపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జలసౌధలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నెల్లికల్లు ఎత్తిపోతల పథకం ఫెజ్-1పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు పనులు ముమ్మరం చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికీ నీళ్లు అందించే విదంగా ప్రణాళికలు రూపొం దించుకోవాలని ఆయన అధి కారులకు సూచించారు. నాగార్జున సాగర్ జలాశయం నుంచి నీటిని అందించే నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూ.664.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే 24,624 ఎకరాల ఆయ కట్టు ను సేద్యంలోకి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ నాటికి మొదటి దశ పూర్తి అయితే 7,600 ఎకరా లకు నీరందించవచ్చన్నారు. 15కిలోమీటర్ల పరిధిలో రూ.62.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ కాలువ నిర్మాణం కోసం కావలసిన 65. 02 ఎకరాలకు ఇప్పటికే 43.31 ఎకరాల భూమిని సేకరించినట్లు ఆయన తెలిపారు. త్వరిత గతిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. చివరి భూములకు నీరు అందేలా ఏ.యం. ఆర్.,ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్ట్ ల పరిధిలోని 90.43 కిలోమీటర్ల మేర కాలువలను రూ.42.26 కోట్ల వ్యయంతో 60 మిల్లీమీటర్ల మేర కాంక్రీట్ లైనింగ్ తో మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని 39 ఐ. డి.సి ఎత్తిపోతల పథకాలలో ఎక్కువ భాగం పనిచేయడం లేదని,పనిచేయని వాటిని గుర్తించి మరమ్మతులకు అయ్యే వ్యయం తాలూకు అంచనాలు రూపొందించిన సత్వరమే పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుమల చెక్ డ్యామ్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు మం జూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావే శంలో నల్లగొండ లోకసభ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు జయవీర్ రెడ్డి, మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డి, నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇ. ఎన్.సి అనిల్ కుమార్, ఇ.ఎన్.సిఓ అండ్ యం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఇ.ఎన్.సి కే. శ్రీనివాస్, నల్గొండ ఎస్.ఇ అజయ్ కుమార్ సి.ఇ కే. శ్రీధర్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

నగరంలో హైటెన్షన్

కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాలపై పరస్పర దాడులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం మంగళవారం అట్టుడికింది. డిల్లీలో రాజుకున్న వేడి నగరానికి తాకడంతో ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పర దాడులు చేసుకునే వరకు చేరుకుంది. ఏకంగా కర్రలు, రాళ్ళతో దాడులు చేసుకోవడంతో పాటు పార్టీ కార్యాలయాలపైకి దూసుకెళ్ళారు. ఇరుపార్టీల కార్యకర్తలు గాయాల పాలు కాగా వారిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీలకు పనిచేప్పారు. ఇరు పార్టీలకు చెందిన కీలక నాయకులు మాటల యుద్ధంతో దాడికి దిగ్గారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేత రమేష్ బిధూరీ కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ఎంపీ. ప్రియాంక గాంధీ పై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కల్కాజీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఆయన తాను గెలిస్తే స్థానిక రోడ్లను ప్రియాంక గాంధీ వాద్రా బుగ్గల్లా మారుస్తానంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడుతూ రమేష్ బిధూరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో కూడా కాంగ్రెస్ పార్టీ యుత్ కాంగ్రెస్ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టిన నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా గాంధీభవన్ నుండి బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అప్పటికే అక్కడ వున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని తొపులాటతో పాటు పరస్పర దాడులకు దిగ్గారు. కార్యాలయ ముట్టడికి వచ్చిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను బీజేపీ నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర ఘర్షణ చోటు చేసుకుని కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపై రాళ్లతో దాడి చేశారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తతగా మారడంతో బీజేపీ- కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇరు పార్టీలకు చెందిన పలువురు నేతలకు గాయాలయ్యాయి. అప్పటికే అక్కడ వున్న పోలీసులు వారిని అదుపుచేయలేకపోవడంతో అధనపు బలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. చివరకు లాఠీలకు పనిచెప్పి కార్యకర్తలను అక్కడి నుంచి చెదరగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా వుండగా విషయం తెలుసుకున్న నగరంలోని బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా గాంధీభవన్ ను ముట్టడించాలని నిర్ణయించిన బీజేపీ శ్రేణులు బీజేపీ కార్యాలయం నుండి బయటకు వచ్చి గాంధీభవన్ వైపు ముందుకు సాగారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు నాయకులను కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట జరగడంతో పోలీసులు మరోసారి లాఠీలకు పనిచెప్పారు. పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

పేలిన మాటల తూటలు,....

విషయం తెలిసిన వెంటనే ముందుగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఇలా ఇతర పార్టీ కార్యాలయాలపై దాడి చేయడం సరికాదని మందలించారు. కాంగ్రెస్ సంస్కృతి ఇది కాదని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని హెచ్చరించారు. ఈ విషయంలో పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో చర్చించాలని అయన నిర్ణయించారు. అదే విధంగా విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మరో కేంద్ర మంత్రి బండిసంజయ్, ఎంపీలు డి.కె.అరుణ, ధర్మపురి ఆరవింద్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండించారు. తాము తలచుకుంటే కాంగ్రెస్ నాయకులు కనీసం బయటకు కూడా రాలేరంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

65 ఐటి, ఇద్దరు పీఆర్ఓల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 65 ఐ.టి. ఇన్స్ పెక్టర్, ఇద్దరు పీఆర్ఓ పోస్టులను భర్తీ చేయడానికి నేటి నుండి ఈనెల 10 వతేదీ వరకు దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఐ.టి.ఇన్స్ పెక్టర్లకు ఎంటెక్, బీటెక్, ఎంసీఏ లలో కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు, పీఆర్ఓ పోస్టులకు జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసి కనీసం పది సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్టులకు ఆసక్తి చూపే అభ్యర్థులు ఈనెల 10 వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా మాసబ్ ట్యాంక్ లోని దేశోద్ధారక భవన్ తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో దరకాస్తుఫారాలను పొంది అప్లై చేయాలని, మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సంస్థ నేడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

ఆసుపత్రికి అదనపు నిధులు ఇవ్వండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని 30 పడ కల కేశంపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి అదేవిధంగా షాద్ నగర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రికి అదనపు నిధులు మంజూరు చేయగలరని అరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహ కీ షాద్

నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. కేశం పేట్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రికి అదనంగా 22.80 లక్షల రూపాయలు కేటాయిస్తే ఉపయోగంలోకి వస్తుందని తెలిపారు. అలాగే షాద్ నగర్ లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ ఆసుపత్రికి అదనంగా 5.31 కోట్ల రూపాయలు కేటాయిస్తే మార్చరి, మోడ్రన్ కిచెన్, మెకానికల్ లాండ్రి,కాంపౌండ్ వాల్,సీసీ రోడ్డు,పార్కింగ్ షెడ్,బయో మెడికల్ వెస్టేజి భవనం లాంటి నిర్మాణాలు పూర్తి అవుతాయని తెలిపారు.కేశం పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం షాద్ నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి అయితే నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించటానికి మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకర్ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన మంత్రి అదనపు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సత్వర సేవలందించాలి..!

ఉద్యోగులకు ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ సూచన

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి ఇంజినీర్స్

అసోసియేషన్, టీజీవో, టీఎన్జీవో, ఫైనాన్స్ వింగ్ డైరీ, టేబుల్ క్యాలెండర్లను ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... వినియోగదారులు ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది జలమండలి ఉద్యోగులు, సిబ్బంది అంతా కఠిన పరిస్థితులు ఎదుర్కొని నిలిచారన్నారు. వేసవిలో తాగునీటి డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. జలమండలి ఉద్యోగుల విధి నిర్వహణలో రోజూవారీ సమస్యలను పరిష్కరించే పరిస్థితి ఉందని, ఉన్న శక్తి మొత్తం అందుకే ఖర్చవుతుందని అభిప్రాయపడ్డారు. దీని వల్ల ఇతర పనులపై దృష్టి సారించలేకపోతున్నట్లు చెప్పారు. రోజూవారీ సమస్యల్ని పరిష్కరించే బదులు అసలు వాటిని శాశ్వతంగా పరిష్కరించడమే ఉత్తమని యోచించి ఒక డ్రైవ్ మోడ్‌లో 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన అనతి కాలంలో ఫలితాలు రావడం ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ డ్రైవ్ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. మరో 90 రోజుల పాటు కొనసాగించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అందుకే మరో 90 రోజుల పాటు దీన్ని కొనసాగించనున్నట్లు పునరుద్ఘాటించారు. ఈ సారి వేసవిని ఎదుర్కోవడానికి సైతం సిద్ధంగా ఉన్నట్లు ఎండీ తెలిపారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ... జలమండలి ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బోర్డు ఉద్యోగులు గతేడాది వేసవిలో సమర్థంగా పనిచేశారని చెప్పారు. ఈ సారి సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీ.ఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్లు స్వామి, అమరేందర్ రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ టీ.వీ శ్రీధర్, జేఈఏ అధ్యక్షుడు రాజశేఖర్, టీజీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి, టీఎన్జీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహేష్ కుమార్, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు వికలాంగ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూనియన్ బ్యాంక్ వికాలాంగుల ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యాలు ఉన్న వ్యక్తుల రోజు వారి జీవితం అనేక సమస్యలతో అనేక ఒడిదుడుకులతో కొనసాగుతుంటుందని, అలాంటి ఇబ్బందులు నాకు వ్యక్తిగతంగా అలాంటి సమస్యలు సుపరిచితమైనప్పటికీ వైకల్యాలున్నటువంటి వ్యక్తులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఇతర వైకల్యాలు కలిగినటువంటి వ్యక్తుల హక్కుల కోసం, వారిని చైతన్యం చేయడం కోసం ముందు వరుసలో ఉండి వైకల్యాలు కలిగిన వ్యక్తులే పోరాడడం అనేది సకలాంగులైనటువంటి వ్యక్తులందరికీ ఒక ప్రేరణ కలిగించేటువంటి విషయమన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల పోరాటాలు చేస్తూనే వారిని చైతన్యం చేస్తూ మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్తూ వైకల్యాలు కలిగిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నుండి ఇతరులు కూడా ప్రేరణ పొందాల్సిన అంశమన్నారు. హక్కులు పోరాటాల ద్వారా మాత్రమే పొందగలమని, హక్కుగా బతకాలంటే సమాన అవకాశాలు పొందాలన్నా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు నిర్మించాలన్నారు. సమాన అవకాశాలు సమాన భాగస్వామ్యం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హెలెన్ కిల్లర్, లూయిస్ బ్రెయిలీ, స్టీఫెన్ హాకిన్స్ స్ఫూర్తితో ముందుకెళ్లడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్ లేబుల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి రాజశేఖర్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.స్వామి నాయక్, నాయకులు హరిలాల్, రంగప్ప పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు కేటీఆర్ కు చెంపపెట్టు

విప్ అది శ్రీనివాస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : చట్టం తన పని తాను చేసుకుంటూ పోయినప్పుడు కేటీఆర్ ఊచలు లెక్క పెట్టాల్సి వస్తే అది ఆయన కర్మ అంటూ ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఫార్ములా ఈ కార్ రేసులో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి చెంపపెట్టులాంటిదని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. ఈ కేసును లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానించిన కేటీఆర్ క్వాష్ పిటిషన్ వేశాడని కానీ ఇపుడు కేటీఆర్ జైలుకు పోతాడనే భయం బీఆర్ఎస్‌కు పట్టుకుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవినీతి అక్రమాల నుంచి ప్రజలను డైవర్షన్ చేయడానికి హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నాడని, హరీష్ రావు రాజకీయ కక్ష సాధింపు చర్యలని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. గతంలో ఇదే బీఆరెస్ అధికారంలో ఉన్నప్పుడు మా రేవంత్ రెడ్డి పైన వందకు పైగా కేసులు పెట్టారని మరి ఆ కేసులన్నీ రాజకీయ కక్ష సాధింపుతోనే పెట్టినవా అనే విషయాన్ని మాజీమంత్రి హరీష్ రావు స్పష్టం చేయాలన్నారు. కేటీఆర్ సిరిసిల్లకు వస్తే ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేశారని గుర్తు చేశారు. ఎలాంటి తప్పు చేయకుంటే విచారణకు వెళ్లడానికే కేటీఆర్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు. ఏసీబీ అధికారుల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేకనే విచారణకు వెళ్లలేదని అన్నారు. రైతు భరోసా ప్రకటనతో రైతులు సంతోషంగా ఉన్నారని, సంతోషంగా లేనిది బీఆర్ఎస్ పార్టీ నే అన్నారు. గతంలో వారు చేసిన అవినీతి, అక్రమాల వల్లనే కేటీఆర్ ఊచలు లెక్కపెడతారన్నారు.

జిహెచ్ఎంసిలో వేతనాలు తీసుకుంటూ... రాంకీకి ఏజెంట్‌గా వ్యవహారం..!!

విశాలాంధ్ర - హైదరాబాద్ : మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లి వార్డుల్లోని పలు ప్రాంతాల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం పర్యటిం చారు. మక్త పెద్ద కుడి చెరువు చెత్తతో కూడి వ్యర్థాలు తొలగించక పోవడంతో అపరిశుభ్రంగా ఉండడంపై రాంకీ సంస్థ నిర్వాహకులపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసిలో వేతనాలు తీసుకుంటూ రాంకీ లాంటి సంస్థలకు ఏజెంట్‌గా పని చేస్తున్న అధికారులు ఉన్నంత కాలం శానిటేషన్ పనులు సక్రమంగా సాగవనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఏళ్ళ తరబడి ఒకే విభాగంలో కొనసాగుతూ పని చేస్తున్న సంస్థకే కన్ను వేసే విధంగా అధికారులు తీరు ఉండడం సోచనీయమని పలువురు ఇంజనీరింగ్ విభాగం సిబ్బందే పేర్కొంటున్నారు. గ్రేటర్ ఉన్నతాధి కారులు ఎందరో బదిలి అవుతూ పలువురు పోస్టులు కూడ మారుతూ వస్తున్నాయి. కానీ ఈ అధికారి పోస్టు మారదు. అధికారి బదిలి కారు. అంత బలంగా తిష్ట వేయడానికి ఏ శక్తి ఈ అధికారి అండగా నిలుస్తోం దోనని పలువురు సిబ్బంది ఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఏ అధికారి అయినా ఎక్కువల ఎక్కువ 5ఏళ్ళు ఒకే చోట ఉంటారు. కానీ ఈ అధికారిని మాత్రం ఏడెనిమిది ఏళ్ళుగా ఉంటున్నా ఆయన్ను కదిలించే ఉన్నతా ధికారే లేకపోవడం పలువురుని విస్తుపరుస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గ్రేటర్‌లో శానిటేషన్ విభాగం పనులు నిర్వహిస్తున్న రాంకీకి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ అధికారే ప్రజా ప్రతినిధులను, ఉన్నతాధికారులను అనుసందానం చేస్తూ వారి నుండి అన్ని రకాల ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. అందుకే ఈ అధికారిని ఎవరు కదిలించలేని పరిస్థితి నెలకొందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ అధికారి దన్‌సింగ్ ఉన్న సయమంలో సస్పెండ్ అయ్యారని, మళ్ళి వచ్చి శానిటేషన్ విభాగంలో తిష్టి వేశారని పలువురు ఇంజనీరింగ్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ అధికారి తీరు తిన్నింటి వాసాలు లెక్కపెట్టే సామెతను గుర్తు చేస్తుందని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో అలాంటి అధికారులపై చర్యలు తీసుకోకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఇలాంటి వారిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటారా లేదా అనే సందేహం పలువురి సిబ్బందిలో వ్యక్తం అవుతోంది. నాలుగేళ్ళుగా ఉన్న మేయర్ కూడ ఈ అధికారి తీరుపై దృష్టి సారించకపోవడం గమనార్హం. కొత్తగా వచ్చిన కమిషనర్ అయినా ఈయన గారిపై దృష్టి సారించేనా అనే సందేహం పలువురిలో వ్యక్తం అవుతోంది.

ప్రజల సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నారని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూర్ గాంధీ సెంటర్లో సీఎం ,డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం మరియు రేషన్ కార్డుల విషయంలో ప్రకటించిన నిర్ణయాలకు రైతులు సంబరాలు జరుపుకుంటున్నారన్నారు. ప్రతి ఏడాది రైతులకు ?12,000 అందించనున్నట్లు సీఎం ప్రకటించారన్నారు. ఈ పథకం ద్వారా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం మరియు వ్యవసాయం పై ఆధారపడి ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం లక్ష్యంగా ఉంటుందని,రేషన్ కార్డు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలకు కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు, పట్టణ మరియు మండల నాయకులు, మహిళ నాయకులు, యూత్ నాయకులు, పార్టీ శ్రేణులు, తదితరులు, పాల్గొన్నారు.

బంజారా గిరిజన యువకుడికి అరుదైన గౌరవం

-డాక్టరేట్ పొందిన బంజారా ముద్దుబిడ్డ రవి....
-భాగ్యనగర్ తండా వాసికి ఉస్మానియా డాక్టరేట్ ప్రదానం....

విశాలాంధ్ర - కారేపల్లి : నిరుపేద కుటుంబంలో పుట్టి కృషి పట్టుదలతో చదివి బంజారా యువకుడు డాక్టరేట్ పట్టా ఉంది అరుదైన అవకాశం దక్కించుకున్నాడు. సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ శివారు సామ్యతండా గ్రామానికి చెందిన గుగులోత్ ధర్మ-దస్లీ దంపతుల కుమారుడు గుగులోత్ రవికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సిబిఐటి ప్రొఫెసర్ స్వామిదాస్పర్యవేక్షణలో రిలయబుల్ డేటా అగ్రిగేషన్ స్కీమ్స్ ఫర్ ఐ.ఓ.టీ.నెట్ అనే అంశంపై రవి సమర్పించిన పరిశోధనపై ఉస్మానియా యూనివర్సిటీ ఈ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు బంధుమిత్రులు డాక్టరేట్ సాధించిన రవిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్,సొసైటీ డైరెక్టర్ బానోతు హిరాలాల్,మాజీ ఎంపీటీసీలు బానోత్ రాంచందర్,ఆలోత్ ఈశ్వరినందరాజ్,మాజీ సర్పంచ్ లూ గుగులోత్ మంగ్లీ భగవాన్ దాస్,ఇస్లావత్ సుజాత,బన్సీలాల్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుగులోత్ భీముడు, భిక్కులాల్,లావుడ్యాఈర్యనాయక్,బానోత్ రాందాస్,వాంకుడోత్ బాబా, భూక్యా సక్రియ,వాంకుడోత్ గాంధీ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ రైతు పక్షపాతి : టిపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - ఆమనగల్లు,: పదేళ్ల బీఆర్ఎస్ అరాచక, దుర్మార్గపు పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టారని టిపీసీసీ సభ్యులు ఆయిల్లా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో మాజీ జెడ్పిటిసి సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ జైపాల్ రెడ్డి పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ టిపీసీసీ సభ్యులు ఆయిల్లా శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా లతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎంఏ ఖలీల్, టౌన్ అధ్యక్షులు వస్పుల మనయ్య, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, ఎంఏ అలీం, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, శ్రీపాల్, అండెకర్ రాజశేఖర్, బాబా, సురేష్ నాయక్, కండే సాయి, ఎస్ఎస్యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, మైసయ్య, నాజర్, మహేష్, కోప్పు విజేందర్, కృష్ణయ్య, సురేష్ పాల్గొన్నారు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: గత పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులో ఊబిలో నెట్టి రాష్ట్రాన్ని దివాళా తీసారని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే,రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేశం పెట్ ,కొందుర్గ్ తోపాటు వివిధ మండలానికి సంబదించిన136 మందికి రూ.1,36,15,776 ల కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను 30మంది లబ్దిదారులకు రూ. 13,93.500- ల ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా చెక్కులను పంపిణి అందజేశారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ...అర్హులైన ప్రతి లబ్దిదారులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఒకే రోజు దాదాపు 1కోటి 50 లక్షల పై చిలుకు చెక్కులను అందిచడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దని సభ ముఖంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ , తిరుపతి రెడ్డి, రఘు, ఇబ్రహీం, బస్వం అప్ప ,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి: రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు మంథనిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి మంథని పట్టణంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 24 కోట్ల 5 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంథని పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 30 కోట్లతో రోడ్లు, డ్రైయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ రాజయ్య , ఈఈ సంపత్ , ఏ. ఈ. మౌనిక , సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తి చేస్తా: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: నేను పేదరికంలో అన్ని అనుభవించా మీకు ఆ కష్టం రానివ్వను అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన సొంత ఖర్చులతో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ..నేను కూడా నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ఎమ్మెల్యేగా ఈరోజు మీ ముందు నిలబడ్డానని ఆయన విద్యార్థులతో అన్నారు. ఇంటర్మీడియట్ దశ విద్యార్థులకు అత్యంత కీలకమైందని, ఇక్కడ మీరు గట్టి పునాదిని ఏర్పరచుకుంటే భవిష్యత్తులో దేన్నైనా సాధించగలరని, ఎంత పెద్ద చదువులైనా చదవగలరని ఆయన అన్నారు. విద్యా అనే ఆయుధం మన దగ్గర ఉంటే ఎలాంటి స్థితిగతులనైనా అధికమిస్తామని ఆయన పేర్కొన్నారు. తాను మాత్రమే కాకుండా తాను చేసే ప్రతి పని వెనుక తన నాయకులు, కార్యకర్తలు కూడా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అందరి సహకారంతోనే ఇలాంటి సేవా కార్యక్రమాలను చేయగలుగుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, రఘు,చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య,చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాల్రాజ్ గౌడ్, సూర్య ప్రకాష్, అగునూరు బస్వం, జమ్రుద్ ఖాన్, కృష్ణారెడ్డి, ఖదీర్, రవి, అశోక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మేడిపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ మేడిపల్లి వారి ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2025, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆఫీస్ లో క్లబ్ అధ్యక్షులు వేముల కేశవ నాదం గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్లబ్ ఇన్స్టాలేషన్ చైర్మన్ అశోక్ సార్, సెక్రెటరీ పల్లె బాలరాజు గౌడ్, ట్రెజరర్ సందీప్, క్లబ్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ అమరేందర్, ఉపాధ్యక్షులు మహేందర్ రావు, ఊటికొండ రాజు, శారద, లావణ్య, సావిత్రి, దుర్గా, చందన, సదానందం గౌడ్, సారా శ్రీనివాస్ గౌడ్, నరసింహచారి, కిషోర్, మధు గౌడ్, సీనియర్ లైన్స్ క్లబ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో

ఫైవ్ మంత్రా డిజిటల్ కంటెంట్ ప్రదర్శన

ప్రారంభించిన మంత్రి రాజనర్సింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫైవ్ మంత్రా డిజిటల్ కంటెంట్ చాలా బాగుంది అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా పోలేపల్లి సెజ్ లోని ఎస్వీకెఎమ్ స్కూల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఫైవ్ మంత్రా డిజిటల్ కంటెంట్ ప్రదర్శనను ఆయన మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం డిజిటల్ బోర్డు వినియోగం ద్వారా డిజిటల్ కంటెంట్ విద్యార్థులకు బోధించే విధానాన్ని ఆయన పరిశీలించారు. పదవతరగతి సోషల్, సైన్స్ , బయోలాజికల్ సైన్స్ పాఠ్యాంశాలు డిజిటల్ బోర్డు పైన కంటెంట్ ను బోధించమని ఉపాధ్యాయులను అడిగి డిజిటల్ పాఠ్యాం శాలను ఆసక్తిగా విన్నారు. డిజిటల్ కంటెంట్ విద్యార్థులు ఉప యోగించడం ద్వారా మహబూబ్ నగర్ నియోజకవర్గం లో పదవ తరగతి ఫలితాలు 23శాతం పెరిగినట్లు అధికారులు ఇచ్చిన రికార్డు ద్వారా తెలిసిందని, 2డి 3డి అనిమేషన్ ద్వారా విద్యార్థు లకు పాఠ్యాంశాలు ఇంకా అద్భుతంగా అర్థం అవుతాయిని ఆయన మంత్రికి తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మంచి ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యేని అభినందించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, పోటీ ప్రపంచంలో మన పిల్లలు కూడా ముందు ఉండాలంటే అడ్వాన్స్ టెక్నాలజీ అందించాల్సిన అవసరం, బాధ్యత మనపైన ఉందని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఫైవ్ మంత్రా డిజిటల్ కంటెంట్ ను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేవిధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని ఆయన చెప్పారు. డిజిటల్ కంటెంట్ ను విద్యార్థులకు అందించే ప్రయత్నం ముందుగా మహబూబ్ నగర్ లో అమలు చేస్తున్నందుకు ఎమ్మెల్యేని మంత్రి అభినందించారు. ఈ కార్యక్ర మంలో జడ్చర్ల, మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జియంఆర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ ఉన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె విరమణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయీస్ , జిసిసి హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్ల ఒప్పందం అమలు చేస్తూ వెంటనే జి.ఓ. విడుదల చేయాలని, జనవరి 1 నుండి 7 వరకు 7 రోజులు జరిగిన రాష్ట్ర వ్యాపితంగా సమ్మెను కొనసాగిస్తుండగా మంగళవారం ఎర్రమం జిలోని జలసౌధ ఇరిగేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో పౌరసర ఫరాల శాఖామాత్యులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు తదితరులతో కూడిన ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో అక్టోబర్ 4న జరిగిన వేతన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను వెంటనే పెంచి అమలు చేయాలని చాడ వెంకట్ రెడ్డి మంత్రికి వివరిం చగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ 2 రోజుల్లో జి.ఓ.ను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా సమ్మెను విరమించాలని కోరినారు. అక్టోబర్ 4న జరిగిన ఒప్పందంలో భాగంగా పెరిగిన హమాలీ రేట్ల బకాయిలను చెల్లించాలని కోరగా చెల్లిస్తామని అదే విధంగా స్వీపర్లకు, హమాలీలకు యూనిఫాం కుట్టుకూలితో సహా చెల్లిస్తామని, బోనస్‌ను రూ.7500లు చెల్లిం చేందుకు నిర్ణయం తీసుకున్నామని, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటు బాక్సు రూ.900లకు పెంచిన అగ్రిమెంట్ ప్రకారం ఇస్తామని హమాలీలు ఆందోళన చెందొద్దని మంత్రి విజ్ఞప్తి మేరకు కార్మిక సంఘాల నాయకులుగా ఎఐటి యుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సధాకర్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, రాష్ట్ర, జిల్లాల నాయకులతో సంప్రదించి మెజార్టీ నిర్ణయం ప్రకారం సమ్మెను విరమిస్తున్నామని ప్రకటించారు. ఐక్యంగా సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేసిన సివిల్ సప్లయీస్ , జిసిసి హమాలీ సోదరులకు సహక రించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

వంట కార్మికులను తొలగించకుండా జిఓ విడుదల చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావణి అధ్యక్షతన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో ఎండిఎం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకుండా విద్యార్థులకు రెండు కూరలు మూడు కోడిగుడ్లు నాణ్యమైన భోజనం ఎలా అందిస్తారు అన్నారు, దానితో పాటు కోడి గుడ్ల ధరలైతే కొండెక్కి కూర్చున్న సమయంలో కోడిగుడ్లు ఏ మాత్రం అందించలేమని స్పష్టం చేశారు. కోడి గుడ్ల విషయంలో మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల వద్ద మరియు డిఇఓ కార్యాలయాల వద్ద కలెక్టర్ కార్యాలయల వద్ద ధర్నాలు నిర్వహించాలని వినతిపత్రాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్స్ పి.ప్రేంపావణి, జంపాల రవీందర్, సత్తెనపల్లి విజయలక్ష్మి, ఆధి రంగారెడ్డి, బోయిని ప్రసాద్, నిమ్మటూరి రామకృష్ణ, పోలప్పోలు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

విశాలాంధ్ర - శేరి లింగంపల్లి: శేరిలింగం పల్లి డివిజన్‌లోని తారా నగర్, రాజీవ్ గృహ కల్ప,గోపినగర్, నెహ్రూ నగర్, బాపునగర్ పలు కాలనీలలో నూతన సీసీ రోడ్ల నిర్మాణం కొరకు, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయమని కోరుతూ జిహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి గారిని కోరిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారు. కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతూ..డివిజన్ లోని పలు చోట్ల సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిధుల మంజూరు కోరుతూ వినతి పత్రం అందజేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారు. వారితో పాటుగా డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ ఉన్నారు.

మెయిన్ పట్టాలుగా అసైన్డ్ భూములు..!

29 మంది పలుకుబడున్న వారి పేరుతో పట్టాలుగా

60 మంది లబ్ధిదారుల అసైన్డ్ భూములు

లబ్ధిదారులకు తెలియకుండానే మార్చేసిన తహశీల్దార్

తమ తప్పిదం లేదటూ బుకాయిస్తున్నన అధికారులు

విశాలాంధ్ర - నిర్మల్ : ప్రభుత్వ పాలనలో అందరూ శాకాహారులే రొయ్యల ముల్లె ఎక్కడ అన్న చందంగా మారిన రెవెన్యూ వ్యవస్థ, వివరాల్లోకి వెళితే,, ఖానాపూర్ తాసిల్దార్ కార్యాలయం వారు అందించిన ఆధారాల ధ్రువపత్రం ప్రకారం అసైన్డ్ భూములు పట్టాలుగా మార్చే జీవో ఏమీ లేదు లావుని పట్టా భూములు అనగా జీవన ఆధారం కోసం కేటాయించబడి దారిద్రరేఖకు దిగువన బ్రతుకుతున్న రైతులకు అందించిన భూములు అంతేకానీ వారికి అమ్ముకోవడానికి ఎటువంటి అధికారం లేదు అమ్మిన కొన్న వారు ఇద్దరూ నేరస్థలే అని అసైన్డ్ పట్టా ల రెవెన్యూ చట్టం చెబుతోంది అంటూ ఆధారాలు అందించినప్పటికీ మేడమ్ పల్లి గ్రామ శివారులోని రెవెన్యూ శాఖ ప్రకారం లావుని పట్టగా గవర్నమెంట్ ల్యాండ్ గా గుర్తింపు ఉన్న 108 సర్వే నెంబర్ గత్త సంవత్సరాల క్రితం అందించిన అసైన్డ్ పట్టా భూములు అట్టి సర్వే నెంబర్ 147 ఎకరాల 20 గుంటల భూముల్లో 60 మంది పట్టేదారుల అయినటువంటి రైతుల పేరు మీద ఉన్నటువంటి భూమిలో గత 2018 సంవత్సరం నుండి ఈ మధ్య కాలంలో 29 మంది, సమాజంలో హోదా పలుకుబడి కలిగిన రైతుల తదితర పేర్ల మీద మెయిన్ పట్టాలుగా మారినవి మండల మేజిస్ట్రేట్ అయినటువంటి అధికారి నయాబ్ తాసిల్దార్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ల తప్పిదం ఏం లేదంటారా ఇలా మారడానికి ఇంకా లోతుగా వెతికితే ఏక్ బాల్ పూర్ శివారులో ఉన్నటువంటి లాభాని పట్టా భూముల్లో సర్వేనెంబర్ 72 లో రెవెన్యూ లెక్కల ప్రకారం 62 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో 3 7 మంది పట్టేదారుల ఉన్నటువంటి భూమిలో ఆర్ఓఆర్ లెక్కల ప్రకారం 13 గుంటల సి లక్ భూమిలో ఖానాపూర్ పురపాలక సంఘానికి సంబంధిత డంపింగ్ యార్డ్ కు ఎకరం పై చిలుకు భూమి, రెవెన్యూ శాఖ,పురపాలక శాఖకు అందివ్వడం ఎలా సాధ్యపడింది అంతేకాకుండా 72 బై 13, 72/20 సర్వే నంబర్ లోని వ్యవసాయ భూమిలో 2018 సంవత్సరానికి పూర్వము ఉమా అనే పేరు పై కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూ గత ధరణి వెబ్సైట్ పొందుపరిచిన నాటి నుండే సాలవ్వ పోసులు, అనే పేర్ల మీదికి సెల్ డిడి ద్వారా చేతులు మారినట్టుగా ఆధారాలు రెవెన్యూ శాఖ లెక్కల ప్రకారం చూపిస్తున్నప్ప టికీ ఈ తప్పిదం మాది కాదు అంటూ చేతులు దులిపేసుకుంటు, చేతులు దులిపేసుకుంటున్న అధికారులు అని మేధావి వర్గాలు ఆరోపిస్తున్నారు.

రేవంత్ కేసుకు, కేటీఆర్ కేసుకు పొంతన ఏంటి ?

- ఖచ్చితంగా విచారణకు హాజరు అవుతాం
- మాజీమంత్రి హరీష్ రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో అరెస్ట్ అయిన కేసుకు ప్రస్తుతం బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల కేసుకు అసలు ఎలా పొంతన కుదురుతుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. గతంలో రేవంత్ రెడ్డి డబ్బుల కట్టలతో కెమెరాల ముందు దొరికి జైలుకు పోయాడని కానీ కేటీఆర్ మాత్రం తెలంగాణ కోసం హైదరాబాద్ బ్రాండ్ ఈమేజి కోసం ఫార్ములా ఈ రేస్ తీసుకువచ్చాడని పేర్కొన్నారు. మంగళవారం నాడు కేటీఆర్ క్వాష్ పిటీషన్ పై హైకోర్టు తీర్పు వచ్చిన తరువాత బంజారాహిల్స్ లోని కేటీఆర్ నివాసంకు చేరుకున్న మాజీ మంత్రి హరీష్ రావు విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం కేటీఆర్ అక్రమ కేసుకి పోల్చడం అంటే మోకాలికి బోడి గుండుకి ముడి వేయడమే అంటూ వ్యాఖ్యానించారు. మా పై ఎన్ని రకాల కేసులు పెట్టిన మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పైన వెనకకిపోమని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా నువ్వు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేదాకా నీ వెంట పడతామని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. అక్రమ కేసులతోనూ అరెస్టులతోనూ మమ్మల్ని బలహీనపరచాలని రేవంత్ రెడ్డి కుట్ర చెల్లదన్నారు. ఎన్ని రకాల కేసులు పెట్టిన రేవంత్ రెడ్డిని వదిలిపెట్టమని, హైకోర్టులో ఇచ్చిన తీర్పు కేసులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదని స్పష్టం చేశారు. కేసులో అవినీతి ఉందని శిక్ష వేసిన తీర్పు కాదని, ప్రభుత్వం అవినీతి జరిగింది అని చెప్పినప్పుడు, విచారణ చేసుకోమని కోర్టు చెప్పిందని తెలియజేశారు. గతంలో కూడా కేటీఆర్ విచారణకు సిద్ధమని చెప్పామని ఇపుడు కొత్తగా తపించుకోవాల్సిన అవసరం మాకు లేదన్నారు. ఈ అంశంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనే అంశం పైన మా లీగల్ సెల్ నిర్ణయిస్తుందని, హైకోర్టు తీర్పు కాపీని పూర్తిగా చదివిన తర్వాత మా లీగల్ సెల్ సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. మొన్న ఏసీబీ దగ్గరికి కూడా విచారణ ఎదుర్కోవడానికి కేటీఆర్ వెళ్లారని, 9వ తేదీన కూడా ఇచ్చిన నోటీసు మేరకు విచారణకు వెళ్తారన్నారు. మొన్న 45 నిమిషాలు ఆపిన కేటీఆర్ ఓపిగ్గా వేచి చూశారని, కచ్చితంగా విచారణను ఎదుర్కొంటామని చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పెంచడం కోసమే ఫార్ములా ఈ ని కేటీఆర్ హైదరాబాద్ కి తెచ్చారని, ఇదే రేసును తమ రాష్ట్రాలకు నగరాలకు తీసుకురావడానికి అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయని గుర్తు చేశారు. ఒక్క రూపాయి కూడా చేతులు మారనప్పుడు అవినీతి ఎట్లా జరుగుతుందని ప్రశ్నించారు. కేటీఆర్ అడుగడుగునా రేవంత్ రెడ్డి తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే ఈ కేసు పెడుతున్నారని విమర్శించారు. అటేషన్ డైవర్షన్ కోసమే రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, రైతుబంధు ఎగగొట్టడం వల్ల ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. అన్ని సర్వే రిపోర్టులు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వస్తున్నాయని, అందుకే మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైన అక్రమ కేసు పెట్టి అటెన్షన్ డైవర్షన్ కోసం రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని ఆరోపించారు. భవిష్యత్తులోను ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కోసం కేసులు రేవంత్ రెడ్డి పెడతాడని మాకు తెలుసన్నారు. ఎన్నో పోరాటాలతోనే త్యాగాలతోని తెలంగాణ తెచ్చుకున్నాము ఇపుడు తెలంగాణ ప్రజల అభివృద్ధి సంక్షేమమే తెలంగాణ అభివృద్ధిని మా పార్టీకి ముఖ్యమన్నారు. రేవంత్ రెడ్డిని కూడా ఫార్ములా ఈ కంపెనీ కలిసిన ఇప్పటిదాకా ఆ విషయం బయట పెట్టలేదన్నారు. రైతు భరోసాను తగ్గించి ప్రజలకు ఇస్తున్నందుకు వారి నుంచి వచ్చే వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి ఈ కేసు అన్నారు. ఇది కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమే అని ఎన్ని రకాల కేసులు పెట్టిన ఎన్ని రకాల కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడిన తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామన్నారు. కేటీఆర్ కడిగిన ముత్యంల బయటకి వస్తారని, ఎలాంటి తప్పు చేయలేదన్న ధైర్యం ఉంది కాబట్టి విచారణకి వెళ్తామన్నారు. కోర్టులో వచ్చిన తీర్పు పైన కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కానీ హైకోర్టు చెప్పింది కేవలం విచారణ మాత్రమే చేయమని అనే విషయాన్ని వారు గ్రహించాలన్నారు. విచారణ ప్రారంభం కాకముందే తప్పు జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. కొంతమంది హైకోర్టు తీర్పును తప్పుడుగా వక్రీకరిస్తున్నారని, కేటీఆర్ పైన పెట్టిన కేసు తూఫెల్ కేసు అంటూ వ్యాఖ్యానించారు. గ్రీన్ కోకి రూపాయి లబ్ధి చేయనప్పుడు వారు ఎందుకు మాకు తిరిగి డబ్బులు ఇస్తారని, అదే గ్రీన్కో కంపెనీ ఫార్ములా అయ్యే నిర్వహణలో భారీగా నష్టపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి నుంచి డబ్బులు వచ్చాయనడం అర్థరహితమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే విశాలాంధ్ర లక్ష్యం

విశాలాంధ్ర-దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే విశాలాంధ్ర ప్రధాన లక్ష్యమని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి వెల్లడించారు. విశాలాంధ్ర దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ జోన్ ఇంచార్జి శంకర్, రిపోర్టర్ మధు, స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు.అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నూతన కథనాలతో, ప్రజా సమస్యలే పరిష్కారం లక్ష్యంగా విశాలాంధ్ర దినపత్రిక పనిచేయడం అభినందనీయమన్నారు.అదే విధంగా రానున్న రోజుల్లో విశాలాంధ్ర దినపత్రిక మరింత అభివృద్ధి చెందలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోటీలలో భాగంగా ప్రైవేట్ అథ్లెటిక్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో విభాగాలలో వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో క్రీడా నైపుణ్యత ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సావిత్రిబాయి పూలే జయంతిని ఉమెన్ టీచర్స్ డే గా ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు : ప్రొ.బాగయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సావిత్రిబాయి పూలే జయంతిని ఉమెన్స్ టీచర్స్‌డేగా ప్రకటించిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి సావిత్రి బాయి పూలే ఫౌండేషన్ సలహాదారు ప్రొఫెసర్ బాగయ్య, అధ్యక్షులు గోపి, సీఈఓ పరమేశ్వరి, జనరల్ సెక్రటరీ శారదలు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేకి భారతరత్న ప్రకటించాలని సావిత్రి బాయి పూలే ఫౌండేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం గుర్తించి మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆరవ తరగతి నుండి పై చదువులు చదివే ప్రతి విద్యార్థినులకు ఆర్గానిక్స్ ప్యాడ్స్ ప్రభుత్వం ఉచితంగా సప్లై చేయాలని కోరారు. వెనుకబడిన బీసీఏ గ్రూప్ నుండి ఒక మహిళకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎ. రాణి సభ్యులు మంజుల, జానకి రెడ్డి, అశోక్, అలివేలు, సలీం పాల్గొన్నారు.

తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కే వి రమణారావును ఎన్నిక..

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఎన్నికలలో ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షు నిగా రెండవసారి కె.వి రమణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉత్కర్ రాజేంద్రనాథ్, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ జూమ్ సమావేశం ద్వారా అభినందనలు తెలిపి వివిధ జర్నలిస్టుల సమస్యలపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ జీతం లేని ఉద్యోగంతో ఒక సమయం అంటూ లేకుండా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేసే వారే జర్నలిస్టులని, కొనియాడుతూ నిజమైన జర్నలిస్టులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ, ఎన్ యు జె మాజీ అధ్యక్షులు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ మెంబర్, టీజేఏ, జాప్ గౌరవ సలహాదారుడు ఉప్పల్ లక్ష్మణ్ , మాజీ ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, టిడిపి స్పోర్ట్స్ పర్సన్ డాక్టర్ ఏఎస్ రావు తదితరులు సమావేశానికి హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలుపుతూ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ కు మద్దతుగా జర్నలిస్టు సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మాజీ అధ్యక్షులు మోహన్ యాదవ్,మహమ్మద్ గోరి, మహమ్మద్ ఖలీల్, హఫీజ్,షైక్ హసీనా, హబీబ్, హరీష్, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వి సూర్యనారాయణ రెడ్డి, తమిళనాడు రాష్ట్రం నుండి ఎన్ యుజే కన్వీనర్ రవి మీనాక్షిసుందరం , టీజేఏ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కమిటీ సభ్యులు, టీజేఏ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నాట్య గురువులు నాగసుధా గోపాల్, సురేఖ ప్రసాద్, మాగంటి వసుధ, శిష్య బృందాలు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కమ్యూనిస్టు భావజాలం స్ఫూర్తిదాయకం

- మత ప్రాతిపదికన బీజేపీ పాలన
- కమ్యూనిస్టులు, లౌకిక వాదులు ఏకం కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- 'వందేళ్ల ఉద్యమ గీతిక' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఎంతో మంది త్యాగధనుల పోరాటాలు, ఘన ఉద్యమ చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీ భావజాలం నేటి తరాలకు స్ఫూర్తిదాయక మని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. దేశంలో కాంగ్రెస్ తర్వాత పురాతన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అనీ, ఈ తరుణంలో పార్టీ శత వార్షికోత్సవం సందర్భంగా..పార్టీ ఘన చరిత్రను, ఉద్యమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందని ఆయన సూచించారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ చంద్రం బిల్డింగ్స్ ఆవరణలో మంగళవారం విశాలాంధ్ర దినపత్రిక ముద్రించిన 'వందేళ్ల ఉద్యమ గీతిక' ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి నిర్వహించింది. ఈ ప్రత్యేక సంచికను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి, విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు,న్యూస్ ఎడిటర్ మోదుమూడి మురళీకృష్ణ స్టేట్ బ్యూరో చీఫ్ చావా రవి, విశాలాంధ్ర సీపీఐ శాఖ కార్యదర్శి ప్రత్తిపాటి మధుసూదన్‌రావు ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సభకు కూన అజయ్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ, వందేళ్ల ఉద్యమ గీతిక ప్రత్యేక సంచికకు కృషి చేసిన ఎడిటోరియల్ సిబ్బందిని ఆయన అభినందించారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్థానంలో అనేక మంది ప్రముఖులు ప్రత్యక్ష ఉద్యమాల్లోను, చట్ట సభల్లోను కీలక పాత్ర పోషించారని విశ్లేషించారు. కమ్యూనిస్టు అగ్రనేతల్లో పీసీ జోషి తన 28 ఏటే పార్టీ పగ్గాలు చేపట్టారని, ఆయన హయాంలోనే ఏఐకేఎస్, ఏఐఎస్ఎఫ్, ఇప్టా తదితర ప్రజా సంఘాలు వచ్చాయని వివరించారు. పార్టీ అగ్రనేతలు అజయ్‌ఘోష్, నంబూద్రీపాద్, ఇంద్రజిత్ గుప్తా తదితరులు పార్టీకి విశేష సేవలందించారని తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) సుదీర్ఘకాలం పాటు బాధ్యతలు వహించి, ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత ప్రాతిపదికన సమాజాన్ని చీల్చి..తద్వారా తన రాజకీయ మనుగడ కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఈ తరుణంలో కమ్యూనిస్టులు, ఇతర లౌకిక పార్టీలు సమైక్య స్ఫూర్తితో బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. హిందూమతం ప్రమాదంలో పడిందంటూ బీజేపీ, ఆరెస్సెస్ శక్తులు దిగజారుడు ప్రచారానికి ఒడిగడుతున్నాయని మండిపడ్డారు. హిందూమతం బూచీతో మైనార్టీలను, క్రైస్తవులను అణచివేసే చర్యలకు పాల్పడుతోందన్నారు. అందుకు నిదర్శనంగా కేంద్ర కేబినెట్‌లో ముస్లిములకు ఒక్కరికీ చోటు ఇవ్వకపోడమేనని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రంలోనూ మైనార్టీలు..18శాతం ఉండగా..వారికి టిక్కెట్లు ఇవ్వలేదన్నారు. దేశంలోని ముస్లిములను రెండో శ్రేణిగా బీజేపీ చూస్తున్న విధానాల్ని రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఒక వైపు మతం అజెండా, మరో పక్క కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగిస్తూ, వారి ఆస్తులను రెట్టింపులు చేసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పోకడలున్నాయని తూర్పారబట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అదానీ లాంటివారిపై పార్లమెంట్‌లో చర్చ జరగ కుండా చూడటం సిగ్గుచేటర న్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, అవినీతిని నిర్మూలించడంలో బీజేపీ విఫలమైందని చెప్పారు. హైందవ శంఖారావం తదితర పేర్లతో మతోన్మాద ఉనికి కోసం ప్రాకులాడుతోందని విమర్శించారు. ఈ తరుణంలో సీపీఐ శత వసంతాల సందర్భంగా పార్టీ చరిత్రను, ఉద్యమాలను, కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక విధానాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వందేళ్ల ఉద్యమ గీతిక ప్రత్యేక సంచిక స్ఫూర్తితో మరింతగా ప్రత్యేక సంచికలను వెలువరించాలని దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ, దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి, వారి సమస్యలపై పోరాడిన ఏకైక పార్టీ సీపీఐ అని అభివర్ణించారు. దళిత, గిరిజనులు, మైనార్టీలు, పేద వర్గాల సమస్యల తరపున అనేక చారిత్రాత్మక ఉద్యమాల్ని పార్టీ నిర్వహించిందని తెలిపారు. భూ సంస్కర ణలకు చట్టాల కోసం సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు అధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు కొనసాగాయని గుర్తుచేశారు. సీపీఐ ఉద్యమాల పరంపరలో భూపోరాటాల చరిత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని వివరించారు. ఇలాంటి వందేళ్ల ప్రస్థానం చరిత్ర కలిగిన పార్టీలో మనమంతా భాగస్వాములు కావడం సంతోషించ దగిన విషయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగే సీపీఐ శత వసంత ముగింపు సభలో పార్టీ విజయాలను, పోరాటాలను మననం చేసుకోనున్నామని చెప్పారు.

దేశ సంపద కార్పొరేట్ల వశం

అదాని, అంబానీలకే మోదీ ప్రాధాన్యత: గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి 11 ఏళ్లుగా ఎన్డీఏ ప్రభుత్వం అహోరాత్రులు కష్టపడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభలు జరిగాయి. ముందుగా పట్టణంలోని చందనూరు కళ్యాణ మంటపంలో ఏఐవైఎఫ్ జెండాను సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆవిష్కరించారు. అనంతరం సభావేదికపై ఈశ్వరయ్య జన్మదినం సందర్భంగా సీపీఐ నాయకులు భారీ కేక్‌కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ 1952–2014 మధ్య 14 మంది ప్రధాన మంత్రులు దేశాభివృద్ధి కోసం రూ.55 లక్షల కోట్లు అప్పు చేస్తే 11 సంవత్సరాల మోదీ పాలనలో అప్పులు రూ.106 లక్షల కోట్లకు చేరాయని మండిపడ్డారు. ఎన్డియేతర ప్రధాన మంత్రులు దేశంలో ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, విమానాశ్రయాలు, రైల్వేలు, బ్యాంకుల జాతీయాకరణ, జాతీయ రహదారుల నిర్మాణం చేపడితే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక... వాటన్నింటినీ ప్రైవేట్ రంగానికి మళ్లించారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులను జైలుకు పంపుతున్నారని, కార్పొరేట్లకు ఊడిగం చేసి... దేశాన్ని అమ్ముకోవడం బీజేపీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం నానాటికి పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్, మణిపూర్, జమ్మూకాశ్మీర్లలో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా కూడా ప్రధాని గాని, కేంద్ర మంత్రులుగానీ ఖండించలేదని పైగా మహిళా సాధికారత సాధిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పర్చూరి రాజేంద్రప్రసాద్, లెనిన్ మాట్లాడుతూ... పరిశ్రమల్ని నెలకొల్పి యువతకు ఉద్యోగాలు కల్పించే దృష్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేవన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ బళ్లారి జిల్లా (కర్నాటక) అధ్యక్షులు బసప్ప, రాయదుర్గం నియోజకవర్గం ఇంఛార్జ్ నాగార్జున, ఏఐవైఎఫ్ నాయకులు కొట్రేష్, ఆంజనేయులు, సీపీఐ నాయకులు మల్లికార్జున, తిప్పేస్వామి,సంతోష్ కుమార్, సంజీవప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొల్లాయి స్వామి, అంజి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

బహిరంగ సభకు ముందు స్థానిక ప్రభుత్వ వసతి గృహం నుండి వేలాదిమంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చెక్క భజనలు, డప్పు వాయిద్యాల మధ్య నాయకులు ఊరేగింపుగా జూనియర్ కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రభుత్వ వసతి గృహం నుండి లక్ష్మి బజార్ మీదుగా ప్రభుత్వాసుపత్రి నుండి కనేకల్ రోడ్డు మీదుగా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రధాన రహదారులు ఎర్రజెండాలతో నిండిపోయాయి.

తమిళనాడుకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు నల్లకన్నును చెన్నైలోని తన నివాసంలో సత్కరిస్తున్న పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ తమిళనాడు నాయకుడు మూర్తి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, రామకృష్ణ సతీమణి కె.సుజాత, రాష్ట్ర నాయకులు పంచదార్ల దుర్గాంబ.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేదెన్నడు?

- కూటమి సర్కారుకు ముప్పాళ్ల సూటి ప్రశ్న
- హామీల అమలులో విఫలమైందని విమర్శ

విశాలాంధ్ర –తాడేపల్లిగూడెం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసి... అందులో గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఆర్థిక సహాయం అందించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై సీపీఐ అధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెంలోని 24వ వార్డు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఇళ్ల స్థలాల కోసం పేదల తరపున అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ... గతంలో మాజీ సీఎం జగన్ సెంటు స్థలం ఇచ్చి కేంద్రం ఇచ్చిన రూ.లక్షా ఎనభై వేలను తానే ఇచ్చినట్లు ప్రచారం చేసుకున్నారన్నారు. ఇచ్చిన స్థలాలు కూడా ముంపు ప్రాంతంలో ఉన్నాయని, 32 లక్షల ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చి గాలికొదిలేశారని విమర్శించారు. జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాల భూ సేకరణలో పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణం జరిగిందని ముప్పాళ్ల దుయ్యబట్టారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణంపై చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 10న తహసిల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని, వచ్చే నెలలో కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాక పోతే ఇళ్ల స్థలాల సాధన సమితి ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో బతుకుతున్న పేదలు అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి సత్వరమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యు.జయకృష్ణ, దాస్యం రాము తదితరులు అధ్వర్యం వహించారు. అధిక సంఖ్యలో పేదలు పాల్గొన్నారు.

గందరగోళంలో కూటమి సర్కారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో గందరగోళంలో ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. హామీలు అమలులో తాత్సారం, డొంక తిరుగుడు విధానాలకు పాల్పడటం ప్రజలను మోసగించడమేనని మండిపడ్డారు. మంగళవారం తణుకు సీపీఐ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు, విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు అదే బాటలో పయనిస్తూ ప్రత్యక్షంగా రూ. 8వేల కోట్లు, రెగ్యులేటరీ అథారిటీ పేరుతో మరో రూ.11వేల కోట్లు ప్రజలపై మోయలేని భారం మోపడం దారుణమని విమర్శించారు. రెగ్యులేటరీ అథారిటీ సుప్రీం కాదని ప్రభుత్వం కనుసన్నల్లోనే నడుస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అదాని 1750 వేల కోట్లను నాటి సర్కారు పెద్దలకు ముట్టచెప్పినట్లు వచ్చిన వార్తలపై కూటమి సర్కారు ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదని ఆయన ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులపై, అడ్డంగా దోచేసిన నాయకులపై కూటమి ప్రభుత్వం చర్యలు లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదని... తేమ, తాలు పేరుతో రెండు మూడు వందలు తెగ్గోస్తున్నారని తెలిపారు. ఇతర పంటలదీ అదే పరిస్థితి అని ఆయన ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ముప్పాళ్ల స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించబోమని, విశాఖ ఉక్కుకు గనులు కేటాయిస్తామని స్పష్టమైన హామీని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ప్రకటించేలా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒత్తిడి తేవాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు,సీపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్ప కుమారి, పట్టణ సమితి సభ్యులు బొద్దాని కృష్ణ కిషోర్, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం, లాభం

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: పకృతి సేద్యంతో ప్రజలకు ఆరోగ్యం, రైతులకు లాభదాయకమని ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్తు, అత్తలూరిపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఎండీ సురేంద్రబాబు పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలో ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ కార్యాలయంలో మంగళవారం 'ప్రకృతి సేద్యంలో ప్రతిబంధకాలను అధిగమించి రైతుకు లాభదాయకత పెంచడానికి చేపట్టాల్సిన చర్యలు'పై సమావేశం జరిగింది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలపై వివిధ జిల్లాల్లో జరిపిన సమీక్షల అనంతరం ప్రకృతి సేద్యంపై ఉన్న అపోహల నివృత్తి కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దేశంలో ప్రకృతి సేద్యం వృద్ధి చెందే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ రైతులను ప్రోత్సాహకాలతో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆర్గానిక్ ఫార్మింగ్ హబ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ చేపట్టారన్నారు. దేశీ ఆవులను ప్రకృతి సేద్యంలో భాగస్వామ్యం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పాలు, పెరుగు, నెయ్యితో పాటు వ్యవసాయానికి అవసరమైన సహజ ఎరువులు ఉత్పత్తి లభ్యం అవుతుందన్నారు. ఆవు వ్యర్థాలతో తయారయ్యే ఘన, ద్రవ జీవన అమృతం, కషాయాల వినియోగంతో ప్రకృతి సేద్యం సాగులో అత్యధిక ఉత్పాదకత సాధించవచ్చని లంకా దినకర్ తెలిపారు.

పునరుత్పాదక శక్తిలో నైపుణ్యాభివృద్ధికి సుజ్లాన్-ఏపీఎస్ఎస్డీసీ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: దేశంలోనే అతిపెద్ద విండ్ ఎనర్జీ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్, ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మంగళవారం ఉండవల్లి నివాసంలో రెండు పక్షాలు ఎంఓయూ చేసుకున్నారు. ఇందులో భాగంగా సుజ్లాన్ సహకారంతో యాంత్రిక, ఎలక్ట్రికల్, బ్లేడ్ టెక్నాలజీ, సివిల్, లైసెనింగ్ వంటి కీలక రంగాల్లో 12 వేల మందికి శిక్షణ ఇస్తారు. యువత, మహిళలు, ఎస్‌టీఈఎం గ్రాడ్యుయేట్ల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఒప్పందం ముఖ్య ఉద్దేశం. క్లీన్ ఎనర్జీలో జాతీయ, అంతర్జాతీయ అవకాశాల కోసం ప్రపంచ నైపుణ్యాలను పెంపొందించడమే ఎంఓయూ ప్రధాన లక్ష్యం. విండ్ ఎనర్జీలో పేరొందిన సుజ్లాన్ సంస్థ ఇప్పటికే భారతదేశం, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో శిక్షణార్థులకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ విండ్ ఎనర్జీ రంగంలో ఏపీ యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు పొందేందుకు సుజ్లాన్‌తో చేసుకున్న ఒప్పందం దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజ్లాన్ గ్రూప్ సిఇఓ జేపీ చలసాని, సిహెచ్ఆర్ఓ రాజేంద్ర మెహతా, టాలెంట్ మేనేజ్‌మెంట్ లీడ్ కమిలిని సన్యాల్, పాఠశాల విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రీన్ స్కిల్లింగ్‌పై స్వనీతి ఇనిషియేటివ్‌తో ఒప్పందం

రాష్ట్రంలో గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ మరో కీలక ఒప్పందం చేసుకుంది. ప్రముఖ సామాజిక సంస్థ అయిన స్వనీతి ఇనిషియేటివ్ రాష్ట్రంలో పౌరసేవలను మెరుగుపర్చి, అట్టడుగువర్గాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పన చేస్తుంది. పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో స్వనీతి ఇనియేటివ్ సంస్థ అనుభవం కలిగి ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుంది. కీలకమైన రంగాలు, పరిశ్రమలను గుర్తించి, స్థిరమైన జాబ్ మార్కెట్‌ను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివ ప్రసాద్, అసోసియేట్ తేజ సరియం, పాఠశాల విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం

కేరళ మాజీ మంత్రి ఎంఏ బేబి

విశాలాంధ్ర–విజయవాడ రూరల్: దేశంలో నేడున్న పరిస్థితుల్లో భారత రాజ్యాంగం ప్రమాదం ఎదుర్కొంటోందని కేరళ మాజీ విద్యాశాఖామంత్రి ఎంఏ బేబి అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆరవరోజు మంగళవారం రామోజీరావు సాహిత్యవేదికపై నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ హెచ్.ఎన్. నాగమోహనదాస్ రచించిన ప్రజాశక్తి బుక్ హౌస్ వారి ప్రచురణ 'రాజ్యాంగం మనకేమిచ్చింది?' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగమోహనదాస్ తన రచనలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, గణతంత్రం తదితర విలువలు నేడు ఎదుర్కొంటున్న సవాళ్లను నేర్పుగా వర్ణించారన్నారు. నేడు కొందరు సాంప్ర దాయ విలువల పేరుతో రాజ్యాంగాన్నే ప్రశ్నించడం దురదృష్టకరమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అనేకానేక మేధావులు ఎన్నో చర్చలు, సమావేశాల అనంతరం ఆమోదించిన రాజ్యాంగాన్ని మనుస్మృతి కోణంలో ప్రశ్నించడం దారుణమన్నారు. న్యాయవ్యవస్థతో సహా అన్ని వ్యవస్థలూ సాంప్రదాయ భావాలతో ప్రభావితం కావడం ప్రమాదకరమన్నారు. దేశంలో ఏ నిర్ణయానికైనా రాజ్యాంగం, దాని మౌలిక విలువలే మూలాధారం కావాలన్నారు. రాజ్యాంగాన్ని, దానిలోని ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర విలువలను పరిరక్షించేందుకు అభ్యుదయ శక్తులందరూ ఏకంకావాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో పటిష్టంగా నిర్మించిన మన రాజ్యాంగం మౌలిక స్వభావాన్నీ, దానికి ఎదురవుతున్న సవాళ్లనూ తెలుసుకోవాలంటే ఈ పుస్తకం తప్పనిసరిగా చదవాలన్నారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి టి.మనోహర్ నాయుడు, సాహితీస్రవంతి బాధ్యులు వొరప్రసాద్, ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజరు కె. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు పి.చంద్రనాయక్ అభ్యుదయ గీతం ఆలపించారు.

భారత్‌లో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడి

2030 నాటికి కోటి మందికి శిక్షణ

బెంగళూరు: భారత్‌లో భారీ పెట్టుబడులకు ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సిద్ధమైంది. సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్, ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణ కోసం భారత్‌లో మూడు బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25,712 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల తెలిపారు. అలాగే, 2030 నాటికి కోటి మందికి ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బెంగళూరు వేదికగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్‌లో 3 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెడుతున్నందుకు సంతోషిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పెట్టుబడి భారత్‌లో ఏఐ ఆవిష్కరణలకు ఊతం ఇస్తుందని అభిప్రాయ పడ్డారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ ప్రాంతీయ విస్తరణకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. దేశంలో నలుమూలలా ఏఐ, క్లౌడ్ విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్నాం. 2025 నాటికి 2 మిలియన్ల మందిని ఏఐ నిపుణులగా తీర్చిదిద్దుతామని గతంలోనే ప్రకటించాం. చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా ఏఐ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తాం. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో భారతీయ నిపుణులు ముందు వరుసలో ఉంటారు. ఏఐ ఆవిష్కరణలలో భారత్ పురోగమిస్తోందని వ్యాఖ్యానించారు. సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో చర్చల గురించి మాట్లాడుతూ... ప్రధానితో భారతదేశం టెక్ ల్యాండ్‌స్కేప్ కోసం మైక్రోసాఫ్ట్ విజన్ గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా టెక్నాలజీ, ఏఐ వంటి వాటితో పాటు కొత్త ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలపై కూడా చర్చించినట్లు వివరించారు.

ఏఐకి ప్రాధాన్యం

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధిపత్యం చెలాయిస్తోంది. దీనిని మరింత అభివృద్ధి చేయడానికి, తమ ఉద్యోగులకు కూడా ఇందులో శిక్షణ ఇవ్వడానికి దిగ్గజ సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. ఈ జాబితాలో ఒక్క మైక్రోసాఫ్ట్ మాత్రమే కాకుండా ఇతర కంపెనీలు కూడా ఉన్నాయి.

సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఒక మారు మూల ప్రాంతంలో పుట్టి... చదువుకునే అవకాశం లేకపోయినా భర్త సాయంతో చదువుకుని... తన మేథస్సు, చదువు దేశానికి ఉపయోగపడాలని కాంక్షించి... ఆడబిడ్డల చదువు కోసం దేశంలో మొట్ట మొదటిసారిగా బీజం వేసిన 'సావిత్రీ బాయి పూలే' కు భారతరత్న అవార్డుతో గౌరవించాలని బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై అనేక కీలక అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు ఆయన లేఖ రాశారు. సావిత్రీబాయి పూలే జీవితం మొత్తం పేదల కోసం, ఆడబిడ్డల చదువుల కోసం ధార పోశారని పేర్కొన్నారు. సావిత్రీబాయి 1848లో తొలిసారిగా మహిళల కోసం పాఠశాల ప్రారంభించారని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.